
# కథామంజరి

## పది కథల సమాహారం



సెప్టెంబర్ 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి


**సెప్టెంబర్ 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 9

# అందరికీ

# జన్మాష్టమి

# మరియు

# వినాయక చవితి

# శుభాకాంక్షలు



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి
## సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు
- నందిరాజు పద్మలతా జయరాం గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| కథాపుస్తక విశ్లేషణ | viii |
| అక్షరాక్షతలు | x |


## కథలు


| | | |
|---|---|---|
| కాలం సాక్షిగా... | కాళీపట్నపు పేర్రాజు | 1 |
| ఇచ్చట మంచిపనికి మార్కులు పడతాయి! | ఎనుగంటి వేణుగోపాల్ | 5 |
| దాహం | ఆదోని బాషా | 10 |
| అరుంధతి | అనురాధ | 15 |
| పాత్రమెరిగిన ఫలం | శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు | 22 |
| కలి(సి)విడిగా... | కోనే నాగ వెంకట ఆంజనేయులు | 29 |
| స్నేహితులు | మాచిరాజు కామేశ్వరరావు | 33 |
| కప్పల తక్కెడ | సాయి కమల్ | 36 |
| అమ్మ సహించనిది! | అలపర్తి రామకృష్ణ | 39 |
| మంచి – చెడ్డా | కీ.శే. వీరాజీ | 45 |


Cover Page Credit : Mr Bharadwaj K, Canada



# కథాకీయం

సుమారుగా లలితకళలన్నిటికి గురువులు ఉంటారు. కొండకచో ఏకలవ్యుడు వంటి శిష్యులు కూడా ఉంటారు. కాని రచనలు చేయడానికి గురువులు ఉండరు. కుటుంబ నేపథ్యం లేదా పెరిగిన వాతావరణం, పుస్తక పఠనం వలన కలిగే స్ఫూర్తి.. ఇలా రచయితల పుట్టుక ఉంటుంది. వీటికి తోడు సహజమైన ఆసక్తి, మనిషిలో సహజంగా ఉండే పటిమ.. వీటి వలన కూడా కొద్దిమంది రచయితలవుతారు.

అయితే.. ఈమధ్య కథలు, కవితలు, నవలలు, పద్యాలు.. వ్రాయడానికి గురువులు వస్తున్నారు. ‘కథలు వ్రాయడం ఎలా?’ అనే శీర్షక మీద వ్యాసాలు కూడా సీనియర్ రచయితలు వ్రాస్తున్నారు. సెమినార్లు నిర్వహిస్తున్నారు. ఇలా ఎవరి వీలు బట్టి వారు.. కొత్త తరం రచయితలను తయారుచేయడానికి కృషి చేయడం ముదవహం!


వాడుకభాష సాహిత్యం వచ్చిన తర్వాత కాలాన్ని గమనిస్తే.. ఆ రోజుల్లో హైస్కూలు స్థాయి నుంచి చాలామంది విద్యార్థులకు సాహిత్యం పట్ల జిజ్ఞాస ఉండేది. అలనాటి విద్యావిధానం కొంతమేర కారణమయితే, హైస్కూలు స్థాయిలోనే వార్షిక సంచికలు కూడా దోహదపడేవి. వాటిలో తమ పేరు ముద్రణలో చూసుకోవాలనే తపనతో ఆ వయసులోనే రచనలు చేసేవారు. మరి కొందరికి యుక్త వయసు వచ్చిన తరువాత రచనా ఆసక్తి కలగడానికి కాలేజీలో వార్షిక సంచికలు దోహదపడేవి. ఈ విషయాన్ని గట్టిగా ఎలా చెప్పగలరంటే.. మనకి 1970 ముందు కనబడే రచయితలందరూ సుమారుగా హైస్కూలు, కాలేజీ రోజుల్నుంచి రచనలు చేసేనవారే! ఆ రోజుల్లో రచయితల సరాసరి వయసు ముప్పైకి అటు ఇటు ఉంటే.. ఈ రోజుల్లో అది అరవై సంవత్సరాలు ఉంది! అప్పటి రచయితలు హైస్కూలు, కాలేజీ చదువులప్పుడు సాహిత్యం మీద అభిరుచి పెరిగి, రచనా వ్యాసంగ ప్రవేశం జరిగేది. వర్తమానంలో.. ఆ మాట.. ఏభై ఏళ్ల వయసు తర్వాతే! హైస్కూలు చదువుల్లో తెలుగు భాషకే స్థానం లేదు.. ఇక ఆ విద్యార్థులకు రచనా శక్తి ఎలా వస్తుంది? దీనికి తోడు.. అనుభూతులు కరువైన జీవన విధానం! ఏదైతే నేం.. ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు.. వర్తమాన పరిస్థితులన్ని కలసి, భాష, భాషాసాహిత్యం మీద పడ్డాయి. రెండూ చితికిపోక ముందే రక్షించుకోవలసిన అవసరం ఉంది!

ఈ సమస్యకి పరిష్కారాలు ఉంటాయి! వాటిలో ప్రాధమిక స్థాయిలో.. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అన్ని పాఠశాలలో తెలుగుభాషని తప్పనిసరి చేయాలి. హైస్కూలు స్థాయి నుంచి ప్రతీ పాఠశాల.. విద్యార్థుల చేత కథలు, వ్యాసాలు వ్రాయించి, వాటితో ఓ వార్షిక సంచిక తీసుకురావాలి! ఈ చర్య వలన పిల్లల్లో సృజనాత్మక పెరుగుతుంది. మంచి అనుభూతులు కలిగిస్తాయి. ఇప్పటికీ.. కాలేజీ రోజుల్లో వచ్చిన అలాంటి వార్షిక సంచికల్ని భద్రంగా దాచుకుని.. అపురూపంగా చదువుకుంటున్న వారెందరో ఉన్నారు!

మాతృభాష, భాషా సాహిత్యం వచ్చే తరాలకు అందించాలంటే.. కనీసం ఈ చిన్ని ప్రయత్నాలు చెయ్యాలి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



## శ్రీ అలపర్తి రామకృష్ణ

పాతతరం రచయితలలో చాలామంది సాహిత్యం వైపు అడుగులు వేయించడానికి.. పుస్తక పఠనం, కుటుంబ నేపథ్యం వగైరాలే కాకుండా 'కాలేజీ మేగ్జైన్' లు కూడా దోహదపడేవి. అలనాటి కాలేజీలు.. చదువులకే పరిమితి కాకుండా, ఇలా ప్రత్యక్షంగా ఎంతోమంది తెలుగు సాహితీవేత్తలను అందించాయి. అలా కాలేజీ చదువుల దగ్గర నుంచి తెలుగు సాహిత్య ప్రపంచానికి అడుగులు వేసి, మేటి రచయితలుగా పేరు తెచ్చుకున్న ప్రముఖులు శ్రీ అలపర్తి రామకృష్ణ గారు!

'పుస్తకం చదవడం అంటే జీవితాన్ని చదవడమే. జీవితంలో నుంచే వచ్చే కథల్లోనే జీవం ఉట్టి పడుతుంద'ని అంటారాయన. అనడమే కాదు, తన రచనల్లో ఆ సహజత్వాన్ని ఎక్కడా విస్మరించలేదు. రామకృష్ణ గారికి బాల్యంలో లభించిన అమూల్యమైన పల్లె జీవనం, ఆ వూర్లో కనబడిన ఆహ్లాదకరమైన వాతావరణం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, మనుషుల మధ్య కనబడే బంధాలు, మమకారాలు, నైతిక విలువలు, సంగీత సాహిత్యాల పట్ల ఆ రోజుల్లో ఉండే గౌరవాలు.. ఇవన్నీ ఆయన రచనలలో ప్రస్ఫుటంగా కనబడతాయి. ఎత్తుగడ కథని చదివించడానికి దోహదపడితే.. ఆ కథ ముగింపు పాఠకుల్ని ఆలోచనల్లోకి దింపడమే కాకుండా, పది కాలాల పాటు హృదయాలలో నిలిచిపోతుందనడానికి రామకృష్ణగారి కథలే ఓ ఉదాహరణ! 1966లో "తెలుగు వెలుగు" పత్రికలో ప్రచురింపబడిన "లోగుట్టు పెరుమాళ్ళకెరుక" కథతో రచనా ప్రస్థానం మొదలెట్టిన రామకృష్ణగారు... బాల్యం నుంచే కథలు రాయడం ఆరంభించినా.. అవి తిరుగుటపాలో రావడాలు... అందులో సంపాదకుల కామెంట్స్ చూసి నవ్వుకోడాలు.. ఇలా చేదు అనుభవాలను చూసి నిరుత్సాహ పడకుండా, వాటిని అపురూపంగా దాచుకుని, నిరంతరం కృషి చేసి, రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. దరిమిలా చిన్న నీటిపాయలా... వారపత్రికలో అడపాదడపా కథలు ప్రచురణ అయిన తర్వాత, రామకృష్ణ గారి రచనలు నదీ ప్రవాహంలా మారిపోయాయి. ఇప్పటి వరకు వీరివి మూడు వందలకు పైగా కథలు, ముప్పై నవలలు దాదాపు అన్ని పత్రికలలో వచ్చాయి. వాటిలో చాల వాటికి బహుమతులు కూడా వచ్చాయి.

కొత్త తరాల వారికి గ్రామాలను పరిచయం చేయవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఆ వాతావరణం.. ప్రతీ వారికి తెలియాలనే ఉద్దేశం ఒకటే కాదు, అది మనిషి ఉనికికి అవసరం కూడా! ఈ ఆలోచనలతోనే రామకృష్ణ గారు గ్రామీణ వాతావరణంలోనే కథలు వ్రాయడానికి ఇష్టపడతారు. మనదేశంలో దాదాపు అన్ని ప్రాంతాలను సందర్శించడమే కాకుండా, అమెరికా కూడా తిరిగొచ్చిన రామకృష్ణ గారు.. ఆ ప్రయాణాల మీద కూడా కథలు, నవలలు వ్రాసారు. చలం, తిలక్, పెద్దిబొట్ల సుబ్బరామయ్య.. రచనలంటే ఇష్టపడే రామకృష్ణ గారు గుంటూరు జిల్లా పొన్నూరు గ్రాయంలో పుట్టారు. తిరుపతి, గుంటూరు, ఇండోర్‌లో చదువు, తర్వాత రాజ్య ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, అంచెలంచెలుగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రాష్ట్ర రాజధానిలో సెక్రటేరియట్ లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసి, 2006లో పదవీ విరమణ చేసారు. భార్య, ఇద్దరు అబ్బాయిలు.. స్థిరనివాసం హైదరాబాదులోనే!

తెలుగు భాష మీద అభిరుచి ఏర్పడడానికి కారకులు తన ఉపాధ్యాయులే అని ఆనందంగా వారిని స్మరించుకునే శ్రీ అలపర్తి రామకృష్ణ గారు.. ఈ విశిష్ట అతిథిగా విచ్చేసి తన సాహితీ ప్రస్థానం గురించి ఎన్నో సంగతులు పంచుకున్నందులకు వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వారి నుంచి మరిన్ని కథలు రావాలని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. వీరాజీ**

చాలామంది రచయితలు కలం పేరుతో రచనలు చేయడానికి ఇష్టపడతారు. అలా కలం పేరుతో రచనలు చేసేవారి అసలు పేరు తెలుసుకోడానికి పాఠకులు కుతూహలంతో ఉంటారు. కొన్ని సందర్భాలలో కలం పేరే స్థిరపడి, అసలు పేరు వారే మర్చిపోయినవారు కూడా ఉన్నారు. చివరికి ఆ రచయిత ఇంట్లో, బంధు వర్గాల్లో కూడా ఆ కలం పేరే వినబడేది. అలా కలం పేరు స్థిరపడటానికి.. ఆ పేరు గొప్పతనం కాదు, ఆ రచయిత అందించిన రచనల వలన ఆ పేరుకి 'పేరు' వచ్చిందని చెప్పాలి. అలా కలం పేరుతోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన బహు కొద్దిమంది రచయితలలో 'వీరాజీ' ఒకరు! ఆయన అసలు పేరు 'పిళ్ళా కృష్ణమూర్తి'.

కథ నవలా రచయితగానే కాకుండా పత్రికా సంపాదకుడిగా బాగా పేరు తెచ్చుకున్న వీరాజీగారు.. పన్నెండవ ఏటే కలం పట్టి, తుది శ్వాస వరకు రచనలు చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా నవలా రచనలో వీరాజీగారికి మంచి పేరుంది. ఆయన పగలంతా చదివి, రాత్రంతా రాసేవారుట! ఏ విషయాన్నైనా పరిశీలన చేసే గుణం, కథా వస్తువుని ఒడిసి పట్టే నైపుణ్యం, పాత్రలను సజీవంగా చిత్రించగలిగే రచనాశక్తి, ప్రశ్నించే గుణం, లోతుగా ఆలోచించే స్వభావం.. వీటితో పాటు సమాజం పట్ల బాధ్యత.. వీరాజీగారిని ఓ మంచి రచయితగానే కాకుండా.. జర్నలిస్టు కూడా నిలబెట్టాయి. సగటు మనిషి చూట్టూనే వీరాజీగారి కథలు ఉంటాయి. లోపల జర్నలిస్టు, బయట నోవలిస్టు అని ఆయన గురించి చెప్పుకున్నా.. ఆయన హ్యూమనిస్ట్, హ్యూమరిస్ట్ అని ఆయనని తెలిసిన వారందరూ అంటారు. సహజంగా ఉన్న ప్రతిభ ఉన్నా, నిజానికి ఆయన కృషి, శ్రమ.. ఆయనకి పేరు తెచ్చి పెట్టాయి! ఆయన వ్రాసిన కథలు.. కరివేపాకు, కోతి–భీతి, జవరాలి చిత్తం, చావు బ్రతుకులు, తాపత్రయం, ప్లాట్ ఫారమ్, దెయ్యం, మునగచెట్టు .. వంటి కథలు, వెలక్కాయంత రాతిగవ్వ, తొలి మలుపు.. వంటి నవలలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. "సుఖం కోసం" అనే నవల.. ఇటాలియన్ భాషలోకి కూడా అనువదింపబడింది. అయితే ఇవాన్నీ ఒక ఎత్తు అయితే.. వీరాజీ గారి 'సామాన్యుడి సణుగుడు' శీర్షిక మీద వ్రాసిన వ్యాసాలు, ఆయనకు ఎక్కువ పేరు తెచ్చాయి. ఓ రకంగా ఆ శీర్షిక.. వీరాజీగారి జీవితంలో టర్నింగ్ పాయింట్ అని చెప్పుకోవచ్చు. అలాగే 'పాలాక్షుడి డైరీ' శీర్షిక మీద వ్రాసిన వ్యాసాలు.. కథల్లా పేరు తెచ్చాయి. ఈ వ్యాసాలు చదవడానికే చాలామంది ఆ పత్రిక కొనేవారు.

1940 జూలై 30 తేదిన విజయనగరంలో జన్మించిన వీరాజీగారు.. ఆంధ్రా యూనివర్సిటిలో ఫిజిక్స్‌లో పి.జీ. చేసినప్పుడు.. ఆయనో కలెక్టరో, పోలిసాఫీసరుగానో చూద్దామని వారి తల్లిదండ్రులు భావించారుట. కాని ఆయన పత్రికారంగం వైపు అడుగులు వేసారు. అప్పటికే తన కాలేజీ చదువులో తెలుగు పాఠాలు చెప్పిన విశ్వనాధ సత్యనారాయణ గారు, ఇంగ్లీషు పాఠాలు చెప్పిన జొన్నలగడ్డ సత్యనారాయణ గార్ల ప్రభావంతో రచనలు చేయడం ప్రారంభించారు. 19వ ఏటే నవల వ్రాసారు. ఆ రోజుల్లోనే వీరి కథలు "భారతి" పత్రికలో ప్రచురితమయ్యాయి. 'ఆంధ్రపత్రిక'లో 1961 లో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగంలో చేరిన తర్వాత ఇక వెనక్కు చూసే పరిస్థితి రాలేదు. 1991లో ఆంధ్రపత్రిక మూతపడిన తర్వాత కూడా వీరాజీ గారి కలం

ఆగలేదు. రచనలతో పాటు.. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చేవారు. పోటీ పరీక్షలకు వెళ్ళేవారి కోసం "అరచేతిలో విశ్వవిజ్ఞానం" పేరుతో రచనలు చేసారు.

ఇలా ఎన్నో సమాజాన్ని జాగృతి పరిచే రచనలు చేస్తూ, తన జీవితాన్నే అంకితం ఇచ్చిన వీరాజీగారు 2021 ఆగష్టు18న అంతిమ శ్వాస విడిచారు. అయితే నిన్న, నేడు, రేపటి తరాలు.. రచయితగా, పాత్రికేయుదుగా, మంచి వక్తగా, విజ్ఞానవేత్తగా గుర్తు పెట్టుకోవలసిన వీరాజీ గారు తెలుగు సాహితీరంగంలో చిరంజీవిగానే నిలిచి ఉంటారనీ ఆశిస్తూ .. ఆయనకి నివాళి అర్పిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## కీ. శే. వేలూరి వేంకటేశ్వరరావుగారి కథ “స్వర్గంలో స్ట్రిప్ టీజ్”

ఒక శాస్త్రవేత్తగా, తెలుగు రచయితగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, సాహిత్య విమర్శకుడిగా ఎంతో కృషి చేసిన వేలూరి వేంకటేశ్వరరావుగారు ఈ సంవత్సరం ఫిబ్రవరిలో పరలోకానికి వెళ్ళిపోయారు. ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయన జీవితం ప్రారంభించి, ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి, అమెరికాలో డాక్టరేటు చేశారు. అమెరికాలో స్థిరపడ్డ ఆయన డయాస్పోరా కథలంటే ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్నిచ్చి, ఆ కథలకు నాందీ వచనం పలికారు. కథలతో పాటు ఆయన పాతిక సాహితీ వ్యాసాలు, రెండు అనువాదాలు (ఒరియా కవి సౌభాగ్య కుమార్ మిశ్రా రాసిన కవితలకు అవ్యయ, దాసుపర్ణ అనే తెలుగు అనువాదాలు) రాశారు. అంతేకాక ‘ఈమాట’ అంతర్జాల పత్రికకు సంపాదకులుగా ఆ పత్రికను అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచ తెలుగు రచయితలకు ఒక వేదికగా తీర్చిదిద్దారు.

వేలూరిగారి కథల గురించి చెప్తూ వాసిరెడ్డి నవీన్‌గారు “వేలూరి కథలు.. అమెరికా తెలుగు వాళ్ళ వ్యవహార శైలిపై సుతి మెత్తగా చురకలంటించిన వ్యంగ్య కథలు” అంటారు. ‘మరో వేలూరి ఎప్పుడొస్తారో’ (‘గోమేజ్ ఎప్పుడొస్తాడో’ అన్న ఆయన రాసిన ప్రసిద్ధ డయాస్పోరా కథను అనుకరిస్తూ) అంటూ ఆయనకు నివాళి పలికారు ఈనాడు సంపాదకులు. వేలూరిగారికి ప్రాచీన ఆధునిక సాహిత్యంతో పాటు ఫోటోగ్రఫీ, చిత్రకళలపై కూడా లోతైన అవగాహన ఉన్నదని చెబుతారు.

వేలూరిగారి సాహితీ జీవనం యాభై ఏళ్ళ పైగానే కొనసాగినా, ఆయన రాసిన కథలు తక్కువే. ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నప్పుడు రూపకల్పన చేసి ప్రదర్శించిన ‘కావ్యదహనోత్సవం’ దగ్గరనుంచి చివరి వరకూ ఆయన చేసిన ఎంతో విస్తృతమైన ప్రయాణం తెలుగు సాహితీ చరిత్రలో, ముఖ్యంగా డయాస్పోరా ప్రపంచంలో చిరస్మరణీయం.

ఆయన రాసిన ‘ఆ నేల, ఆ నీరు, ఆ గాలి’ కథల సంపుటంలో 27 కథలున్నాయి. అందులో ఒకటి ‘స్వర్గంలో స్ట్రిప్ టీజ్’. పురాణ చారిత్రక పాత్రలతో వ్యంగ్యం, హాస్యం మిళితం చేసి రాసిన కథలలో ఇది ఒకటి. వ్యంగ్యం ప్రతి వాక్యంలోనూ చోటు చేసుకుంటుంది.

చాలామంది భారతీయులకొచ్చిందిట వెయ్యికళ్ళ మహేంద్రుడి దగ్గర నుంచి ఆహ్వానం! అయినా అందరికీ రాదుగా మరి! ‘తెలుగుదేశంలో కులాల అంతస్తుల లాగానే, స్వర్గంలో కూడా హెచ్చుతగ్గులు ఉండడం’ ఆశ్చర్యమా? స్వర్గంలో మహేంద్రుడుగారు తనదైన ఫక్కీలో ప్రతి ఏడాదిలాగే ఒక ఉత్సవం జరిపిస్తున్నారు. ఆ ఉత్సవంలో ముఖ్య ఘట్టం స్ట్రిప్ టీజ్.

ఈ స్ట్రిప్ టీజ్‌కి ఎవరంటారా ఆహ్వానితులు? ఋషులు, మహాఋషులు! రచయిత మాటలలో, “రాసినందుకు నన్ను, చదివినందుకు మిమ్మల్ని వాళ్ళు శపించక ముందే వాళ్ళని గురించి ముందుగా చెప్పుకుందాం”. నాలుగు దిక్కుల నుండి వచ్చారు. మీకు తెలిసిన ఋషుల పేర్లు తల్చుకోండి. అందరూ ఉన్నారక్కడ. వీళ్ళు ఎంత ముఖ్యులంటే, మళ్ళీ రచయిత మాటలలోనే “మన అమెరికా తెలుగువాళ్ల ఉత్సవాలలో రెండు తోకల సిల్కు బాడ్జీలు పెట్టుకుని హడావుడిగా అటూ, ఇటూ

తిరిగే వాళ్ళకి కాస్త అనుకోండి". ఇక ప్రపంచంలోని రాజకీయనాయకులు, ఫిలాసఫర్లు, ఇక మన తెలుగు రచయితలు, కవులు – విశ్వనాథ, శ్రీశ్రీ, గురజాడ, చలం, జాషువా, వీళ్ళే కాదు.. జెనరల్స్, ఔరంగజేబు దగ్గర నుంచి అయూబ్ ఖాన్ దాకా! ఓహో, మన గాంధీ, నెహ్రూ, బిజూ పట్నాయక్ ఇలా ఒకరేమిటి, ఇంద్రుడుగారి రాజకీయ లౌక్యానికి ఉదాహరణే మరి!

ఇక వేదిక, అలంకారాలు గురించి చెప్పాలా? మరి ఆతిథ్యమో? అమెరికా వాడి కోకి, పెప్సీ తప్పిస్తే మిగతా అన్నీ మధుపదార్థాలు ఉన్నాయట. సభకు నారదుడు, తుంబురుడు ఎంసీలట. ఆ విషయం 'బంగారపు రేకు మీద అచ్చేసి, వెండి జలతారు జూలు తోకలుగా కట్టిన ఆహ్వాన పత్రికాలో' వేశారు. ఇంతకీ ఆ పత్రిక ఎలా ఉందిట? "అమెరికాలో తెలుగువాళ్ళ పెళ్ళికి, హైదరాబాదులో అచ్చేసి, తిరిగి అమెరికాలో పోస్ట్ చేసిన పెద్ద సైజు చేటలా ఉంది".

నారదుడు రాలేదు, తుంబురుడుగారు సభ ప్రారంభించారు. అప్సర వేశ్యలు ఒక్కొక్కరే వేదిక మీదకు వస్తున్నారు. వరూధిని కోసం కృష్ణదేవరాయలు ఎదురు చూస్తున్నారట. పెద్దనగారికి కొంచెం గాభరా! కాళిదాసుగారు ఊర్వశి 'పురుషోత్తమా' అనే బదులు 'పురూరవా' అని అంటుందేమోనని ఎదురు చూస్తున్నాడు.

పమిట జార్చి, గజ్జెల ఘల ఘలతో ఊర్వశి తన పృష్ఠభాగం చూపిస్తూ, చీర ముడి సడలించగానే, నెహ్రూ, పెద్దన, గిరీశం వేషంలో గురజాడ, దుశ్శాసనుడు, కెన్నెడీ, వగైరాలు తమ స్మృతిపథంలోకి జారుకున్నారుట. ఇక మేనక.. విక్టోరియా సీక్రెట్ కేటలాగ్ లో బొమ్మలా వయ్యారంగా వచ్చింది. కొందరు మునులు లేచిపోగా, కమ్యూనిస్టులు 'బూర్జువా సంస్కృతి' అంటూ గట్టిగా అరవడం మొదలెట్టారుట.

చివరగా రంభ! గాంధీగారు, వశిష్టుడు, ఐన్‌స్టీనూ కళ్ళార్పకుండా పరీక్షగా చూస్తున్నారు. రంభ ఒక్కొక్కటిగా వలువలను ఇప్పడం ప్రారంభించింది. చివరకు ఆమె వంటి మీద ఉన్నది 'పాడియార్వాన్నియ బంగరు వలువ' మాత్రమే. గాంధీగారికి అనుమానమొచ్చింది, అది కూడా ఆమె ఎందుకు విప్పదూ అని! వశిష్టుడు చెప్పాడు. అది వలువ కాదు, ఆమె బంగారు వన్నె చర్మమని. అయితే ఆ చర్మాన్నే వొలవమనండి అన్నాడు గాంధీ. అది కూడా విప్పితే, రంభకు మిగిలేది మనందరికీ మల్లేనే, ఎర్రని రక్తం మాంసం మాత్రమేనని వశిష్టుడు అన్నాడు కంగారుగా. 'ఓస్ ఇంతేనా, మీరు పొగిడే సౌందర్యం కేవలం చర్మ సౌందర్యామేనన్నమాట. స్వర్గంలో కూడా ఇంతకు మించి వేరే సౌందర్యం లేకపోవడం ఎంత దౌర్భాగ్యం!' అన్నారు గాంధీగారు చిరునవ్వుతో. ఐన్‌స్టీన్ తను అది వరకు చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ, 'ఇటువంటి మాహాపురుషుడు భూమిపైనే కాదు, అమరపురిలో కూడా నడిచి ఉంటాడంటే ఆశ్చర్యపడవలసినదే' అని.


కథలో ప్రతి వాక్యం, వ్యంగ్యంతో కూడినదే. స్థలాభావం వల్ల నేను చెప్పనవి ఎన్నో ఉన్నాయి. ఎవరికి వారు కథ చదువుకోవలసినదే ఆనందించాలంటే! తటస్థంగా ఉండే గాంధీలాంటి కొంతమందిని తప్పిస్తే, మిగతా అందరి దృష్టి వారి వారి రచనలో, రాజకీయ దృక్పథమో, కథలో ప్రతిబింబింపచేస్తారు రచయిత.

ఎంత వ్యంగ్యం ఉన్న కథైనా, చివరికి తాత్వికంగా జీవిత సత్యాన్ని పలికించడం వేలూరిగారికే చెల్లు! మన నేలైనా, స్వర్గమైనా, మనిషైనా, మనిషి ఊహించుకున్న స్వర్గంలో ఉండే అప్సరస అయినా.. చీమూ రక్తాలే అనడం వ్యంగ్యమొక్కటే కాదు, సుఖం ఎక్కడో లేదు, మనం సృష్టించుకున్న పరిధిలోనే వెతుక్కో అని చెప్పడమేగా!

***పరిచయ కర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్***



# కథాపుస్తక విశ్లేషణ




ఈ 'సరాగమాల' ఓ సమ్మోహన రాగం!!

సాధారణంగా ఎక్కువ మంది రచయితలు తాము రాసింది పాఠకులకు సరిగా అర్థం కాదేమో, కాలేదేమో అన్న అనుమాన సందేహంతో మరీ విడమర్చి రాస్తారు/చెప్తారు. కానీ పాఠకులకు కూడా ఓ స్థాయి ఉంటుందనీ, ఉండాలని భావించే రచయిత మెడికో శ్యామ్! వారి కథల్లో కనపడుతున్న వాక్యాల వెనుక, కనబడకుండా రాసిన విషయం ఎక్కువగా ఉంటుంది. మరోసారి అలాంటి అనుభవాన్ని ఇచ్చిన పుస్తకమే 'సరాగమాల' .

చేసిన తప్పుల్ని మళ్ళీ మళ్ళీ చేసే వాళ్ళని మూర్ఖులను కొత్త కొత్త తప్పులు చేసే వాళ్ళని మేధావులు అంటారు. ఏమైనా జీవితం విచిత్రమైన తప్పొప్పుల సరాగమాల. తప్పులు ఒప్పులు కూడా రాగయుక్తంగానే వాయించబడతాయి.. ఇవి సరాగమాల కథలో చివరలో వచ్చే వాక్యాలు!

బురదలోంచి పుట్టాం. బురదలో పెరిగాం. అసహ్యకరమైన, అసభ్యకరమైన బురదలోనే మా జీవితం. పంకజంలా అక్కడా అక్కడా ఒకరు.. కన్నీళ్ల రైన్ లోంచి ఆలోచనల ట్రైన్ లోంచి.. అంటూ రాసిన మధ్యతరగతి జీవితాల చిత్రిక 'ఇదీ మా కథ'లోని వాక్యాలు.

భార్యా బాధితుడైన కవిగారి కథ 'కవిగారి కళత్రం'. అన్నట్లు ఈ కథలో రచయిత వాడిన ''భార్యాటికుడు''అనే కొత్త పదం – కొత్త అంటే కొత్తదని కాదు.. నాకు మాత్రం కొత్తదే! రచయిత రాసిన పదం. ఎందుకైనా మంచిదని నేను ఓసారి డిక్షనరీ తిరగేసా. నిజమే అర్థం సరిపోయింది. అయినా నా పిచ్చి గాని అర్థం సరిపోకుండా ఎలా ఉంటుంది. ఆయన రాయాలని తప్పు రాస్తే తప్ప!

"నీకు ఎవరన్నా కలలోకి వస్తారట కానీ నువ్ ప్రేమించిన అమ్మాయి రాదు". మానసికంగా అనారోగ్యంగా లేరు అన్నంత మాత్రాన మనుషులందరూ మానసిక ఆరోగ్యం కలిగి ఉన్నారని కాదు. ఇవి గీతలు అనే కథలోని గీతలు. ఇంతకీ ఇక్కడ గీత.. గీతలు అనే కథలోని ముఖ్యమైన గీత. అదీ సంగతి..!

వేయబోవని తలుపు. కథ నిండా చెణుకుల చినుకులే ముగింపుతో సహా..

"అబ్బే ఏం లేదండీ!" "ఏమీ లేదంటే ఏదో ఉంది.." ఏదీ లేదన్నప్పుడు ఊరుకోవడం మర్యాదస్తులు చేయాల్సిన పని.

"ఏం పని మీద వెళుతున్నారు ఆ ఊరికి?" 'ఊరికే..'

'అంధ ఆంధ్రత్వ రామా'లకి తలుపులు తెరవాల్సిన అవసరం లేకుండా రాసిన 'వేయబోవని తలుపు' కథ.

నేను చింతా దీక్షితులుగారి కథలు చదవాలి. వటీరావు గురించి తెలుసుకోవాలి.

కొందరు తెరిచిన పుస్తకాలు — కొందరు మూసిన పుస్తకాలు. మూసిన పుస్తకాల హృదయం విప్పనిది. పుస్తకంలో మేటర్ పెరిగినా బరువూ పెరగదు. భారం పెరగదు. కానీ హృదయాలదో! విప్పని హృదయం కథలోనివి. ఇలా రాసుకుంటూ పోతే ప్రతి కథ గురించీ మరలా ఒక కథంత రాయాలి. అందుకే.. అయినా మరి కొన్ని చెప్పి/రాసి ...

పెళ్లి చేసుకోవాలని అనుకున్న అమ్మాయి పెళ్లి. అది అంత తగినవాడు కాని వాడితో! కానీ, పెళ్ళింట్లో పెళ్లి సన్నాయి ఆగిపోయింది. అతని గుండెలో సన్నాయి మోగడం మొదలయ్యింది. వినిపించే సంగీతంలో కంటే వినిపించని సంగీతంలో మాధుర్యం అధికం.. సన్నాయి పాట!

వస్తువు అసహ్యకరంగా ఉంటే విసిరెయ్యగలం. జీవితం అసహ్యకరంగా ఉంటే విసిరెయ్యలేం. విడిచెయ్యలేం.

ఈ అమ్మాయెవరో పత్రహరితంలా వచ్చింది. నా జీవితానికి ఆకుపచ్చదనం, ఆక్సిజనూ తనిస్తే బాగుండును? అన్నట్లు ఓ కథలో ఒక పేరా ఈగ గురించి. రాజమౌళి కంటే ముందే...

ఓ హార్ట్ టచింగ్ మాట — ఎక్కడో ఏకాంత ప్రదేశంలో ఎవరికీ అందని, ఏ సుదూర సీమలోనో.. సాహిత్యాన్ని జీవితం కంటే విలువైందిగా భావించి, సాహిత్యాన్ని పీలుస్తూ సాహిత్యాన్ని జీవిస్తూ ప్రపంచం దృష్టిలో పడని సాహితీకారుల గురించి.. ఏమని తెలుపుదును.. నా మాది తలుపులు? వారి కోసం.. శ్యామ్‌జీ.. వారి తరపున మీకు ధన్యవాదాలు!

ఏ కథ తీసుకున్నా ఒక మంచి అనుభవాన్ని పంచుతాయి. మాటలు మతాబులు విచ్చుకుంటాయి. నింపుకున్నవారికి నింపుకున్నంత! వాక్యాల వెనుక ఉండే వ్యంగ్యం. చురుకు, సరదా, వందల హిందీ పాటల మాటలు... భలే సరదాగా ఉంటాయి. కథలు వెంట వెంటనే చదవాలని అనిపించదు. ఓ మంచి కాఫీ తాగాక నాలుక మీద రుచిని నాలుక తీరా ఆస్వాదించినట్టు... ఒక కథ మనసు తీరా ఆస్వాదించాలనిపిస్తుంది. అనిపించాలి కూడానూ!

చివరగా పెదాల మీదకు నవ్వు తెచ్చే ఇంకో మాట చెప్పి ముగిస్తాను. "ట్రాన్సిస్టర్స్ నిజ భార్యల వంటివి. ఎవని భార్య.. ఎప్పుడు, ఎందుకు, ఎలాగ అలుగునో వానికే తెలియును. అప్పుడు చెయ్యవలసిన రెమెడీ కూడా వాడే ఎరుగును. అలక తీర్చనిదే ఆలీ పలకదు. రేడియో పాడదు.

శ్యామ్ "నా దృష్టిలో కథలు జీవిత దృశ్యాలు. జీవితంలోని అన్ని కోణాలూ, అన్ని సందర్భాలూ, ఆలోచనలూ, ఒకే ఒక జీవితంలో మనకి లభించడం సాధ్యం కాదు. ఒక్కొక్క కథ ఒక్కొక్క జీవితంలో ఒక సంఘటన. ఒక అనుభవం. ఒక దృక్కోణం. ఒక క్షణానికి లేక కొన్ని క్షణాలకి పెన్తో తీసిన ఫొటోగ్రాఫ్. మనల్ని ఆహ్లాదపరుస్తూ, ఆనందపరుస్తూ ఆలోచింప జేసే అవకాశం. మనలోని లోపాలను మనకి చూపగల పరికరం.. లేక వేరెవరిలోనో ఉన్న ఉన్నత భావాలనీ, ఆదర్శాలనీ, గొప్పదనాన్నీ మనకి చూపగల దిక్సూచి లేక మైక్రోస్కోపు! సాటి మానవుణ్ణి అర్థం చేసుకోవడానికీ, ఓదార్చడానికీ కూడా సహాయపడగలవు" ఒక సాహితి ప్రక్రియ కథ గురించి ఇంత కంటే మరో మాట అక్కర్లేదు.

ఇంతా చదివాక ఈయన్ని పట్టుకుని, ఇంట్లో తలుపు చాటున ఉన్న చిలక్కొయ్యకు తగిలించి, బుగ్గల మీద చూపుడు వేలు పోట్లు వేస్తూ "ఏమయ్యా పెద్ద మనిషీ ! ఎక్కువగా రాయొచ్చు కదా?" అనాలనిపిస్తే తప్పేంలేదు. ఒక వేళ ఆయన "మా ఇంట్లో కొబ్బరి నూనె నిండుకుంది అంటే కూడా...!"

**రాంబో**



# అక్షరాక్షతలు

## కథామంజరి ఆరేళ్లు నింపుకుని ఏడో ఏట అడుగుపెడుతున్న సందర్భాన..
## పెద్దల అక్షరాక్షతలు

పెద్దలు చెప్పడమూ పిన్నలు వినడమూ మన సంప్రదాయం! కథ కూడా అంతే!!

కథలు చెప్పడం వచ్చినవాళ్లు.. చెబుతారు. రాని వాళ్ళు.. వింటారు! కథలు వినేటప్పుడు వినే వాళ్ళ ఉత్సుకతని బట్టి ఆ కథని కట్టుకుంటూ వెళతారు. కథకుల కథన నైపుణ్యం పెరగడానికి తక్షణ స్పందనలే గొప్ప ప్రోత్సాహకాలు. కాలం మారుతున్న కొద్దీ, ఎప్పటికప్పుడు మానవజాతి సంస్కరించబడుతూ ఉన్నతీకరించబడుతూ ఉంటుంది. ఆ క్రమంలో "రాసే" కథ పుట్టింది.

చెప్పడం, వినడం పద్ధతి పోయి, రాయడం చదవడం పద్ధతి వచ్చింది! ఫలితంగా సృజనాత్మకతకి, జనాత్మకతకీ లంకె ఏర్పడింది. ఆ లంకె కుదుర్చిందే.. ఆధునిక కథ! ఆధునిక కథ అంటే ఎక్కడో ఉన్నవాళ్లు రాస్తారు. ఇంకెక్కడో ఉన్నవాళ్లు చదువుతారు. మరెక్కడో ఉన్నవాళ్లు ప్రేరణ పొందుతారు. రేడియోలో కథలు వినిపిస్తారు. కనుక శ్రోతలకి వినే అవకాశమే గానీ చదివే అవకాశం ఉండదు.

కథంటే వినిపించేదీ.. వినేదీ! ఆధునిక కథంటే రాసేదీ చదివేదీ! చదవడానికీ, వినడానికీ కూడా అవకాశం కల్పించిన మొట్టమొదటి అంతర్జాల పత్రిక కథామంజరి! ఇందులో కథలు చదువుకోవచ్చు వినుకోవచ్చు. చదువుకోవడం ద్వారా మనలోని సృజనాత్మకతని పెంచుకోవచ్చు. వినడం ద్వారా తెలుగువాళ్ళు మర్చిపోతున్న తెలుగుని శ్రవణానందకరంగా వినవచ్చు. అంతే కాదు ఇప్పటి తెలుగు ఉచ్చారణలో వచ్చిన, వస్తున్న మార్పుల్ని కూడా అధ్యయనం చేయవచ్చు.

నిజానికి తెలుగు నుడికారం.. ఆంగ్ల పలుకుబడికి, దాని పటాటోపానికీ, నాటి వలస పాలకుల భాషగా దానికున్న 'పకుకుబడి' ముందు తలవందుకుని నిలబడాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఈ సంధికాలాన్ని మౌనంగా వీక్షిస్తున్నవారికి, నేటి తెలుగుని విని మనం ఎక్కడున్నామో ఎలా ఉన్నామో నిర్ణయించుకోవడానికి కూడా తగిన వేదికని కల్పించే అంతర్జాల పత్రిక కథామంజరి. తొలి తెలుగు శ్రవణ–పఠన జాలపత్రిక ఏడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సంరర్భంగా అభినందనలు తెలియజేసుకుంటూ...

ఈ కథా మంజరి మంజీరనాదాలు తెలుగు కనిపించినంత మేరా వినిపించాలని మనసారా కోరుకుంటూ...

కథామంజరి బృందానికి నమస్కరిస్తూ... జయంతి ప్రకాశశర్మగారికి వందనాలర్పించుకుంటున్నాను.

*జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, తెలకోవెల, పలమనేరు, చిత్తూరు జిల్లా*

"కథామంజరి" మల్లెల మాలలా కథలను ఏరి కూర్చిన పసందైన హృదయ పరిమళాల సమాహారం. పది కథల సమూహం. ఇదో కొత్త వరవడి. పత్రికే రూపమే సుందర నందనం. సుమధురం,. అంతర్జాలంలో అద్భుత రీతిలో ప్రతి మాసం క్రమం తప్పకుండా...మూసమారకుండా... ఒకే తరహాలో మంచి మంచి కథలను పదంటే పదే... అటు వినసొంపుగా.. ఇటు కనసొంపుగా... రంగుల్లో కూడా ఉచితంగా అందిస్తూ.. అలరిస్తున్న... కథమంజరి ఆరేళ్ళ పాపగా ఎదగడం... చాలా ఆనందం కలిగిస్తోంది. బృందం అందరి ప్రయత్నం ఫలించి...వరించి.. విరించిలా... కథలను విరబూయించి... పాఠక రచయితలందరిని ఆకట్టుకుని మరెన్నో విజయాలు...వత్సరాలు తన సొంతం చేసుకోవాలని ఆశిస్తూ... ఆశీర్వదిస్తూ...

జయహో కథామంజరి.

**ఇందూ రమణ**

గత ఆరు సంవత్సరాలుగా ఈ పత్రికను.. ఎంతో శ్రమిస్తూ, తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలనే ధృఢ సంకల్పంతో సమయపాలన పాటిస్తూ వెలువరించడం..అత్యంత ముదావహం! 40 సంవత్సరాల పూర్వం, వార మాస పత్రికలు విరి విరిగా వచ్చేవి. ఆయా సంపాదకులు.. కథా రచనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆ పత్రికల ద్వారా రచయితలకు పేరు ప్రఖ్యాతులు, గౌరవం లభించేవి. మేం విద్యార్థి దశలో ఉన్నప్పుడు, వారి కథలను చదివి, స్ఫూర్తి పొంది, ఉత్సాహంతో కథలు వ్రాసే వాళ్లం! ఆయా పత్రికలు ప్రోత్సహించేవి. ఇప్పుడు కొన్ని పత్రికలు వస్తున్నప్పటికీ, పూర్వం పత్రికలకు ఉన్న ఆదరణ, వీటికి లేవు. రచయితలు, కథాప్రియులు నిరుత్సాహ పడుతున్న తరుణంలో, సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాల "కథామంజరి" ప్రారంభించడం.. సాహితీ లోకం అమితానందంతో స్వాగతించింది. మాలో అప్పటి ఉత్సాహం మళ్ళీ ఉప్పొంగింది. పత్రిక సంపాదక వర్గం ఉన్నత ఆశయాలతో, అంకితభావంతో.. తెలుగుభాష మీద గౌరవం ఉన్నవారు. వీరి ఆశయం ఒకటే.. కథలో మానవజీవితం, విభిన్న మనస్తత్వాలతో కూడిన ప్రవర్తనలు, సంఘటనలు ప్రతిబింబించాలి, అమృత గుళికలు కథారూపంలో పాఠకులకు అందించాలి. నేను ఈ పత్రికలో వచ్చే కథలను విశ్లేషణ చేస్తే స్ఫురించిన భావం ఇదే! కథామంజరి సుదీర్ఘకాలం ఇదే ఆశయాలతో ముందుకు సాగి, కీర్తి ప్రతిష్టలను అందుకుంటుందని అకాంక్షిస్తున్నాను. అందరికి అభినందనలు!

"జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరః

***వి.వి. సత్యప్రసాద్(కవిమిత్ర), హైదరాబాదు.***

కథామంజరి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కథామంజరి సంచాలకులు వారి బృంద సభ్యులు అందరికీ అభినందనలు. కథామంజరి ఔత్సాహికులకే కాక లబ్ధప్రతిష్టులకు, వర్ధమానులకు, ప్రవర్ధమానులకూ సమ నిష్పత్తిలో ప్రోత్సాహం కల్పిస్తూ నాణ్యమయిన, మేలైన కథల ఎన్నికలో రాజీపడడం లేదు. కథల పోటీలు పెడుతూ, తమ కథ కథామంజరిలో 'ఎన్నిక ఐతే చాలు' అనే స్థాయికి కథామంజరి చేరడం ముదావహం.

అందుకు కథామంజరి కార్యనిర్వాహక కమిటీ సభ్యుల క్రృషి ప్రశంసనీయం! ఇలాగే కథామంజరి సాహితీ ప్రయాణం అజేయంగా, అనుపమానంగా సాగాలని అభిలషిస్తూ ఈ నాలుగు మాటలు..

**డాక్టర్ ఎమ్ సుగుణరావు, విశాఖపట్నం**

కథకో పత్రిక ఉండటం తెలుగువారికి గర్వకారణం!

డిజిటల్ యుగంలో పత్రికలకు కాలం చెల్లింది అనుకుంటున్నప్పుడు కేవలం కథ కోసం ఒక పత్రిక రావడం సాహసం! తెలుగువారికి గర్వకారణం. 'కథామంజరి' పత్రిక నాకు పరిచయం అయినప్పటి నుంచి ఆసక్తిగా ఫాలో అవుతున్నాను. రెండు రాష్ట్రాల్లోని లబ్ధప్రతిష్టులైన రచయితల కథలు, అభిప్రాయాలతో పాటు ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా పత్రికను తీర్చిదిద్దుతున్నారు. కథల ఎంపిక, నాణ్యత, వైవిధ్యం విషయంలో సంపాదకులు తీసుకుంటున్న శ్రద్ధ పట్ల కూడా నాకు గౌరవం పెరిగింది. ఈ తరం ఆన్‌లైన్ పాఠకులు సైతం.. సులువుగా చదవ గలిగేలా పేజీల అలంకరణ ఉంటోంది. మంచి సాహిత్య సంస్కారం ఉన్న ఈ పత్రిక తెలుగువారి ప్రతి ఇంటా ఉండాలి. రచయితలు మేలిమి రచనలు చేయడం ద్వారా, పోషకులు ఆర్థిక సహకారం అందించడం ద్వార మాత్రమే ఇలాంటి పత్రికలను మనం పదికాలాల పాటు కాపాడుకోగలం. కథామంజరి పత్రిక విజయవంతంగా ఏడో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా.. ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**డా. వేంపల్లె షరీఫ్, కథా రచయిత, హైదరాబాద్**

ముందుగా కథామంజరి సప్తమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహకులకు అభినందనలు! తెలుగు కథను బ్రతికించే ప్రయత్నంలో.. రాశికి  కాక వాసికి ప్రాధాన్యత నిస్తూ, లాభాపేక్ష లేకుండా నడుపుతూ పాఠకులను అలరిస్తూ కలకాలం సాగాలని నా అభిలాష.

**భాగవతుల కృష్ణారావు, హైదరాబాద్**

ప్రతి నెల మొదటి తేదీన ఖచ్చితంగా వెలువడే సాహితీ పత్రిక కథామంజరి! అచ్చు పత్రికలు దూరమైన తర్వాత, ఆనాటి సాహితీ విలువలతో వెలువడుతున్న పత్రిక కథామంజరి! ప్రసిద్ధ రచయితలతో పాటు నూతన రచయితలను కూడా పరిచయం చేస్తున్న కథామంజరికి అభినందనలు. కొన్ని ఆన్లైన్ పత్రికలు గేట్లు బాగా తెరవడంతో, మంచి రచనలతో పాటు నీరసమైన వాటిని కూడా చదవాల్సి వస్తుంది. దాంతో ఆ పత్రికలను చూడడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. ఒక సంపాదక వర్గం ఉండి, మంచి రచనల్ని ఎంపిక చేసి కథామంజరి రూపంలో అందించడం ముదావహం. సాహితీలోకంలో తన ప్రత్యేకతను ప్రఖ్యాతిని కాపాడుకుంటుందని ఆశిస్తూ, ఈ బృహత్తర యజ్ఞానికి హోతలైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

**పట్నాల ఈశ్వరరావు, విజయనగరం**

కథామంజరి ఏడవ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంలో హృదయపూర్వక అభినందనలు!

నేను పత్రికలకు కథలు రాయడం మొదలు పెట్టిన తొలినాళ్ళలో కథామంజరికి, నా కథను ఎంపిక చేసి, రచయిత్రిగా నన్ను ప్రోత్సహించడం వల్ల తదుపరి కాలంలో మరెన్నో కథలు రాయగలిగాను. కథామంజరి ఏటా నిర్వహించే పోటీల్లో తప్పనిసరిగా పాల్గొంటున్నాను. ప్రత్యేక బహుమతి లేదా సాధారణ ప్రచురణకు నా కథలు ఎంపికవుతూ వస్తున్నాయి. ఇది నాకెంతో సంతోషాన్నిచ్చింది. మంచి సాహితీ విలువలున్న పత్రికలో కొత్త రచయితలకు ఎప్పుడూ స్థానం కల్పించడం ముదావహం. ఆణిముత్యాలాంటి పది కథల సమాహారం శ్రావ్య సంచికగా కూడా అందించడం చాలా బాగుంది. కథామంజరి మరిన్ని వసంతాలు పూర్తి చేసుకోవాలని కోరుకుంటూ...

***వేలూరి ప్రమీలా శర్మ, విశాఖపట్నం.***

---

కథామంజరి అంతర్జాల మాస పత్రికకు, పత్రిక టీమ్‌కి పుట్టిన రోజు శుభా కాంక్షలు!

*నిన్నా మొన్నా పుట్టిన పాపాయి అపుడే ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుందంటే ఎంతాశ్చర్యం? ఈ మాస పత్రికలో ఎన్నెన్నో ఆశ్చర్యాలు! అద్భుతాలు!*

తెలుగు కథలకు అత్యద్భుత వేదిక! తెలుగు రచయితలు విశిష్ట అతిథులు! నెల పూర్తవుతుందంటే, మరో నెల ఆరంభమవ్వబోతుందంటే, ఆహ్లాదభరితమైన ఎక్సయిట్ మెంట్! ఇలా వాచీలో, మొబైల్లో తారీఖు మారుతుందో లేదో అలా కథామంజరి ప్రత్యక్షమై పోతుంది. ఆ డెడికేషన్, ఆ పంక్చువాలిటీ, ఆ సిన్సియారిటీ.... ఇన్ని సంవత్సరాలైనా కించిత్తు మార్పులేదు. జస్ట్ గ్రేట్ ఫీట్! కీపిట్ అప్!

***బొమ్మరదేవర నాగకుమారి, కథా, నవలా రచయిత్రి***

---

అచ్చు పత్రికలు అంతరించి పోయిన తరుణంలో.. తూర్పున ఉదయించిన కథామంజరి ప్రతీ నెలా కథాభిమానుల ముంగిట్లో, పారిజాత కథాసుమాలని గుప్పిళ్ళతో వెదజల్లుతోంది. ఎంతో నిబద్ధత, అఖుంటిత దీక్షా, ఉంటేనే ఇలాంటివి సంభవం. తెలుగు సాహిత్యానికి కథామంజరి ఒక కంఠాభరణం. కథామంజరి బృందానికి అభినందనలు!

***బ్రహ్మానందం గొర్తి, కథా రచయిత, యు.ఎస్.ఎ.***

---

"కథామంజరి" పత్రికను చూసినప్పుడల్లా నాకు ఎనలేని సంతోషం కలుగుతుంది. ఈ పత్రికను ఇంత అద్భుతంగా నడిపిస్తున్న జయంతి ప్రకాశశర్మ గారిని, వారికి అన్ని విధాలా తోడ్పడుతున్న సంపాదక, సాంకేతిక బృందాలను అభినందించకుండా ఉండలేకపోతున్నాను. ప్రతినెలా వందలాది కథలను చదువుతూ.. వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి, తగిన హంగులు అద్ది, శ్రావ్య సంచికతో (ఆడియో) సహా తెలుగు పాఠకుల మనోవికాసానికి ఒక గొప్ప కానుకగా అందిస్తున్నారు. కథావస్తువు పాతదైనా, కొత్తదైనా.. శైలి, కథాగమనం, కథాశిల్పం వంటి విలువలున్న రచనలను ప్రోత్సహిస్తూ మనకు అందిస్తున్నారు. శర్మగారి బృందం చేస్తున్న ఈ నిరంతర కృషికి, వారి కార్యదీక్షకు నా హృదయపూర్వక అభినందనలు, ప్రత్యేక ధన్యవాదాలు.

***డా. శేషు శర్మ, కథా రచయిత్రి, యు.ఎస్.ఎ.***

---

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# కాలం సాక్షిగా...

## కాళీపట్నపు పేర్రాజు

*“ఇన్ని ఎందుకమ్మా? నేను రెండే కదా అడిగాను!” అంది.*

*ముసలమ్మ చిరునవ్వు నవ్వింది.*

*“నీకు రెండు... నీ కడుపులో పెరుగుతున్న వాడికి రెండు!” అంది.*

*ఆ స్త్రీ కళ్లలో ఒక్కసారిగా వెలుగు మెరిసింది. డబ్బులు ఇచ్చి మెల్లిగా వెళ్లిపోయింది.*

*నేను ఆశ్చర్యంగా అడిగాను. “ఇలా ఎక్కువ ఇస్తే నష్టమవదా అమ్మా?”*

*ముసలమ్మ అరటిపండ్లను సర్దుకుంటూ మెల్లిగా... “మనిషి కడుపు నింపితే నష్టం ఎక్కడుంటుంది బాబూ!” అంది సాదాసీదాగా.*

ఎండ చాలా తీవ్రంగా ఉంది. చెట్లనీడలు... రోడ్డుపై అలసిపోయి పడుకున్న నల్లటి గుడ్డముక్కల్లా కనిపిస్తున్నాయి. జనాలు ఆ నీడల్లో కాసేపు ఆగి, ఊపిరి పీల్చుకుని మళ్లీ తమ బరువైన జీవితాల్ని మోస్తూ ముందుకు కదులుతున్నారు. అమ్మమాటలు చెవుల్లో గింగురుమంటుండగా, వారితోపాటు నేనూ కదులుతున్నాను.

మార్కెట్ వీధిలోకి అడుగుపెట్టగానే ఎండ. శరీరంపై ఒక్కసారిగా అగ్నిచీర కప్పినట్టైంది. గాలి... పొయ్యి నోటినుంచి వచ్చిన ఊపిరిలా ముఖాన్ని తాకుతోంది. రోడ్డుమీద కరిగిపోతున్న తారునుంచి వచ్చిన వాసన పైకి ఎగసి ముక్కుపుటాలకు సోకుతోంది.

టమాటాల వాసన, పండిన మామిడిపళ్ళ తీపిదనం, అరటిపండ్ల మగ్గిన వాసన, చెమట కంపు... అన్నీ కలిసిపోయి మార్కెట్ అంతా ఒక కొత్తరకం వాసన పరుచుకున్నట్టుంది.

చుట్టూ శబ్దాలు ఒకదానితో ఒకటి ఢీకొంటున్నాయి. “టమాటా కేజీ ముప్పై... కేజీ ముప్పై, అరకేజీ ఇరవై “సైడ్... సైడ్!” అంటూ ఆటోవాడి అరుపు, కీ... కీ అంటూ వాహనాల హారన్లు, తోపుడుబండి మీదున్న ఇనుప ఊచలు రోడ్డును రాసుకుంటూ చేసే కీచుమని శబ్దం, ఎక్కడో ఓ చిన్నపిల్ల ఏడుపు, పైన విద్యుత్ తీగలపై కూర్చున్న కాకుల కేకలు. కలగాపులగంగా ఉన్న ఆ శబ్దాల మధ్యన నడుస్తున్న నాకు, నా ఆలోచనలకు కూడా చెమట పట్టినట్టుగా అనిపిస్తోంది.

అలాంటి రద్దీ మధ్యన, రోడ్డుకు కొంచెం పక్కగా ఒక చిన్నపాటి ఎత్తుతో ఉండే వెడల్పు బల్ల, దానిమీద ఒక బుట్ట, ఆ బుట్టమీద దాగర, దానిలో అరటిపండ్లు వరుసగా పేర్చబడి ఉన్నాయి.

కొన్ని పచ్చగా, కొన్ని పసుపురంగు వెలుగులు కారుస్తూ, మరికొన్ని మచ్చలతో కాలం తాకిన మనుషుల ముఖాల్లా! పైన ఓ పాత నల్లగొడుగు. దాని గుడ్డ పలుచబడిపోయి, ఎండ కాంతిని పూర్తిగా ఆపలేకపోతోంది. ఆ వెలుతురు గొడుగు రంధ్రాలగుండా జారిపడి కింద కూర్చున్న ముసలమ్మ చేతులపై, ముక్కలుగా పడుతోంది.

ఆమె చేతులు వణుకుతున్నాయి. కానీ ఆ వణుకులో బలహీనత కంటే అలవాటు ఎక్కువగా ఉంది. ఎన్నో ఏళ్లుగా ఒకే పనికి అలవాటుపడిన చేతుల జ్ఞాపకం. ఆమె ముఖంమీద ముడతలు ఎండలో ఎండిపోయిన చెరువు పగుళ్లలా ఉన్నాయి. కానీ కళ్లలో మాత్రం... ఇంకా ఓ ప్రశాంతమైన వెలుగు తడిగా మిగిలే ఉంది. నేను ఆమె దగ్గరికి వెళ్లాను.

“ఎంతమ్మా డజన్?” అన్నాను. ఆమె తలెత్తి చూసింది.

“ముందు నీకు నచ్చిన పెడలు ఎంచుకో బాబూ!” అంది.



పండ్లు ఎంచుతూ అడిగాను. “ఈ ఎండలో ఎందుకమ్మా ఇలా కూర్చుంటున్నారు? మీకు పిల్లలు లేరా?”

ఆమె గమ్మత్తుగా నవ్వింది.

“పిల్లలు ఉన్నారు బాబూ! ఇద్దరు కొడుకులు. వాళ్ల పెళ్లిళ్లు అయ్యాయి. కోడళ్ళుకూడా మంచోళ్లే. జాగ్రత్తగానే చూసుకుంటారు!”

“మరి ఎందుకు ఇంట్లో హాయిగా ఉండొచ్చు కదా?”

ఆమె ఒక్కసారి ఎదుటిరోడ్డు వైపు చూసింది. అక్కడ జనాలు ఎవరికి వారు పరుగులు తీస్తున్నారు.

తరువాత నా ముఖంలోకి చూస్తూ, “హాయిగా ఉండడం అంటే ఏటి బాబూ... తిని కూకోవడమా?” అంది మెల్లిగా.

నేను మౌనంగా నిలబడ్డాను.

"నాకు పదిహేనేళ్లప్పుడు పెళ్లైంది. అంతకుముందు అంటే సుమారుగా నా పదేళ్లవయస్సు నుంచే మా నాయనతో కలిసి, ఇక్కడే పండ్లు అమ్మేదాన్ని. పెళ్లయ్యాక పెనిమిటితో కూడా ఇక్కడికే వచ్చేదాన్ని. ఎండైనా, వానైనా... జ్వరం వచ్చినా, ఈ మార్కెట్‌కి రానిరోజు లేదు. ఇప్పుడు లెక్కేసి సూడు... ఇంచుమించు ఎనభై, ఎనభై ఐదు ఏళ్లు అయిపోతాయి కదా!"

"ఇప్పుడు మీవాళ్లు సంపాదిస్తున్నారు కదా అమ్మా..."

ఆమె వెంటనే మాట అందుకుంది. "అది వాళ్ల సంపాదన బాబూ. వాళ్లుపెట్టే అన్నం తింటాను. ప్రేమగా చూస్తారు కూడా! కానీ..." ఆమె మాట ఆగిపోయింది.

ఆమె ఏమిచెబుతుందా అని ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూశాను.

"చేతులు కదపకుండా ముద్ద తింటే, అది గొంతులో దిగుతాదా బాబూ?" అని అడిగింది.

ఆ మాట విన్నాక, నా చేతిలోని అరటిపండ్లు ఒక్కసారిగా బరువనిపించాయి.

ఆమె ఆకాశంవైపు ఒకసారి చూసి కళ్ళుమూసుకుంటూ, "పనిచేసినోడికే తినే హక్కు ఉంటాది తల్లీ గుర్తుంచుకో' అనేవోడు మా నాయన. అప్పట్లో ఆమాట భయంగా అనిపించేది. ఇప్పుడు అది ఊపిరిలా అయిపోయింది." అంది ఒకసారి చుట్టూచూస్తూ, ఎండ మరింత ముదురుతోంది. చెమటచుక్కలు ఆమె చెంపలమీదుగా జారుతున్నాయి. అయినా ఆమెచేతులు మాత్రం ఆగడం లేదు. పండ్లు సర్దడమో, పక్కనున్న గెలనుండి పెడలు కోయడమో... అలా ఏదో ఒకపని చేస్తూనే ఉన్నాయి.

అంతలో ఓ గర్భిణీ స్త్రీ అక్కడికి వచ్చింది.

ఎండకు ముఖం మాడిపోయింది. ఒకచేత్తో నడుము పట్టుకుని, ఇంకోచేత్తో చీరకొంగుతో చెమట తుడుచుకుంటోంది. ఆమె నడకలో అలసట స్పష్టంగా కనిపిస్తోంది.

ఆమె అరటిపండ్ల వైపు చూస్తూ, "రెండుపళ్ళు ఇవ్వమ్మా!" అంది నీరసంగా.

"ఎక్కడినుంచి వస్తున్నావమ్మా ఈ ఎండలో?" అని అడిగింది.

"హాస్పిటల్ నుంచి... బస్సు ఇంకారాలేదు!" అంది ఆమె మెల్లిగా.

ముసలమ్మ ఏమీ మాట్లాడలేదు.

పండ్లగుత్తిలోనుంచి, మంచి పండిన అరటిపండ్లు నాలుగు తీసి ఆమె చేతిలో పెట్టింది ముసలమ్మ.

ఆమె చేతిలో పండ్లు పెడుతుంటే, ముసలమ్మవేళ్లు కాసేపు ఆమె అరచేతిని తాకాయి.

ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"ఇన్ని ఎందుకమ్మా? నేను రెండే కదా అడిగాను!" అంది.

ముసలమ్మ చిరునవ్వు నవ్వింది.

"నీకు రెండు... నీ కడుపులో పెరుగుతున్న వాడికి రెండు!" అంది.

ఆ స్త్రీ కళ్లలో ఒక్కసారిగా వెలుగు మెరిసింది. డబ్బులిచ్చి మెల్లిగా వెళ్లిపోయింది.

నేను ఆశ్చర్యంగా అడిగాను. "ఇలా ఎక్కువ ఇస్తే నష్టమవదా అమ్మా?"

ముసలమ్మ అరటిపండ్లను సర్దుకుంటూ మెల్లిగా... "మనిషి కడుపునింపితే నష్టం ఎక్కడుంటుంది బాబూ!" అంది సాదాసీదాగా.

ఆమె మాటల్లో పెద్దతత్వాలు లేవు. కానీ జీవితమంతా ఉంది.

నేను డబ్బులు ఇచ్చాను. పళ్ళను నాచేతిలో పెడుతూ, "కూర్చుని తినే జీవితానికన్నా... చిన్నదో చితకదో ఏదో ఒకపని చేస్తూ చెమటోడ్చి తినేముద్దే, నోటికి తియ్యగా ఉంటాది బాబూ!" అంది.

అప్పుడు ముసలమ్మ ముఖంలో ఒక్కసారిగా అమ్మనీడ కనిపించింది.

తరువాత, "నాన్నమాట వినరా కన్నా! ఇంజనీరింగ్ పాసై సంవత్సరం అవుతోంది. చిన్న ఉద్యోగమైనా ముందుగా చేరితే అనుభవం వస్తుంది. తర్వాత నెమ్మదిగా ఎదుగుతావ్. మనవాళ్లలో కొందరు అలా మొదలుపెట్టి ఇప్పుడు మంచిస్థితిలో ఉన్నారు. నువ్వుకూడా ఏదో ఒకచోట మొదలుపెట్టు బాబూ!" అన్న అమ్మమాటలు లోపల ఎక్కడో మెల్లిగా తడిమినట్టయ్యాయి.

నేను బయలుదేరబోతుంటే నావైపు చూసి నవ్వుతూ, "అయితే నన్నేటి చేయమంటావు, రేపటినుంచి కొట్టు పెట్టమంటావా, కొట్టు కట్టేసి హాయిగా తిని ఇంట్లో తొంగోమంటావా?" అని అడిగింది.

జవాబు ఇవ్వలేక తలొంచుకుని గబగబా రోడ్డు దాటుతూ, ఒక్కసారి వెనక్కి తిరిగి చూసాను.

మార్కెట్ ఇంకా అదే హడావుడిలో ఉంది.

ఎండ ఇంకా అలాగే మండుతోంది.

జనాలు అలాగే పరుగులు తీస్తూనే ఉన్నారు.

ఆ రద్దీ మధ్యన... చిరిగిన నల్లగొడుగు కింద ఆ ముసలమ్మ మాత్రం మళ్లీ అరటిపండ్లను సర్దుతోంది.

ఆమె చేతులు వణుకుతున్నాయి. కానీ ఆ వణుకులో ఓటమి లేదు. అది జీవితమంతా పనిచేసిన చేతుల లయ!

ఆ క్షణంలో నాకు ఒక్కసారిగా అనిపించింది——

ఎండ ఆమె చర్మాన్ని కాల్చి ఉండొచ్చు.

కాలం ఆమె ముఖంపై ముడతలు గీసి ఉండొచ్చు.

కాని పనిమీదున్న గౌరవాన్ని మసకబార్చే శక్తి మాత్రం దేనికీ లేకపోయింది.

ఆమె ముందున్న అరటిపండ్లు అమ్మకానికి పెట్టిన పండ్లు మాత్రమే కావు.

ఎనభై ఐదు ఏళ్ల శ్రమకు పసుపురంగు సాక్ష్యాలు!

మనసులో ఒక స్పష్టమైన నిర్ణయం మెల్లిగా స్థిరపడుతుండగా... నేను ముందుకు కదిలాను.

"మార్కెట్ గోలలో కూడా ఆమె మాట మాత్రం అమ్మ పలుకుల్లా నా లోపల ఓ సందేశంలా ఇంకా వినిపిస్తూనే ఉంది!

"చెమటోడ్చి తినే ముద్దే తియ్యగా ఉంటుంది బాబూ..."




# ఇచ్చట మంచిపనికి మార్కులు పడతాయి!

**ఎనుగంటి వేణుగోపాల్**

> *"అమ్మా! నాకు తెలియకుండా ఒక పొరపాటు జరిగింది. నేను... బయట చాలా మందికి మంచిని పంచుతున్నాను అనుకున్నా. కానీ ఇంట్లో మాత్రం... ఒక కూతురుగా నీకు ఎలాంటి ఆత్మీయతను, సహకారాన్ని పంచలేకపోయాను. నీ పట్ల ఒక కూతురిగా ఎన్నో విషయాల్లో, దయ చూపలేకపోయాను. తండ్రి లేని నన్ను ఇంతదాన్ని చేశావు. నీ హృదయాన్ని అర్థం చేసుకోలేకపోయాను!"*

"అగ్రీ అండ్ కంటిన్యూ" అనే అక్షరాలు ల్యాప్‌ట్యాప్ స్క్రీన్‌పై మెరుస్తున్నాయి. రియా దాన్ని చదవలేదు. ఎప్పటిలానే ట్యాప్ చేసింది.

'కైండ్ లూప్!' అనేది ఒక కొత్త యాప్. దాని ట్యాగ్‌లైన్ ఏంటంటే "దయను పంచండి! బహుమతి పొందండి!"

దాని మెకానిక్స్ వెరీ సింపుల్. ఒక వ్యక్తి యొక్క డైలీ యాక్షన్స్‌ని... అంటే దినవారీ చర్యలను ట్రాక్ చేస్తుంది.

చేసే మంచిపనులు గుర్తించి పాయింట్స్ ఇస్తుంది. విశేషమేంటంటే మంచి కూడా ఇప్పుడు ఇలా పాయింట్స్ వారీగా కొలవబడుతోంది.

రియా ప్రస్తుతం ఏ.వి. ఏజెన్సీలో పనిచేస్తుంది. నెరేటివ్స్ తయారు చేయడం ఆమె ఉద్యోగవిధి. అంటే... ఒక వ్యక్తి యొక్క జీవితానుభవాల్లోంచి ఏర్పడిన సంఘటనలను, అవి జరిగిన వరుస క్రమంలోనే ఒక సమాచారంగా తయారు చేయడం!

ఆమెకు ఈ యాప్ చాలా బాగా నచ్చింది. ఎందుకంటే... ఇది క్లీన్‌గా అనిపించింది. ఏదైనా మంచిపని చేస్తే పాయింట్స్ ఇస్తారు. ఇంకా మంచిపని చేస్తే, ఎక్కువ పాయింట్స్‌కు రీచ్ కావచ్చు.

మొదటివారం... ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఒక బిచ్చగాడికి యాభై రూపాయలు దానం చేసింది. 120 పాయింట్స్ వచ్చాయి. ఆఫీస్‌బాయ్‌కి క్యాంటీన్‌లో కాఫీ కొనిపెట్టింది. ఎనభై పాయింట్స్ దక్కాయి. అలా ఒక్కో మంచిపని చేసుకుంటూ పోతుంటే రియా స్కోర్ పెరుగుతోంది.

దాంతో రియా 'నేను చాలా మంచి పర్సన్ని' అని తనకుతానే ఫీల్ అవుతోంది

ఇంట్లో ఆమెతల్లి సరోజ, ఒక చిన్న బొటీక్ షాపు నడుపుతోంది. ఇద్దరిమధ్య మాటలు ఎక్కువగా దొర్లవు. మితంగానే మాటలు కొనసాగుతాయి. ఎవరిపనుల్లో వారు ఉంటారు!

ఆ పలకరింపులు కూడా చాలా సింపుల్‌గా ఉంటాయి. ‘అమ్మా! తిన్నావా?’ అని కూడా కాదు, జస్ట్... ‘తిన్నావా?’ అని అడగడం అంతే!

“లేట్ అవుతుందా?” అని అడిగితే... రియా సమాధానం కూడా సింపుల్. ”చాలా బిజీ!” అంతే. పలకరింపుల ఘట్టం పూర్తయిపోయినట్టే. ఇద్దరి మధ్య ఫోన్ కట్!

ఒకరోజు సాయంత్రం సరోజకు ఎందుకో కాస్త తల తిరిగినట్టయ్యింది. చేత్తో గోడను పట్టుకుంది... తూలి పడిపోకుండా! ”రియా!” గొంతెత్తి కూతురిని పిలిచింది.

హాల్‌లో రియా ల్యాప్‌టాప్ ముందు కూర్చుని ఉంది. ‘కైండ్ లూప్’ యాప్ ఓపెన్ చేసి, అందులోని మ్యాటర్‌ని స్టడీ చేస్తోంది.

అప్పటికి ఆరురోజులు పూర్తయ్యాయి రియా ఆ యాప్‌లోకి ఎంటరై! ఇంకో ‘మంచిపని’ చేస్తే, ఏడురోజుల బోనస్ కలుస్తుందని ఉంది అందులో!



అప్పుడే తన తల్లి పిలుపుకి ఆమె తల పైకి లేపింది. “ఏమైంది?”

“ఏమీలేదు, కాస్త తల తిరిగింది...” ఆ తల్లి కూడా పొడిగా సమాధానం ఇచ్చింది.

“కాసిని మంచినీళ్లు తాగమ్మా! నేను ఒక కాల్‌లో ఉన్నాను” అంది.

ఆమె ఉన్నది కాల్‌లో కాదు. ‘కైండ్‌నెస్ స్ప్రింట్’ ఛాలెంజ్‌ని పరిశీలిస్తోంది. అంటే తక్కువ సమయంలో ఎక్కువ లక్ష్యాన్ని చేరుకోవడం.

ఆ ఛాలెంజ్ ఏంటంటే... రాబోయే పదినిమిషాల్లో ఒక అర్థవంతమైన మంచిపనిని చేయడం! ఇందులో గెలుపొందిన వాళ్ళకి,

అయిదువేల పాయింట్స్ యాడ్ అవుతాయి. 'ఫీచర్డ్ క్రియేటర్' రివార్డుగా ప్రదానం చేయబడుతుంది.

రియా కెమెరా ఆన్ చేసింది. లైవ్ ప్రారంభం అయ్యింది.

"హాయ్ గైస్! టైమ్ స్టార్ట్స్ నౌ. మీరు చేయబోయే మంచిపనిని వెంటనే ప్రారంభించండి!" అనే హెచ్చరిక వినబడింది.

రియా ఆలస్యం చేయలేదు. మెరుపుతీగలా గేటు బయటకి పరుగులు తీసింది. ఆమె ఇంటికి దగ్గర్లోనే ఒక సిగ్నల్ ఉంది.

ఆ సిగ్నల్ దగ్గర ఒక ఆటో డ్రైవర్‌కి, ఒక వృద్ధుడికి మధ్య చిన్న వాగ్వాదం జరుగుతోంది.

పాపం ఆ వృద్ధుడు, "నా దగ్గర చిల్లర లేదు" అంటున్నాడు. ఆటో డ్రైవర్ ఇవ్వమని కేకలు వేస్తున్నాడు.

రియాకు ఇది పర్ఫెక్ట్ సిచ్యువేషన్. వెంటనే తన సెల్ ఓపెన్ చేసి, అతడికి స్కానింగ్‌తో వంద రూపాయలు ఇచ్చింది. తిరిగి తన మొబైల్ వీడియో స్టార్ట్ చేసింది. ఇక్కడి సన్నివేశాన్ని షూట్ చేసింది. ఇంట్లోకి పరిగెత్తి ఆ యాప్‌లోకి ఇన్సర్ట్ చేసింది.

లైవ్ కాబట్టి వెంటనే చప్పట్లు కామెంట్స్, రెండువేల నాలుగు పాయింట్స్ ఆడ్ అయ్యాయి!

అప్పుడు తల్లికోసం చూసింది. పక్కగది లోపల అంతా నిశ్శబ్దం. "అమ్మా!" పిలిచింది. సమాధానం రాలేదు.

ఆ పక్కనే ఉన్న కిచెన్‌లైట్ వెలుగుతోంది. అటువైపు వెళ్ళింది రియా. అక్కడ కనపడిన సన్నివేశానికి అదిరిపడింది. సరోజ కుర్చీకి వాలిపోయి ఉంది. కళ్లు మూతలు పడిపోయాయి. వెంటనే సెల్ చేతిలోకి తీసుకుని ఊబర్లో ఒక ఆటో బుక్ చేసింది.

ఆటో వచ్చేలోగా, ముఖం మీద కాస్త నీళ్లు చల్లి తల్లికి మెలకువ తెప్పించింది. ఫ్రిజ్‌నుంచి వాటర్ తెచ్చి, ఆమెచేత కొన్నినీళ్లు తాగించింది. ఆ తర్వాత తల్లిని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళింది.

పేషెంట్ పరిస్థితి గమనించిన నర్సు వెంటనే డాక్టర్ గదిలోకి పంపింది.

"పెద్దగా భయపడాల్సిందేమీ లేదమ్మా! బీపీ డౌన్ అయింది. దానికి తోడుగా డిహైడ్రేషన్. అందులోనూ కాస్త స్ట్రెస్‌కు లోన్ అవుతున్నట్టుంది. ఆందోళన తగ్గించే ప్రయత్నం చేసుకోండి. కొన్ని మందులు రాసిస్తాను. అంతా కూల్ అయిపోతుంది" అంటూ ఐదు నిమిషాలు అనంతరం ప్రిస్క్రిప్షన్ చేతిలో పెట్టాడు.

ఇంటికి వచ్చాక కూడా, "ఆందోళన తగ్గించే ప్రయత్నం చేసుకోండి" అనే డాక్టర్ మాటలు రియా చెవుల్లో మార్మోగాయి.

తల్లికి ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులు వేసి, బెడ్‌రూమ్‌లో పడుకోపెట్టింది. రెస్ట్ తీసుకోమని చెప్పి, తనగదిలోకి వచ్చేసింది రియా.

మళ్లీ ఆ యాప్ తెరిచింది.అక్కడొక నోటిఫికేషన్ కనబడింది.

"కంగ్రాట్యులేషన్స్! ఏడురోజులకు అఛీవ్ అయ్యారు. ఎక్సలెంట్! దీంతో మీరు ఇప్పుడు కైండ్‌నెస్ క్రియేటర్‌గా మొదటిస్థానంలో నిలిచారు" అది చూసాక, ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

రియా స్క్రీన్‌ని చూసింది. కింద మరొక చిన్నలైన్ కనబడింది. "మీ విజయగాథను షేర్ చేయండి!" అని!

రియా ఇంకా ఆ యాప్‌లోనే ఉంది. స్క్రీన్‌మీద అక్షరాలను టైపు చేయడం మొదలుపెట్టింది... మొదటిసారి ఎలాంటి ఫ్రీ స్క్రిప్ట్ ఫాలో అవకుండా!

తన విజయగాథకి బదులుగా ఒక కొటేషన్‌ని అందులో ఎంటర్ చేసింది.

"మనం 'మంచి'ని కంటెంట్‌గా మార్చాం. మనం 'ప్రేమ'ను కొలవడం మొదలుపెట్టాం. కానీ దగ్గరలో ఉన్న మనవాళ్లకి 'ఇప్పుడు' ఇవ్వాల్సిన దాన్ని... వాయిదాపద్ధతిలో మనం 'తర్వాత'కి వదిలేస్తున్నాం!"

అంతే యాప్‌లోనుండి ఎవరి ప్రతిస్పందన కోసం ఎదురుచూడలేదు.

తిరిగి సాయంత్రం మరోమారు రియా కైండ్ లూప్ యాప్‌ని ఓపెన్ చేసింది.

ఎలాంటి ఆలోచన లేకుండా ఆ యాప్ సెట్టింగ్స్‌ని, అందులో ఉన్న మొత్తం డేటాని ఒక్కక్షణంలో డిలీట్ చేసేసింది.

అప్పటికే ఆ యాప్‌నుండి ఒక నోటిఫికేషన్ వెలువడింది. "ఇప్పటివరకు వచ్చిన పాయింట్స్, బ్యాడ్జ్, సక్సెస్ చరిత్ర అన్నీ జీరో అవుతాయి" అనే హెచ్చరికలా!

ఆమె ఒక సెకండ్ ఆగింది. "అగ్రీ అండ్ కంటిన్యూ" అని టైప్ చేసింది. తల్లి దగ్గరకు వెళ్లింది.

సరోజ నీరసంగా బెడ్‌పై పడుకుని ఉంది. కూతురి అడుగుల అలికిడితో కళ్లు తెరిచింది.

"రియా..." ఆ పలుకులు కూడబలుక్కున్నట్టు ఉన్నాయి.

ఈసారి రియా ఫోన్ పక్కన పెట్టింది. తల్లిచేతిని, తనచేతిలోకి తీసుకుంది. మృదువుగా స్పృశించింది. అందులో ఏదో తెలియని ఆప్యాయత. ఆమె లేచి కూర్చుంది.

"అమ్మా! నీకు తాగడానికి కాస్త జ్యూస్ ఇస్తా. తర్వాత నిదానంగా నీ మాటలు వింటాను!" ఫ్రిడ్జ్ తెరిచి బాటిల్‌లో ఉన్న జ్యూస్ ఒక గ్లాస్ లోకి పోసి, తల్లికి తెచ్చి అందించింది.

సరోజ నవ్వింది చిన్నగా!

ఆ జూస్ తాగడం పూర్తి చేశాక, గ్లాస్ మంచం కింద పెట్టింది. "ఏం జరిగింది తల్లీ! అదోలా ఉన్నావు?" అంటూ ఆప్యాయంగా కూతురి తలనిమిరింది ఆ తల్లి.

బదులుగా రియా తలవంచుకుంది. ఆమెలో ఎన్నో ఆలోచనలు పోటెత్తుతున్నాయి.

"అమ్మా! నాకు తెలియకుండా ఒక పొరపాటు జరిగింది. నేను... బయట చాలామందికి మంచిని పంచుతున్నాను అనుకున్నా. కానీ ఇంట్లోమాత్రం... ఒక కూతురుగా నీకు ఎలాంటి ఆత్మీయతను, సహకారాన్ని పంచలేకపోయాను. నీపట్ల ఒక కూతురిగా ఎన్నోవిషయాల్లో,దయ చూపలేకపోయాను. తండ్రిలేని నన్ను ఇంతదాన్ని చేశావు. నీహృదయాన్ని అర్థం చేసుకోలేకపోయాను!"

రియా కనుపాపల ఉపరితలాలపై ఒక తడిపరదా రివ్వున ఎగసిపడింది.

"పిచ్చితల్లీ! నేను నీకు అమ్మను. నువ్వుకాదు తల్లీ పంచాల్సింది... ఒక తల్లిగా నేనే నీకు అన్నింటా తోడై నిలవాల్సింది. ఎలాంటి బెంగా మనసులో పెట్టుకోకు. నీవు నాపట్ల దయతోనే ఉన్నావు!" అంటూ ఆ తల్లి తనకన్న పేగును అనురాగంతో హత్తుకుంటుంటే... ఆ మమకారపు కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది రియా.

ఆ రాత్రి రియా ఫోన్ సైలెంట్‌గా ఉంది.

ల్యాప్‌ట్యాప్ నుండి కూడా ఎలాంటి నోటిఫికేషన్ లేదు. ఆమె మొదటిసారి ఒక క్షణం ఖాళీగా కూర్చుంది. ఆమె మనసుకి ఇప్పుడు ఎంతో హాయిగా అనిపిస్తోంది.

మరోనెల గడిచాక 'కైండ్ లూప్' యాప్‌నుండి కొత్తఫీచర్ రిలీజ్ అయింది.

దాని సారాంశం ఏంటంటే... ''హోమ్ స్కోర్! ఇంట్లోవాళ్లతో దయను ట్రాక్ చేయండి. పాయింట్స్ పొందండి! బహుమతి అందుకోండి!''

రియా ఆ నోటిఫికేషన్‌ని చాలాసేపు చూసింది.

చిరునవ్వు నవ్వి... ల్యాప్‌ట్యాప్ స్క్రీన్–డౌన్ చేసింది!

నెమ్మదిగా కిచెన్ వైపు కదిలింది.

“అమ్మా! ఈరోజు వంట నేనుచేస్తాను” అంది.

తల్లి సన్నగా నవ్వి, తల ఊపింది సరే అన్నట్లు.

రియాకు తెలుసు. 'ఇది జీవితం. ఒక చక్కటి కుటుంబం. ఇక్కడ ఎలాంటి కృత్రిమ పాయింట్స్ ఉండవు. బ్యాడ్జెస్ ఎవరూ ఇవ్వరు. 'అగ్రి అండ్ కంటిన్యూ'లాంటి వాటికి బైండ్ కావాల్సిన అవసరం లేదు. యాప్ కోసమో, పాయింట్స్ కోసమో మనవాళ్లను మనం ప్రేమించడం, వారిపట్ల దయచూపడం కాదు, కుటుంబంలో అనుబంధాలు అల్లుకుపోవాలి. వాత్సల్యం వెదజల్లబడాలి. అనురాగం పండాలి. ఆప్యాయత, మమకారం అనే మార్కులు కావాలి' మనసులో కొత్తగా అనుకుంది రియా... ఆలస్యంగానైనా, ఒక జీవితసత్యాన్ని గుర్తెరిగి!!

# దాహం

ఆదోని బాషా
✆ 9440239828

*"ఏమీ అనుకోనంటే... నీకో సలహా ఇస్తాను. నువ్వు ఆ గోపీని మర్చిపోయి, మీ అమ్మానాన్న చెప్పిన అబ్బాయినే పెళ్ళిచేసుకో. ఓ గంటసేపు దాహానికే తట్టుకోలేకపోయిన నువ్వు ఆ పేదవాణ్ణి పెళ్ళిచేసుకున్న తర్వాత జీవితాంతం పేదరికపు కష్టాల్ని ఎలా భరించగలవు? నీ దాహం ముందు నీ ప్రేమ ఓడిపోయింది. అందుకే నీ అమ్మానాన్నల మాట విను!"*

"ఏమ్మా, నువ్వు ఎవరికోసమైనా ఎదురుచూస్తున్నావా?" పార్కులో నా పక్క బెంచీపై ఒంటరిగా కూర్చున్న అమ్మాయిని అడిగాను.

"ఎందుకలా అడుగుతున్నారు అంకుల్?" చిరాగ్గా అడిగిందామె.

"చాలాసేపటినుంచి నువ్వు ఇక్కడ ఒంటరిగా కూర్చున్నావు కదా... అందుకే అడిగాను!" అన్నాను.

"మీరుకూడా ఒంటరిగానే కూర్చున్నారు కదా. మీరుకూడా ఎవరికోసమైనా ఎదురుచూస్తున్నారా?" ఎదురు ప్రశ్నించిందా అమ్మాయి.

"నేనొక ఐడియాకోసం ఎదురుచూస్తున్నాను!" అన్నాను నవ్వుతూ.

ఆమె తికమకపడింది. "ఏమిటా ఐడియా?" అడిగిందా అమ్మాయి.

"నేనొక రచయితని. ఆకాశరామన్న పేరుతో కథలు రాస్తుంటాను. కథల ఐడియా కోసం తరచూ ఇక్కడికి వస్తుంటాను" అన్నాను.

"ఆకాశరామన్నా? అదేం పేరు?" ఆశ్చర్యంగా అడిగింది.

"అది నా కలం పేరు. సరదాగా పెట్టుకున్నాను."

"మీరు సినిమాకథలు రాస్తుంటారా?"

"అంత సీన్ లేదమ్మా. పత్రికల్లో పోటీలకు కథలు రాస్తుంటాను. ఈ మధ్య ఒక పత్రికలో 'నేటి వలపులు, నీటి బుడగలు' అనే అంశంపై కథ రాయమని పోటీ పెట్టారు. నేనొకకథ రాస్తున్నాను. కొసమెరుపుతో కథను ముగించాలనుకుంటున్నాను. కాని ముగింపు తట్టడంలేదు. దానికోసమే ఆలోచిస్తూ ఇక్కడ కూర్చున్నాను. ఈ పార్కు నగరానికి దూరంగా ఉండటం వల్ల జనం ఎక్కువగా రారు. ప్రశాంతంగా కథలు రాసుకోవచ్చని నేను తరచుగా ఇక్కడికి వస్తుంటాను" అన్నాను.

"మీ కథేమిటో చెప్పండి. ముగింపు నేను చెబుతాను!" అందామె.

"ముందుగా నీ కథేమిటో చెప్పు. ఇక్కడికి ఎందుకు వచ్చావ్? ఎవరికోసం ఎదురుచూస్తున్నావ్?" సూటిగా అడిగాను.

"అసలు నేను ఎవరికోసమో ఎదురుచూస్తున్నానని మీరెందుకు అనుకుంటున్నారు?" ఆమె అసహనంగా అడిగింది.

"నేనొక రచయితని కదా! సహజంగానే రచయితలకు పరిశీలనాశక్తి ఎక్కువగా ఉంటుంది. నువ్వు అరగంటనుంచి ఇక్కడ అశాంతిగా పచార్లు చేస్తున్నావు. మాటిమాటికీ పార్కు గేటువైపు చూస్తున్నావు. ఎవరికో ఫోన్ చేసి, ఫోన్ తగలకపోతే విసుక్కుంటున్నావు. అదిచూసి, నువ్వు ఎవరికోసమో ఎదురుచూస్తున్నావని గ్రహించాను!" అన్నాను.

"ఎవరికోసం ఎదురుచూస్తున్నానో అదికూడా మీ పరిశీలనాశక్తితో తెలుసుకొని చెప్పలేకపోయారా?" కాస్త వెటకారంగా అంది.

"నువ్వు ఎదురుచూస్తున్న వ్యక్తి నీ బాయ్‌ఫ్రెండ్ అని చెప్పగలను."

నా జవాబు వినగానే ఆమె ముఖం పాలిపోయింది. "బాయ్‌ఫ్రెండ్ అని ఎలా చెప్పగలరు? ఇంకొకరు కావచ్చు కదా?" అంది.

"ఇంకొకరైతే... ఇంత ఎండలో, నగరం బయట నిర్జనప్రదేశంలో వున్న ఈ పార్కుకి వచ్చేదానివి కాదు" అన్నాను.

"మీరు చెప్పింది నిజమే. ఎలా ఊహించారు?" అనడిగింది.

"నీ వయసు ఇరవై ఏళ్ళు ఉండొచ్చు. కాని నాకు డెబ్బై ఏళ్ళు. నీ వయసు కన్నా నా అనుభవం ఎంతో ఎక్కువ! పైగా నేనొక రచయితని. మనుషుల్ని ఇట్టే చదివేస్తాను!" ధీమాగా అన్నాను.



"అలాగైతే మీకు నా కథ చెబుతాను. నా ప్రేమకథకు ముగింపు మీరే చెప్పండి. కాని ముందుగా నాకో చిన్న సాయం చెయ్యండి. ఓ పక్క విపరీతమైన ఎండ, మరోపక్క టెన్షన్ వల్ల నాకు బాగా దాహమేస్తోంది. గొంతు ఎండిపోయింది. మీవద్ద కాస్త మినరల్ వాటర్ వుంటే ఇవ్వండి!" అంది.

"ప్రతిసారీ నేను బైకులో నీళ్ళబాటిల్ పెట్టుకొని వచ్చేవాణ్ణి. కాని ఈరోజు మర్చిపోయాను. పార్కు బయట ఉన్న షాపులో మినరల్ వాటర్ అమ్ముతారు. కాని ఈరోజు ఎందుకో ఆ షాపు తెరవలేదు. పార్కులోని కొళాయిలో కూడా నీళ్ళు రావటం లేదు!" అన్నాను.

"ఇప్పుడు నీళ్ళు తాగాలంటే నేనేం చెయ్యాలి?" అందామె.

"నీ బాయ్‌ఫ్రెండ్‌కి ఫోన్ చేసి, వచ్చేటప్పుడు దారిలో ఓ నీళ్ళబాటిల్ కొనుక్కురమ్మని చెప్పు!" అని సలహా ఇచ్చాను.

"అసలు గోపి ఫోన్ కలవడం లేదు. అతని ఫోన్ ఆరునెలల క్రితం చోరీ అయింది. అప్పటినుంచి అతనొక పాత ఫీచర్‌ఫోన్ వాడుతున్నాడు. అది తరచూ చెడిపోతూ ఉంటుంది. ఇప్పుడు ఎన్నోసార్లు ఫోన్ చేస్తే ఒకే ఒకసారి ఫోన్ కలిసింది. నీళ్ళబాటిల్ తెమ్మని చెబుతుండగా ఫోన్ కట్ అయింది. గోపీ నామాట విన్నాడో లేదో..."

"నీ బాయ్‌ఫ్రెండ్ పేరు గోపి అన్నమాట. ఇందాక నీ ప్రేమకథ చెబుతానన్నావు. గోపి వచ్చేలోగా, ఆ కథేమిటో చెప్పేయ్" అన్నాను.

ఆమె ఓసారి గొంతు సవరించుకొని చెప్పటం మొదలెట్టింది.

"నాపేరు రాధిక. ధనవంతుల కుటుంబం మాది. నేను గత ఏడాది డిగ్రీపాసయ్యాను. గోపి నా క్లాస్‌మేట్. మా కులస్థుడే. మంచిర్యాంకుతో డిగ్రీ పాసయ్యాడు. ఉద్యోగప్రయత్నాల్లో వున్నాడు. ఓ ఏడాదిగా మేమిద్దరం ప్రేమించుకుంటున్నాం. ఈమధ్యనే మా ప్రేమవిషయం మా నాన్నగారికి తెలిసింది. ఆయన మా పెళ్ళికి ఒప్పుకోలేదు. ఎందుకంటే గోపీ తలిదండ్రులు పేదవారు. చాలా ప్రేమకథల్లో జరిగినట్టే మా ప్రేమకథలో కూడా డబ్బు అడ్డంకిగా మారింది. దీనికి పరిష్కారమేమిటో మీరు సూచించగలరా అంకుల్?" అని అడిగింది.

"నేనొక అభ్యుదయ రచయితని. కులం, మతం, ధనం ప్రేమకూ, పెళ్ళికి అడ్డురాకూడదని నమ్ముతాను" అన్నాను.

రాధిక నన్ను మెచ్చుకున్నట్టు చూసింది. "అందుకే నేను మావాళ్ళను ఎదిరించి గోపిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను!" అంది.

"ఎదిరించి పెళ్ళిచేసుకోవటమనేది చివరి ఆప్షన్! పెళ్ళికి డబ్బుకన్నా ప్రేమ ముఖ్యమనీ... ముందుగా మీ అమ్మానాన్నలకు నచ్చజెప్పి చూడు. నీ సంతోషం కోసమైనా వాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పుకుంటారు."

"ఆ పని ఎప్పుడో చేసి చూశాను. కాని నా మాటల్ని అమ్మానాన్న పట్టించుకోలేదు. జీవితంలో డబ్బుకన్నా విలువైనది ఏదీ లేదనీ, గోపీవంటి పేదవాణ్ణి పెళ్ళాడితే తమ పరువు పోతుందని నామీద మండిపడ్డారు. నేను గోపిని కలవకుండా కట్టడి చేశారు" అంది రాధిక.

"దీన్నిబట్టి నీ తలిదండ్రులకు డబ్బు పిచ్చి ఉందని తెలుస్తోంది. కాని డబ్బుకన్నా ప్రేమ గొప్పది. ప్రేమ లేని వివాహబంధం... సుగంధం లేని పువ్వులాంటిది. డబ్బు సుఖాన్ని ఇస్తుంది కాని, సంతోషాన్ని ఇవ్వదు. కాని ప్రేమ సంతోషాన్ని ఇస్తుంది.

సుఖంకన్నా సంతోషమే మనిషికి ముఖ్యం. నేనిప్పుడు పోటీకి రాస్తున్న కథలో చెప్పబోతున్న నీతి ఇదే! నువ్వుకూడా ఇదేసత్యాన్ని మీ అమ్మానాన్నల మనసులకు హత్తుకునేలా చెప్పగలిగితే, వారి మనసులు మారవచ్చు!" అన్నాను.

"మా అమ్మానాన్నలకు నేను చెప్పలేదనుకున్నారా? మీకన్నా ఎక్కువే చెప్పాను. నేను ప్రాణంకన్నా మిన్నగా గోపీని ప్రేమిస్తున్నానని చెప్పాను. గోపీకూడా నన్ను అంతే గాఢంగా నన్ను ప్రేమిస్తున్నాడు, మేం ఒకరికోసం మరొకరం ప్రాణత్యాగం చెయ్యటానికి కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పాను. గోపీ పేదరికం నాకు సమస్య కానేకాదు, నాకు భోగభాగ్యాలు అవసరం లేదు, గంజినీళ్ళు తాగి బతకటానికి కూడా నేను సిద్ధమని గట్టిగా చెప్పాను. అయినా నా అమ్మానాన్నలు గోపీతో పెళ్ళికి ఒప్పుకోలేదు!" అంటూ ఆవేశంగా చెప్పి, గొంతు తడారిపోవటంతో మాటలు రాక, ఒక్కక్షణం ఆగింది రాధిక.

తర్వాత మళ్ళీ చెప్పటం కొనసాగించింది. "ఎంత వేడుకున్నా అమ్మానాన్నల మనసు కరగలేదు. దాంతో ఓ రోజు నేనొక కఠిననిర్ణయం తీసుకున్నాను. 'మా చావుకు కారకులు నా అమ్మానాన్నలే' అని సూసైడ్ నోట్ రాసి, ఇద్దరం ఆత్మహత్య చేసుకుందామని గోపీకి చెప్పాను. కాని దానికి గోపీ ఒప్పుకోలేదు. ఆత్మహత్య చేసుకోవటం మహాపాపమన్నాడు!" అని చెప్పి ఇక మాట్లాడలేక మౌనం దాల్చింది.

"గోపీ సరిగ్గా చెప్పాడు. అలాంటి వివేకవంతుణ్ణి ప్రేమించినందుకు నిన్ను అభినందిస్తున్నాను. దృఢసంకల్పం లేనివారే బలవన్మరణానికి పాల్పడతారు. వివేకవంతులు ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొంటారు. మీ ప్రేమను కాదనే హక్కు నీ తలిదండ్రులకు లేదు. మీరిద్దరూ మేజర్లు. మీ ఇష్టప్రకారం పెళ్ళిచేసుకొనే హక్కు మీకుంది. అవసరమైతే మీరు పోలీసుల సాయం కూడా తీసుకోవచ్చు" అన్నాను

"ఆ పనికూడా చేసి చూశాం అంకుల్! కాని మానాన్న పోలీసు అధికారులకు ఏం ఇచ్చాడో గాని... వారుకూడా నాన్నలాగే, మాకు నీతులు చెప్పి పంపించారు!"

"అలాగైతే మీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు!" అన్నాను.

"కాని అలా చెయ్యకుండా, పోలీసులు గోపీని ఓ కేసులో ఇరికించారు. అసలు జరిగిందేమంటే ఆరునెలల క్రితం గోపీ ఫోన్ ఎవడో దొంగిలించాడు. తర్వాత ఆ దొంగ మరోచోట, పెద్దచోరీ చేశాడు. ఆ చోరీ జరిగిన చోట పోలీసులకు గోపీ ఫోన్ దొరికింది. ఫోన్‌లోని సిమ్ ఆధారంగా పోలీసులు గోపీని పట్టుకున్నారు. కాని గోపీ ఫోన్ పోగొట్టుకున్న సంగతి రూఢి అయ్యాక అతన్ని వదిలేశారు. అయితే మా ప్రేమ సంగతి తెలిశాక పోలీసులు గోపీని హెచ్చరించారు. ఒకవేళ మేం కోర్టుకెళ్ళి పెళ్ళిచేసుకోవాలని ప్రయత్నిస్తే, గోపీ ఫోన్ ఆధారంగా అతన్ని అరెస్ట్ చేసి, దొంగతనం నేరం కింద కేసు పెడతామని బెదిరించారు. దాంతో మేం కోర్టుకెళ్ళే ఆలోచనను విరమించుకున్నాం!" అంటూ ఆయాసంగా చెప్పటం ఆపింది రాధిక.

"మొత్తానికి నీ ప్రేమకథలో చాలా ట్విస్టులు వున్నాయి. ఇక మీకు ఒకేదారి మిగిలింది, పారిపోయి పెళ్ళి చేసుకోవటం!" అన్నాను.

"ఇప్పుడు మేం చేస్తున్నది అదేపని అంకుల్. ఇద్దరం ఈ రోజు పారిపోవటానికి నిన్ననే ప్లాన్ వేసుకున్నాం. మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఈ పార్కులో కలుసుకొని, ఇక్కడికి దగ్గర్లో ఉన్న స్టేషన్లో రైలెక్కి ముంబైకి పారిపోవాలని నిర్ణయించుకున్నాం. నేనైతే ఎలాగోలా ఇంట్లోవాళ్ళ కళ్ళు కప్పి, సమయానికి వచ్చేశాను కాని, ఒంటిగంట దాటినా గోపీ ఇంకా రాలేదు. దాహంతో నా నాలుక పిడచ కట్టుకుపోయింది!" అసహనంగా అంది రాధిక.

"కాస్త ఓపికపట్టమ్మా. గోపీ వచ్చేస్తాడు. నీకోసం నీళ్ళబాటిల్ కూడా తీసుకురావచ్చు!" రాధికకు ధైర్యం చెబుతూ అన్నాను.

"ఫోన్‌లో నీళ్ళబాటిల్ గురించి చెబుతున్నప్పుడే గోపీ ఫోన్ కట్ అయింది. నా మాట విన్నాడో లేదో! విన్నా నీళ్ళు తెస్తాడో లేదో. అసలు ఇక్కడికి వస్తాడో లేదో... దాహంతో నా ప్రాణం పోయేలా వుంది. అంకుల్, నాకో సాయం చేస్తారా?" ఆత్రంగా అడిగింది రాధిక.

"చెప్పమ్మా, ఏం చెయ్యాలి?" ఆప్యాయంగా అడిగాను.

"మీ స్కూటర్ పైన నన్ను మా ఇంటిదగ్గర డ్రాప్ చేస్తారా? నా జీవితంలో నాకెప్పుడూ ఇంత దాహం వెయ్యలేదు. నేనిప్పుడు అర్జంటుగా ఫ్రిజ్‌లోని చల్లటి మినరల్ వాటర్ తాగితే గాని, నా ప్రాణం కుదుటపడదు!" అంది ఆరాటంగా.

నేను ఉలిక్కిపడ్డాను. "మరి గోపీ సంగతి?" అన్నాను ఆత్రంగా.

"గోపీకాదు, నాకు నీళ్ళుకావాలి!" సూటిగా అంది రాధిక.

నేను మారుమాట్లాడకుండా పక్కనే పార్కు చేసిన నా స్కూటర్ ఎక్కి స్టార్ట్ చేశాను. రాధిక ఎక్కగానే స్కూటర్ ముందుకు కదిలించాను.

మేం పార్క్‌గేట్‌లోంచి రోడ్డుపైకి వచ్చినప్పుడే ఓ ఆటో గేటుముందు ఆగింది. ఆటోలోంచి దిగిన యువకుడు "రాధికా!" అంటూ మా స్కూటర్ వైపు వచ్చాడు. అతనే గోపీ అని నాకు అర్థమైంది. వెంటనే స్కూటర్ ఆపాను.

"వద్దు అంకుల్, గోపీ నీళ్ళబాటిల్ తీసుకురాలేదు. స్కూటర్ పోనివ్వండి!" గట్టిగా అంది రాధిక.

నేను అప్రయత్నంగా స్కూటర్ ముందుకు కదిలించాను. వెనకనుంచి గోపీ, రాధికను పిలుస్తున్నా, ఆమె పట్టించుకోలేదు.

కాస్సేపట్లో మేం నగరం నడిబొడ్డున ఉన్న రాధిక ఇంటికి చేరుకున్నాం. అదొక పెద్ద బంగళా. స్కూటర్ దిగిన రాధిక నాకు, 'థాంక్స్' కూడా చెప్పకుండా ఇంటి గేటువైపు కదిలింది. "రాధికా, ఒక్కమాట" నా పిలుపు విని ఆమె బలవంతంగా నావైపు తిరిగిచూసింది.

"ఏమీ అనుకోనంటే... నీకో సలహా ఇస్తాను. నువ్వు ఆ గోపీని మర్చిపోయి, మీ అమ్మానాన్న చెప్పిన అబ్బాయినే పెళ్ళిచేసుకో. ఓ గంటసేపు దాహానికే తట్టుకోలేకపోయిన నువ్వు ఆ పేదవాణ్ణి పెళ్ళిచేసుకున్న తర్వాత జీవితాంతం పేదరికపు కష్టాల్ని ఎలా భరించగలవు? నీ దాహంముందు నీ ప్రేమ ఓడిపోయింది. అందుకే నీ అమ్మానాన్నల మాట విను!" అని చెప్పి ఆమె జవాబుకోసం ఎదురు చూడకుండా స్కూటర్‌ని ముందుకు కదిలించాను.

రాధిక నా సలహాను పాటిస్తుందో లేదో నాకు తెలియదు. కాకపోతే నేటివలపులు, నీటిబుడగలు అనే అంశంపై కథలపోటీకి నేను రాస్తున్న ప్రేమకథకు చక్కటి ముగింపు దొరికింది.

# అరుంధతి

అనురాధ
✆ 7702319351

***నేను శ్రీరాముడ్ని కాదు కానీ ఆమె మాత్రం సీతే అని నా అభిప్రాయం! ఎలాంటి అగ్నిపరీక్షలూ అవసరం లేదామెకు. అరుంధతి నాకు కావాలి. మిమ్మల్ని సహాయం అడిగినందుకు నన్ను క్షమించండి. నాలాంటివాడ్ని భర్తగా అంగీకరించిన అరుంధతికి, నేను జీవితమంతా ఋణపడి ఉంటాను.***

"మాష్టారూ... మీరు నా పెళ్ళికి సూత్రధారులు కావాలి!" అన్నాడు కృష్ణ.

"భలేవాడివే! నీ పెళ్ళికి నేను సూత్రధారినవడం ఏమిటీ? మరీ నన్ను అందలం ఎక్కించకు!" అన్నాడు వికాస్.

"నిజంగానే చెపుతున్నాను మాష్టారూ! నేను ఒక అమ్మాయిని ఇష్టపడ్డాను. మా నాన్నగారు పెళ్ళికి ఒప్పుకోకపోవచ్చు. మీరు సంఘసేవలో పేరు మోసినవారు కాబట్టి, నాన్నగారు మీ మాట కాదనరని అనుకుంటాను!" అన్నాడు కృష్ణ.

"ఇంతకీ... ఆ అదృష్టవంతురాలెవరో తెలుసుకోవచ్చా?" అన్నాడు వికాస్

"మీకు బాగా తెలుసున్నమ్మాయే... అరుంధతి!" అన్నాడు కృష్ణ.

ఆ మాట వింటూనే పక్కలో బాంబు పడ్డట్లుగా అనిపించింది. అలా అతనికి ఎందుకు అనిపించిందో తెలియాలంటే అరుంధతి కథ చెప్పాలి.

అరుంధతికి వాళ్ళ కాలనీలో మంచిపేరు లేదు. చిన్నప్పుడే, తల్లీ, తండ్రీ పోతే... తానే పెద్దదిక్కుగా చెల్లెల్ని, తమ్ముడ్ని పెంచింది.

అందరిలా ఉద్యోగం చెయ్యడానికి ఆమె చదువుకోలేదు. అంట్లు తోమి, బట్టలుతికి, కూలి పనిచేసి తమ్ముడ్ని చెల్లెల్ని చదివించలేదు. అందంగా తయారయి పొద్దున్నే వెళ్ళిపోయేది. సాయంకాలం తిరిగి వచ్చేది. 'ఆమె ఎక్కడకు వెడుతోంది? డబ్బు ఎలా సంపాదిస్తోంది?' అన్నది అందరికీ ప్రశ్నార్థకం. ఆమె చరిత్ర అందరికీ ప్రశ్నార్థకం... ఆమె తన ఒళ్ళో వాలితే బాగుండునని చాలాసార్లు అనుకున్నాడు వికాస్. సంకేతాలు కూడా ఇచ్చాడు, కానీ ఫలితం లేదు!

మనసులో ఉన్న అసంతృప్తిని వెళ్ళగక్కడానికి... ఆమె ఎవరెవరితోనో తిరుగుతుంటే చూసానని చెప్పేవాడు. అతను చెప్పినమాట నమ్మకపోవడమన్న మాటే లేదు. దానికి కారణం సంఘంలో అతనికున్న పరపతి.


అందరిలాగే వికాస్‌కు కీర్తి, ప్రతిష్ట అంటే చాలా ఇష్టం. ఇవి కావాలంటే ఏదో ఒకటి చెయ్యాలి. దానధర్మాలు చేద్దామంటే, అతని తాతముత్తాతలు ఏమీ ఆస్తులిచ్చి పోలేదు. అందుకని సోషల్ సర్వీస్ చెయ్యడమొక్కటే మార్గమని తెలుసుకున్నాడు.

అందుకే సమాజసేవ పేరిట చందాలు వసూలు చేస్తూ ఉంటాడు. ముందుగా తన జీతంలో పదిహేను శాతం ఇస్తాడు. ఆ తరువాత కలెక్ట్ అయిన డబ్బులో, అతని జేబులోకి ఎంత వెడుతుందన్నది అతనికి కాక, పరమాత్మకొక్కడికే తెలుసు.

అలా అతను మొదలుపెట్టిన సంస్థలు 'రోజురోజుకు నీవు నాజూకుగా పెరిగేవు' అన్నట్లుగా, బాగా పెరిగి ఒక సమాజసేవకుడిగా అతనికి సంఘంలో ఒకస్థానాన్ని సంపాదించి పెట్టాయి. అందుకే కృష్ణ తన పెళ్ళి విషయంలో అతని సహాయానికి వచ్చాడు.

కృష్ణ, అరుంధతిని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు... ఆశ్చర్యం వేసినా మనసులో ఒక విధమైన ఆనందం కూడా కలిగింది వికాస్‌కు! నిజం చెప్పాలంటే, కృష్ణ అన్నా అతనికి సదభిప్రాయం లేదు. కాలనీలో ఉన్న ఆడవాళ్ళల్లో అరుంధతికి 'తిరుగుబోతు' అని ఎంత పేరుందో, కృష్ణకు కూడా గోపాలకృష్ణుడన్న పేరు ఉంది.

ఆడపిల్లల్ని ఎలా బుట్టలో వేసుకోవాలో, ఎలా వాడుకోవాలో అతనికి తెలిసినంతగా ఎవరికీ తెలియదు. జులాయిలా తిరుగుతాడు. తండ్రి సంపాదించినది... ఖర్చుబెట్టడానికే పుట్టాడన్నట్లుగా తిరుగుతాడు. అతన్ని మార్చడానికి... తండ్రి చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి.



అలాంటివాడు... సడన్‌గా పెళ్ళిచేసుకుంటాననడం, అందులో అరుంధతిలాంటి అమ్మాయిని... అతనికెందుకో జీర్ణం కాలేదు!

వికాస్ మనసులో ఒక చిన్న దురాలోచన! అరుంధతి తనకు లొంగితే, ఈ పెళ్ళికి సారథ్యం వహిస్తానని చెప్పి, ఆమెను లొంగదీసుకుందామని! ఆమె ఒప్పుకుంటుందా? ఒప్పుకోక ఏంచేస్తుందన్న ధీమా!

"ఏంటి మాష్టారూ... మాట్లాడరేం!" అన్న కృష్ణ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు.

“అరుంధతి గురించి తెలిసి కూడా నువ్వు ఆమెను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావంటే, నువ్వు చాలా గొప్ప వ్యక్తివేనోయ్!” అన్నాడు.

“అరుంధతిని అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారండీ! నిజం చెప్పాలంటే, నాలాంటివాడ్ని చేసుకుందుకు ఒప్పుకున్న ఆమె గొప్పది! నేను శ్రీరామచంద్రుడ్ని కాను. ఆమె మాత్రం సీత అంత పవిత్రమైనది!” అన్నాడు కృష్ణ.

ఆశ్చర్యంగా తన మొహంలోకి చూస్తున్న వికాస్‌ను చూసి, “నేను నిజమే చెపుతున్నానండీ. నిజానిజాలు తెలియకుండా ఎదుటిమనిషి గురించి ఎప్పుడూ ఊహాగానాలు చెయ్యకూడదని నాకు అర్థమయ్యింది. మొదట్లో అందరిలాగే నాకుకూడా ఆమెమీద దురభిప్రాయం ఉండేది. అనుకోకుండా ఒకరోజు ఆమె గురించిన నిజం బైటపడి, ఆమె అంటే ఒక విధమైన గౌరవం, ఆరాధన పెరిగాయి. నిజంగా ఆమె నా సొంతమైతే, నా పాతజీవితానికి స్వస్తి చెప్పి, ఆమెను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాను!” అన్నాడు కృష్ణ.

వికాస్‌కు కృష్ణ చెపుతున్నది ఒక్కటి కూడా అర్థం కాలేదు. ఆమె గురించిన నిజం తమకెవరికీ తెలియనిది కృష్ణకెలా తెలిసింది? అసలామె వెనక ఉన్న చరిత్ర ఏమిటీ? ఈ సస్పెన్స్ కృష్ణమాత్రమే విడగొట్టగలడు.

“మాకెవరికీ తెలియకుండా నీకు తెలిసిన నిజమేమిటో చెప్పవయ్యా… సస్పెన్స్‌లో పెట్టక! ఇన్నాళ్ళూ ఆమె గురించి నువ్వుకూడా మా అందరిలాగే అనుకున్నావు కదా! అలాంటి వృత్తి కాకపోతే, తేరగా ఎవడుమాత్రం అంత డబ్బు ఇస్తాడు ఈ రోజుల్లో?”

“అదేమాస్టారూ! ఎంతసేపూ ఎదుటివాడి బలహీనతలతో ఆడుకుందామనుకునే మనస్తత్వం… మనలోంచి పారదోలాలి. ఆమె ఎక్కడికి వెడుతోందని కానీ, ఏం చేస్తోందని కానీ మనలో ఎవరైనా చూసామా? ఒక్కళ్ళు కూడా ఆమె పరాయిమొగాడితో తిరిగినట్లు చూడలేదు. అన్నీ ఊహాగానాలే! పడుపువృత్తిలో తప్ప ఇంక ఏ వృత్తిలోనూ డబ్బు సంపాదించడం సాధ్యంకాదన్న నమ్మకం ఒకటైతే, వెర్రివాడి పెళ్ళాం ఊరందరికీ లోకువన్న సామెతలాగా ఆమె ఒంటరితనం, ఆమె అందం, తమకు దక్కలేదన్న బాధతో ఆమెమీద మనమే పుకార్లు లేవదీసాం! ఐనా ఆమె ఏ ఒక్కర్నీ ‘నా గురించి ఇలాంటి పుకార్లు ఎందుకు పుట్టిస్తున్నారని’ నోరు విప్పి మనల్ని ప్రశ్నించిందా?”

నిజమే. కృష్ణచెప్పిన మాటలు కరెక్టే. పొద్దున్న తయారయ్యి ఎక్కడికో వెడుతుందని, చీకటిపడ్డాక వస్తుందని మాత్రం తెలుసు.

కుతూహలాన్ని ఆపుకోలేక, “అసలు సంగతి నీకు ఎప్పుడు ఎలా తెలిసింది?” అన్నాడు వికాస్.

“కాస్త మంచినీళ్ళు ఇస్తారా?” అన్నాడు కృష్ణ.

అరుంధతి వెనకాల ఉన్న చరిత్ర తెలుసుకోవాలన్న కుతూహలంతో, గబగబా లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు వికాస్.

అతను తెచ్చిన నీళ్ళు తాగి, గ్లాస్ బల్లమీద పెట్టి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

అతను చెప్పేది వినడానికి చెవులు నిక్కబొడుచుకుని, కుర్చీదగ్గరకు జరుపుకున్నాడు వికాస్.

“అరుంధతికి పదహారేళ్ళవయసులో తల్లి, తండ్రి చనిపోయారు. ఆమెతోపాటు చెల్లి, తమ్ముడు కూడా అనాథలయ్యారు. పదవతరగతి పాస్ అయిన అరుంధతి, ఇంటికి పెద్దదిక్కయ్యింది. ఇల్లు గడవడానికి డబ్బు కావాలన్న విషయం అతి

కొద్దికాలంలో తెలిసింది. అప్పటిదాకా తండ్రి ఉద్యోగం కానీ, తమ ఇల్లెలా గడుస్తోందని కానీ తెలియదు.

తండ్రి స్నేహితులెవరో కొద్దిరోజులు సహాయం చేసారు. వాళ్ళల్లో ఒకరు ఆమె తండ్రి ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడని, వచ్చిన జీతం నిత్యావసరాలకి సరిపడేంత మాత్రమేనని, బాంక్ బాలెన్స్ నిల్ అని చెప్పాడు.

అరుంధతి ముందు అప్పుడు కనబడిన పరిస్థితులు... ఏదైనా పనిచేసి వాళ్ళ ముగ్గురి కడుపులూ నింపుకోవాలి. ఏ పని చెయ్యాలి? ఎక్కడికెళ్ళినా టెంత్‌క్లాస్‌కి నీకేం ఉద్యోగం ఇస్తాం అన్నవాళ్ళు, ఆబగా ఆమె అందాన్ని మాత్రం ఆస్వాదించే వాళ్ళు!

కాళ్లరిగి పోయేటట్లు ఉద్యోగానికి తిరిగినా లాభం లేకపోయింది. తమ్ముడు, చెల్లి, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, తన అందాన్ని అమ్మితేనే కానీ తమ కడుపులు నిండవని అర్థమయ్యింది. ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న సంకల్పం ఆమె మనసులో.

ఆకలి మనిషితో ఏ పనైనా చేయిస్తుంది. కొద్దిరోజులు డబ్బుకోసం ఒళ్ళు అమ్ముకోక తప్పలేదామెకు. తమ్ముడు, చెల్లెళ్ళ ఆకలిచూపులకు ఆమెకంతకన్నా గత్యంతరం లేకపోయింది

అనుకోని పరిస్థితిలో డాక్టర్ సారథి ఆమె జీవితంలో తారసపడి, ఆమె బురదలో కూరుకుపోకుండా కాపాడాడు.

అరుంధతికి ఒకరోజు రోడ్డుపక్కన రక్తసిక్తమైన ఒక ఆడమనిషి కనబడింది. అందరూ ఒకసారి ఆమెవైపు చూసి వెళ్ళిపోతున్నారు తప్ప సహాయానికి ఎవరూ రాలేదు. ఏ కారో స్కూటరో గుద్దేసి వెళ్ళిపోయినట్లుంది.

దగ్గరికెళ్ళి చూసి ముక్కుదగ్గర వేలు పెట్టింది. ఆమె పీలుస్తున్న ఊపిరి ప్రాణం ఉన్నట్లు నిర్ధారించింది. పక్కనున్న పర్స్ తీసి వెతికింది. ఒక సెల్‌ఫోన్, కొద్దిగా డబ్బులు, ఇంకా వెతకగా ఒక విజిటింగ్ కార్డ్ దొరికాయి.

విజిటింగ్ కార్డ్ తీసి అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసింది. డాక్టర్ సారథి నంబరది! ఫోన్ ఎత్తిన వెంటనే “చెప్పు లలితా” అన్నాడు.

“లలితెవరో నాకు తెలియదండీ. ఇక్కడ ఒక ఆడమనిషి ఏక్సిడెంట్ అయ్యి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. నా పేరు అరుంధతి. ఆమె పర్స్‌లో మీ కార్డ్ ఉంటే మీకు ఫోన్ చేసాను.” అంది.

ఆమె చెప్పినది విని, “ఆమె నా చెల్లెలు. అంబులెన్స్ తీసుకుని వస్తాను. నేను వచ్చేదాకా కాస్త ఆమె దగ్గర ఉంటారా? మీరెక్కడున్నారో చెపితే నాకు రావడానికి సులువుగా ఉంటుంది!” అన్నాడు.

ఆమె ఆనవాళ్ళు చెప్పి, అతను వచ్చేదాకా ఉంది. పసిప్రాయంలో ఉన్న ఆ పదహారేళ్ళ పడుచును చూడగానే నిర్ఘాంతపోయాడు. ‘తనకెందుకు?’ అని అనుకోకుండా ఎంత బాధ్యతగా ప్రవర్తించింది?

అంబులెన్స్‌లో పడుకోబెట్టాక, “పోనీ నేనూ సహాయానికి రానా!” అని అడిగింది.

రమ్మన్నట్లు తల ఊపి, ఆమెను అంబులెన్స్‌లో కూర్చోమని, తాను కార్‌లో వెనక బయలుదేరాడు.

హాస్పిటల్ చేరి, లలితను లోపలికి తీసుకెళ్ళేదాకా ఉండి, 'ఇంక వెడతానని' బైటపడింది.

లలితకు తొందరగా చికిత్స అందించాలన్న హడావుడిలో తల ఊపాడు. ఆమె మెల్లిగా ఇంటికి చేరింది. ఇంటికి చేరిన ఆమెకు దిగాలుమొహాలతో ఎదురుపడ్డారు, చెల్లి, తమ్ముడు.

"అక్కా! ఏమైనా తినడానికి తెచ్చావా?" అన్న వాళ్ళమాటలు విన్నాక కానీ, తినడానికి ఇంట్లో ఏమీలేదన్న సంగతి గుర్తురాలేదు.

"అక్కా కొత్తపర్స్ కొన్నావా?" అన్న చెల్లెలి మాటలతో, తన చేతికున్న పర్స్ చూసి... 'అయ్యో హడావుడిలో ఆవిడ పర్స్ నా దగ్గరే ఉండిపోయింది. రేపు వెళ్ళి ఇచ్చేయాలి' అనుకుంది.

ఆకలి గుర్తొచ్చి, పర్స్‌లోంచి ఒక పదిరూపాయలు తీసుకుని, రేపు చెప్పి ఆ డబ్బులెక్కడైనా సంపాదించి ఇచ్చేదామని పర్స్ తెరిచింది. హడావుడిలో చూడలేదు కానీ డబ్బు చాలానే ఉంది. అన్నిటి కన్నా చిన్న నోటు యాభైరూపాయలు ఉంది. అప్పనుకున్నాక ఏదైనా తప్పదు, అనుకుని అదితీసి, తమ్ముడికిచ్చి బియ్యం కానీ, బ్రెడ్ కానీ పట్టుకురమ్మంది.

పదిహేను రూపాయలిచ్చి బియ్యం తెచ్చాడు. రేషన్ బియ్యం కిలో పదిహేనుకిచ్చాడట కొట్టువాడు.

తమ్ముడి తెలివికి సంతోషించింది. రెండుపూటలు గడుస్తాయి.

మర్నాడు పర్స్ వెనక్కి ఇద్దామని హాస్పిటల్‌కు వెళ్లింది. సారథి కావాలంది. నిన్నటిరోజున డాక్టర్‌గారితో, ఈ అమ్మాయి రావడం చూసిన నర్స్, డాక్టర్ గారికి ఈ అమ్మాయి వచ్చినట్లు చెప్పింది.

హడావుడిలో ఆ అమ్మాయి వివరాలు అడగలేదని రాత్రల్లా బాధపడ్డాడు సారథి. నిజంగా ఆ అమ్మాయి సహాయం చెయ్యకపోతే, తనచెల్లెలు దిక్కులేని చావు చచ్చిపోయేది. ఆ అమ్మాయిని లోపలికి రమ్మన్నాడు.

లోపలికొచ్చిన అరుంధతికి ఏసీ గాలి చల్లగా తగిలింది. తనచేతిలో ఉన్న పర్స్ అతని టేబుల్ మీద పెడుతూ, "నిన్న పర్స్ నా చేతిలో ఉండిపోయింది. హడావుడిలో గమనించలేదు. ఇందులోంచి అవసరం పడి ఒక్క పదిహేను రూపాయలు తీసుకున్నాను. క్షమించండి డబ్బులు దొరకగానే ఇచ్చేస్తాను. తమ్ముడూ, చెల్లెలూ ఆకలిగా ఉన్నారంటే తప్పదని తీసుకున్నాను" అంటున్న ఆమె కళ్ళవెంబడి కన్నీళ్ళు జలజలా రాలాయి.

అవసరంలో ఉండి కూడా ఎదుటివారి డబ్బు దొంగతనం చెయ్యకుండా, తీసుకున్న డబ్బుకు లెక్క, క్షమాపణ చెపుతున్న ఆ అమ్మాయి సంస్కారానికి ముచ్చటవేసింది సారథికి. ఆమెను కూర్చోమని, ఆమె వివరాలు అడిగాడు.

అతనలా ఆప్యాయంగా అడగగానే ఒక్కసారి తెరలుతెరలుగా దుఃఖం బైటికి వచ్చింది. ఆమెను కాస్సేపు ఏడవనివ్వడమే మంచిదని ఊరుకున్నాడు.

ఒక పదినిముషాల తరువాత తేరుకుని, పమిటచెంగుతో కళ్ళుతుడుచుకుని "సారీ అండీ" అంది సిగ్గుపడుతూ.

"ఫరవాలేదు. ఈ మంచినీళ్ళు తాగి, నీ గురించి చెప్పు. ఆ పదిహేను రూపాయలూ ఇవ్వక్కరలేదు. నువ్వు చేసిన సహాయానికి ఎంతిచ్చినా నీ ఋణం తీరదు!" అన్నాడు.

"సాటిమనిషికి, అందులో ప్రమాదంలో ఉన్నవాళ్ళకు సహాయపడకపోతే, మనం మనుష్యుల కింద జమ కామండి! నాన్నగారు

ఎప్పుడూ ఎదుటివాడికి సహాయపడాలని అంటూ ఉండేవారు. ఇందులో ఇంక ఋణాల ప్రసక్తి దేనికి? ఇంతకీ లలితగారెలా ఉన్నారు?" అంది.

"దేముడి దయవల్ల బాగానే ఉంది. ఏ కారో స్కూటరో కొట్టేసింది. సమయానికి నువ్వు కాపాడావు. చాలా మందికి, ఏక్సిడెంట్ కేస్ అంటే పోలీసులు, కేసులన్న భయంతో సహాయం చెయ్యరు. చిన్నపిల్లవు కాబట్టి నీకా భయాలేవీ తెలియవు. నీగురించి వివరాలు చెప్పమ్మా, చేతనైతే సహాయం చేస్తాను!" అన్నాడు.

తనకథ చెప్పి, "చేతనైతే నాకేదైనా పని ఇప్పించండి. మీపేరు చెప్పుకుని, నేను, నా చెల్లి, తమ్ముడూ పట్టెడన్నం తింటాము. పని అడిగితే పడుపువృత్తిలోకి దింపుదామని చూస్తున్నారు. ఆకలికి ఆగలేక ఆ పనే అప్పుడప్పుడు తప్పటం లేదు!" అంది.

ఆ అమ్మాయి మాటలకు ఒక్కసారి ముల్లుగుచ్చుకున్న భావన సారథి మనసులో కలిగింది. ఇంత చిన్నవయసులో ఆమెకు కలిగిన అనుభవం... ఎవరికి కలిగినా కడుపు కోసం ఆ వృత్తి ఆశ్రయించక తప్పదు కదా!

"కొంచెం కష్టమైన పని చేస్తావా?" అన్నాడు.

"శరీరం అమ్ముకోవడం కన్నా కష్టమైన పని ఉంటుందంటారా? అంతకన్నా ఏదైనా నాకు కష్టం కాదు!"

అంత చిన్నపిల్ల ఆకలికోసం శరీరం అమ్ముకోవాల్సి వచ్చినందుకు బాధతో కడుపులో దేవినట్లయ్యింది. ఆమె చెయ్యవల్సిన పని చెప్పాడు. ఆమె ఆనందంగా ఒప్పుకుంది. నెలకు ఇరవై వేలు జీతం!"

అక్కడితో ఆపాడు కృష్ణ.

వికాస్ మనసులో సస్పెన్స్. ఇరవైవేలు ఇచ్చేపని ఏమై ఉంటుంది? ఆ డాక్టర్‌కి ఉంపుడుగత్తెగానా?

మనసులో మాట నోరుజారాడు.

ఆమాట విన్న కృష్ణ మనసులో, అప్పటిదాకా అతనిమీద ఉన్న గౌరవం మంటకలిసి, అసహ్యం వేసింది. "నేనిలా అన్నానని ఏమనుకోకండి మాష్టారూ. మీరు స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నారంటే, మీ గురించి చాలా ఊహించుకుని ఒక గౌరవభావం పెంచుకున్నాను. మీ మనసులో అరుంధతిపట్ల ఈ భావం ఇంత గాఢంగా ఉందని నాకు తెలియదు. అరుంధతికి దొరికిన ఉద్యోగం ఏమిటో చూస్తారా?" అంటూ తన సెల్ ఫోన్ తీసాడు.

అందులో ఉన్న ఒక చిత్రం చూసి, కడుపులో దేవినట్లుగా భావన. ఒక ఆడమనిషి ఒంటినిండా కురుపులతో రసికారుతూ ఉన్నస్థితిలో ఉంది. మరొకఫోటో చూపించాడు. నవ్వుతూ కుర్చీలో కూర్చున్న ఆవిడ కాళ్ల దగ్గర కూర్చుని ఉంది అరుంధతి. జాగ్రత్తగా చూస్తే... కుర్చీలో కూర్చున్న ఆమె మొహంలో కురుపులతో ఉన్న ఆమె పోలికలు కనబడుతున్నాయి.

"చూసారా మాష్టారూ! తన అవసరానికి డబ్బు తీసుకున్నా, ఆమె ఈనాటి స్థితికి కారకురాలు అరుంధతి. మనస్ఫూర్తిగా ఆమెకు సేవ చేసింది. ఆమెకు డబ్బు ఉంది కానీ, ప్రేమించే మనిషి లేదు. అరుంధతికి రెండూ లేవు. అయినా ఆమెకు సేవచేసింది. అరుంధతికి లేని రెండూ ఈమెదగ్గర దొరికాయి. ఇప్పుడు చెప్పండి ఎవరు స్వచ్ఛంద సేవకులో? ఆడది చెడిపోయిందని దుమ్మెత్తి పోసేముందు, ఆ చెడిపోవడానికి కారణాలు, కారకుల్ని వెతికి ఆమెకు చేయూతనివ్వడం సంఘసంస్కరణ అనాలా,

లేక ఆమె పక్కన నిలబడడానికి భయపడుతూ, పక్కలోకి రమ్మనడానికి జంకక పోవడం సంఘసంస్కరణ అనాలా? మగవాడికి అక్కరలేని నీతినియమాలు, ఆడదానికెందుకు అంటగట్టడం? చెడిపోవడానికి కారకులమూ మనమే. చెడిపోయిందని విమర్శించేది మనమే. ఒకపక్కన ఆడదాన్ని ఆదిశక్తిగా పూజిస్తూ, మన ఎదురుగా ఉన్న ఆడదాన్ని, మనదనుకున్న ఆడదాన్ని అణగదొక్కాలనుకోవడంలో ఏం న్యాయం ఉంది? ఆమె అవసరానికి తన శరీరం కొద్దిరోజులు అమ్ముకుంది. డబ్బుమదంతో నేను అలాంటి శరీరాలు కొనుక్కున్నాను. నేను శ్రీరాముడ్ని కాదు కానీ ఆమె మాత్రం సీతే అని నా అభిప్రాయం! ఎలాంటి అగ్నిపరీక్షలూ అవసరం లేదామెకు. అరుంధతి నాకు కావాలి. మిమ్మల్ని సహాయం అడిగినందుకు నన్ను క్షమించండి. నాలాంటివాడ్ని భర్తగా అంగీకరించిన అరుంధతికి, నేను జీవితమంతా ఋణపడి ఉంటాను. మా నాన్నతో మా పెళ్ళివిషయం నేనే చెప్తాను. డాక్టర్‌గారు అరుంధతివైపునుంచి పెళ్ళిపెద్దలు! తోబుట్టువులు లేని నేను ... అరుంధతి తోబుట్టువులనే నావాళ్ళుగా భావిస్తాను. మీ మనసు ఏమాత్రం మారినా, నా పెళ్ళికొచ్చి అక్షింతలు వెయ్యండి. సెలవు మాష్టారూ!” అంటూ అక్కడినించి బైట పడ్డాడు.

చాచి లెంపకాయ కొట్టినట్లుగా అయ్యింది వికాస్, ‘ద గ్రేట్ స్వచ్ఛంద సేవకుడు’కి!

# పాత్రమెరిగిన ఫలం


## శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు

✆ 9912848738


*అతని చెల్లెలు వైదేహి "అంత ఆహారాన్ని తీసుకెళ్లేందుకు సరిపడా పాత్రలు మన దగ్గర లేవన్నయ్యా" అంది నిస్సహాయతని తెలియజేస్తూ. "అన్నయ్యా, పోతే పోనీ! ఆ ఫుడ్ గురించి ఎందుకంత టెన్షన్? వాళ్లే ఎక్కడో పారేస్తారులే...." అంది వైదేహి చాలా క్యాజువల్‌గా.*

*విశ్వానికి 'పారబోయడం' అనే మాట చాలా బాధని కలిగించింది. ఆ మిగిలిపోయిన ఆహారాన్ని అన్నార్తులకు చేరవేసేందుకు ఎటువంటి అవకాశంలేక ఊరకుండిపోయాడు.*

"ఏమండీ, ఈ నెలయినా ఈ మిక్సీని ఇచ్చేసి ఎక్స్ఛేంజిలో కొత్తది తీసుకుందామండీ! పాతది బాగా ఇబ్బంది పెడ్తోంది..." అర్థింపుగా అడిగింది వసుంధర, తన భర్త విశ్వాన్ని సూటిగా చూడలేక, బేలగా నేలచూపులు చూస్తూ. భార్య మాటలకు విశ్వం కాస్త ఇబ్బందిగా మొహం పెట్టి, "సారీ వసూ, ప్రస్తుతానికి ఏదో నడుస్తోంది కదా. ఈ నెల ఎలాగో సర్దుకో. వచ్చేనెల చూద్దాం..." అన్నాడు ఆమెకు నచ్చజెప్తోన్న ధోరణిలో.

భర్త మాటలకు కాస్త ధైర్యం తెచ్చుకున్న వసుంధర, "మీరు తగదునని... మంది సమస్యలను నెత్తినేసుకుంటే, మన సమస్యలెలా తీరుతాయి!" కాస్త అసహనాన్ని కురిపిస్తూ నిష్ఠూరంగా అంది వసుంధర.

"మంది సమస్యలంటే... నా తోడబుట్టిన చెల్లెలుకి ఏదో ఆ కాస్త సాయం చేస్తున్నాననేగా నీ బాధంతా..." అన్నాడు విశ్వం భార్యపై చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ.

"సర్లేండి. ఏదైనా అంటే ఇట్టే కయ్యిమంటారు. మనపరిస్థితే అంతంత మాత్రం కదా అని నా ఉద్దేశ్యం..." అంటూ విశ్వం కోపాన్ని చల్లబరుస్తున్నట్టుగా నీళ్లు నమిలింది వసుంధర.


"చూడు వసూ, మనకు ఏవో చిన్నచిన్న ఇబ్బందులున్నాయని కష్టాల్లో ఉన్న నా చెల్లెలికి ఆ మాత్రపు ఆపన్నహస్తాన్ని అందించటం నా బాధ్యత కాదంటావా? నువ్వే ఆలోచించు!" అంటూ ఎప్పటిలాగే అలవాటు ప్రకారం భార్యకు వివరణ ఇచ్చుకున్నట్టుగా చెప్పాడు విశ్వం.

"సర్లెండి, మహానుభావా... మీరెప్పుడూ కరెక్టే! నేనే పొరపాటున నోరు జారిపోతుంటాను." తన పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తూ, అలాగే భర్త ఉద్దేశ్యాన్ని సమర్థిస్తున్నట్టుగా అంది వసుంధర.

భార్య మాటలకు ఎంతో ఉపశమనం దొరికినట్టుగా హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు విశ్వం.

ఇరువురి మధ్య ఈ తంతు ఆనవాయితీగా అప్పుడప్పుడు చోటుచేసుకుంటున్నదే కావడంతో వసుంధర మరింకేమీ మాట్లాడకుండా, అక్కన్నుంచి మౌనంగా వెళ్ళిపోయింది.

విశ్వం, ఓ మధ్యతరగతికి చెందిన సర్వసాధారణమైన ఒక మామూలు సగటుమనిషి! సగటు మనిషంటే అందరిలాంటివాడు కాదు విశ్వం! అందరికోసం ఆలోచన చేసే అరుదైన వ్యక్తిత్వం, మహోన్నతమైన మానవత్వం కలబోసిన ఓ మనసున్న మనీషి! విశ్వం... ఓ గవర్నమెంట్ ఆఫీసులో అటెండరుగా ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ, తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. తనవంతు బాధ్యతగా సమాజానికి ఏదో చేయాలనే తాపత్రయంతో నిరంతరం పరితపిస్తుంటాడు. విశ్వం తనజీతంలో అన్ని కటింగ్స్ పోనూ, నెలకు ఓ ఇరవైవేల రూపాయలు అందుకుంటుంటాడు. ఇంటిఖర్చులకు పోనూ, మిగిలినదాంతో తన సహాయకోద్యమాన్ని కొనసాగిస్తుంటాడు. అతనుచేసే ఆ ఉద్యోగానికి ఎటువంటి అదనపు రాబడి ఉండదు. అటువంటి అవకాశం ఏమూలో అరకొర ఉన్నా, అందిపుచ్చుకోనటువంటి విశిష్టవ్యక్తిత్వం కలవాడు విశ్వం! అతనికి ఆదాయానికి మించిన అదనపు బాధ్యతలు అనేకం! ఎన్ని ఆర్థిక అవసరాలున్నా, ఎటువంటి ఇబ్బందులున్నా... పేదరికంతో సతమతమవుతోన్న తోడబుట్టిన తన సోదరికి ప్రతీనెలా ఓ నాలుగువేల రూపాయలను క్రమం తప్పకుండా పంపిస్తుంటాడు. అంతేకాకుండా ఓ అనాథాశ్రమానికి నెలనెలా ఓ వెయ్యి రూపాయలు కూడా ఆర్థికసహాయాన్ని అందిస్తుంటాడు. అతని భార్య వసుంధర, 'ఇలాంటి తనకుమాలిన ధర్మం మనకెందుకండీ?' అని అనేకసార్లు చెప్పి చూసింది. కానీ ఆమెమాటలు అతనిలోని దాతృత్వాన్ని నిలువరించలేకపోయాయి.



"నువ్వూ అందరిలాగే ఆలోచిస్తే ఎలా వసూ? మనిషికి ఆశలు అనంతాలు! ఒకటి తీరితే వంద పుట్టుకొస్తాయి. వాటికోసం పాకులాడుతూ సాటివారు బాధల్లో ఉంటే, చూస్తూ ప్రశాంతంగా ఎలా బ్రతకగలం? ఏదో మనకు చేతనైనంత సాయంచేసుకుంటూ పోవడమే కదా మనిషిజీవితానికి అర్థం... పరమార్థం!" అంటూ విశ్వం నిత్యం భార్యని బుజ్జగిస్తూ అనునిత్యం నిర్మలంగానూ, నిస్వార్థంగానూ తన జీవనయానాన్ని కొనసాగిస్తుంటాడు.

వసుంధర, భర్త మంచిమనసును నొప్పించడం ఇష్టం లేక, మౌనంగా ఉండిపోతుంది. విశ్వం మాత్రం తనకు డబ్బుతో ఎన్ని అవసరాలు పడినా, సర్దుబాటు చేసుకుంటాడే గానీ తన సహాయపడే తత్వాన్ని వదులుకోవడానికి ఇష్టపడడు.

★★★

విశ్వం సెల్‌ఫోన్ రింగయింది. ఆ ఫోన్ అతని చెల్లెలు వైదేహి భువనేశ్వర్ నుంచి చేసింది. “అన్నయ్యా, లక్కీగా ఓ ఇల్లు తక్కువరేటులో వస్తే కొనుక్కుంటున్నాం. వారంరోజుల్లో గృహప్రవేశం. వదిన, నువ్వూ తప్పకుండా రావాలి.” అంటూ అతని చెల్లెలు, ఇరువురినీ ఎంతో అభిమానంతో ఆహ్వానించింది.

ఆ వార్త విశ్వానికి ఎనలేని ఆనందాన్ని కలిగించింది. ఇన్నేళ్లకు తన చెల్లెలికి నెలనెలా అద్దె కట్టుకునే బాధ నుండి విముక్తి లభిస్తోన్నందుకు ఎంతోగానో సంతోషించాడు.

“ఏమండీ, మీ చెల్లెలు గృహప్రవేశానికి ఇంటికి అవసరమైనది ఏదైనా గిఫ్ట్‌గా ఇస్తే బాగుంటుంది. మిక్సీలాంటిది ఏదైనా తీసుకుందామా?” భర్తని అడిగింది వసుంధర.

“మరీ అంత చిన్నగిఫ్ట్ ఇస్తే ఏం బాగుంటుంది? ఓ చిన్న రిఫ్రిజ్రేటర్‌ని వాయిదాల పద్ధతిలో తీసుకుందామనుకుంటున్నాను. నువ్వేమంటావు?” భార్య అభిప్రాయాన్ని అడిగాడు విశ్వం సాలోచనగా.

“ఆమాత్రం పెట్టడానికి సిద్ధపడినవారు ఓ చిన్న వాషింగ్ మెషీన్ ఇస్తే ఇంకా బాగుంటుంది కదండి. నాలుగేళ్ళ క్రితం మనం వాళ్ళింటికి వెళ్ళినప్పుడు తను బట్టలు ఉతకలేక నానా అవస్థలు పడ్డం నేను ప్రత్యక్షంగా చూసాను!” అంది వసుంధర భర్త ఆలోచనకి మరింత ఊతమిస్తున్నట్టుగా.

విశ్వం భార్యవైపు ఆశ్చర్యంగా చూశాడు. వసుంధర అతని చూపులను చదివివేసినట్టుగా, “నేను... మీ అర్ధాంగినండి. మీ గుణంలో సగమైనా నాకు రాకుండా పోతుందా చెప్పండీ!” అంది చిరుగర్వంతో కూడిన నవ్వుని చిందిస్తూ.

విశ్వం తన భార్య ప్రోత్సాహానికి ఎంతగానో మురిసిపోతూ “అయితే నువ్వు చెప్పినట్టుగానే వాషింగ్ మెషిన్ తీసుకుందాం!” అన్నాడు హుషారుగా, చెల్లెలి గృహప్రవేశానికి గిఫ్ట్‌ని ఖరారు చేస్తున్నట్టుగా!

“అయితే భువనేశ్వర్ వెళ్ళాక, తనకు తెలియకుండా అక్కడే వాషింగ్‌మెషిన్ని కొని, మీ చెల్లిని ఒక్కసారిగా సడన్ సర్ప్రైజ్ చేద్దాం. ఏమంటారు?” అంది వసుంధర మరింత ఉత్సాహంగా.

విశ్వం, భార్య చెప్పిన మాటలకు ఎంతోగానో ఆనందించి, అందుకు సరేనన్నాడు.

★★★

అనుకున్నట్టుగానే విశ్వం, వసుంధరలు ఉదయాన్నే రైలులో బయల్దేరి గృహప్రవేశానికి ముందురోజు మధ్యాహ్నానికి వైదేహి ఉంటోన్న భువనేశ్వర్ చేరుకున్నారు. ఫోన్‌లో వైదేహి చెప్పిన కొత్త అడ్రస్ ప్రకారం ఆమె ఇదివరకు ఉన్నటువంటి పాతకాలనీలో ఉండటంలేదని విశ్వం, వసుంధరలకు అక్కడికెళ్ళాక అర్థమైంది. విశ్వానికి అప్పుడెప్పుడో చెల్లెలు ఇల్లు మారుతున్నామని చెప్పినట్టు గుర్తుకువచ్చింది. వైదేహి అద్దెకు ఉంటోన్న ఇల్లు చూసి భార్యాభర్తలిద్దరూ ఒక్కసారిగా శిలాప్రతిమల్లా నిశ్చేష్టులై పోయారు.

వైదేహి అద్దుకుంటూన్న ఇల్లు ఎంతో అందంగా, చాలా పెద్దగా ఉంది. నెలకు నాలుగువేలు రూపాయలు అద్దె అని, 'తను నెలనెలా పంపిస్తూన్న డబ్బులతోనే ఆ ఇంటి అద్దె చెల్లిస్తున్నానని' చెల్లెలు ఎంతో ఆనందంగా అసలు సంగతి చెప్పింది.

వైదేహి అద్దెకు ఉంటున్న ఇంట్లోకి ప్రవేశించిన రేవంత్, వసుంధరలు ఎంతగానో విస్తుపోతూ అంతులేని విస్మయానికి గురయ్యారు. ఆ ఇంటిలో అన్ని వసతులతో అన్నిరకాల వస్తువులూ పుష్కలంగా ఉన్నాయి. ఏసీ, ఇన్వెర్టర్, ట్రిపుల్ డోర్ ఫ్రిడ్జ్, పెద్ద డైనింగ్ టేబుల్, మైక్రోవేవ్ అవెన్, తాము బహుమతిగా ఇద్దామనుకున్న చిన్న వాషింగ్ మెషిను స్థానంలో పెద్ద వాషింగ్ మెషినూ... తదితర వస్తువులతో ఇల్లంతా కళకళలాడుతూ నిండుగా కనిపించింది.

భార్యాభర్తలిద్దరూ నోట మాటరాక ఆశ్చర్యంతో గుడ్లు తేలేసారు. చెల్లెలు వైదేహి జీవితం తాము ఊహించినట్టు దుర్భరస్థితిలో ఏమీలేదని విశ్వానికి నెమ్మదిగా అర్థమైంది.

మధ్యాహ్నం భోజనాల అనంతరం, అతని చెల్లెలు వైదేహి అన్నావదినలను అక్కడికి కొద్దిదూరంలో గల తమ కొత్త ఇంటికి తీసుకెళ్ళింది. ఆమె భర్త దగ్గరుండి గృహప్రవేశానికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకుంటున్నాడు. కొత్త ఇల్లు సర్వహంగులతో సర్వాంగ సుందరంగా ఉంది. రిజిస్ట్రేషనుతో అరవై లక్షల దాకా అయ్యిందని, ముప్పయి లక్షలు అప్పుచేసి కొన్నామని చెప్పుకొచ్చారు వైదేహి మరియు ఆమె భర్త.

"అన్నయ్యా, నిన్ను నమ్ముకునే అంత అప్పు చేసాం" అంటూ వైదేహి అతని నెత్తిని పిడుగులాంటి మాట కుమ్మరించింది. చెల్లెలు మాటలు విన్నాక, 'అంత అప్పుచేసి ఇల్లు కొనాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆమెని గట్టిగా నిలదీసి అడగాలనుకుని, అంతలోనే చెల్లెలు బాధపడుతుందని ఆగిపోయాడు.

చెల్లెలు వైదేహి తన కొత్తఇంటిని అణువణువూ చూపిస్తూ ఏదేదో చెప్పుకుపోతోంది. మధ్యమధ్యలో తోరణాలు కడుతున్న పనివారికి సూచనలు చేస్తోంది. చెల్లెలి మాటలేవీ విశ్వం చెవిన పడ్డం లేదు. అతని మెదడు అప్పటికే మొద్దుబారిపోయింది.

చెల్లెలు వైదేహి ఇంట్లోనే ఆడవాళ్ళకు అవసరమైన చీరలు, నైటీలు వగైరా అమ్ముతూ బట్టలవ్యాపారం చేసుకుంటోందని, అలాగే టైలరింగ్ చేస్తూ బాగానే సంపాదించుకుంటుందని విశ్వానికి నెమ్మదిగా బోధపడింది. అంతేకాకుండా, చెల్లెలు వైదేహి ఇంటిపనులు కోసం ఒక పనిమనిషిని, అలాగే బట్టల వ్యాపారం, టైలరింగ్ పనుల్లో సహాయంగా ఉండేందుకు మరొక ఆమెను పనిలో నియమించుకుంది.

తాను ఎన్నో అవసరాలు నియంత్రించుకుని, నెలనెలా పంపిస్తున్న డబ్బు... తన చెల్లెలుకు పోకెట్ మనీ కంటే చాలా చిన్నమొత్తమని బోధపడడానికి విశ్వానికి అట్టే సమయం పట్టలేదు. తను ఇంతకాలంగా చేస్తున్నది 'సాయం' అనుకుని మనసులో ఎంతోగానో మురిసిపోయాడు. తను చేస్తున్నది సహాయం కాదని సుస్పష్టంగా అర్థమైంది విశ్వానికి. తన భర్త పరిస్థితి సాంతం అర్థంచేసుకున్న వసుంధర, ఇంకేమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

"అన్నయ్యా... గృహప్రవేశానికి ఏదో గిఫ్ట్ ఇవ్వడానికి ప్లాన్ చేసుకునే వుంటారు కదా! ఈ మధ్య నేను సెవెన్ హండ్రెడ్ లీటర్ల సైడ్ బై సైడ్ పెద్ద రిఫ్రిజిరేటర్ ఒకటి చూసాను. అది కొనిపెట్టు చాలు. అదేమంత ఖరీదేమీ కాదు. జస్ట్ లక్షా యాభైవేలు రూపాయలు మాత్రమే!" అంది వైదేహి విశ్వానికి వేడివేడి టీ గ్లాసుని అందిస్తూ!

వైదేహి మాటలకు విశ్వం గొంతులో పెద్ద వెలక్కాయ పడ్డట్టుగా ఒక్కసారిగా పొలబారాడు.

వైదేహి అడిగినదానికి ఎలా బదులివ్వాలో అర్థంకాక "సరేలే, అంత పెద్దమొత్తమంటే ప్రస్తుతానికి వీలు కాదమ్మా! తరువాత చూద్దాం!" అన్నాడు విశ్వం.

చెల్లెలు కోరికని అప్పటికి తాత్కాలికంగా దాటవేసాడు. అన్న విశ్వం మాటలకు వైదేహి మొహం నల్లగా మాడిపోయింది. వెంటనే సర్దుకున్నట్టుగా "సరేలే, అన్నయ్యా! కొత్త ఇంటికి సరికొత్త పెద్ద ఫ్రిజ్ వస్తే, అందం వస్తుందని ఎంతో ఆశపడ్డాను. దాందేముంది, కొన్నాళ్ళు ఆగుతాను." అంది వైదేహి, కాస్త నిరాశ ధ్వనించిన స్వరంతో.

ఆ మరుసటిరోజు ఉదయం మూడుగంటలకే గృహప్రవేశ కార్యక్రమం వైభవోపేతంగా ఆరంభమయింది. బంధుమిత్రుల రాకతో, ఇల్లంతా నవ్వులతో కళకళలాడింది. ఉదయం ఎనిమిది గంటలకు క్యాటరింగ్‌వాళ్ళు బ్రేక్‌ఫాస్ట్ నిమిత్తం టిఫిన్లు తీసుకువచ్చారు. నాలుగురకాల చట్నీలతో ఇడ్లీ, పూరీ, ఉప్మా, పెసరట్లు, వడ, బోండా మొదలైన ఐటమ్స్‌తో బ్రేక్‌ఫాస్ట్ మొదలయ్యింది. ప్లేటు నూటయాభై రూపాయలు పడిందని వైదేహి ఎవరితోనో చెప్పడం విన్న విశ్వం, ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వైదేహి టిఫిన్లకోసం రెండొందలు ప్లేట్లు ఆర్డర్ చెప్పగా ఓ యాభై ప్లేట్లవరకూ ఆహారం మిగిలిపోయింది. ఉదయం పదకొండు గంటలు అవుతుండగా, ఆ మిగిలిపోయిన టిఫిన్ ఏంచేయాలని... క్యాటరింగ్‌వాళ్ళు వైదేహిని అడిగారు.

"ఎవరైనా అడిగితే పంచెయ్యండి. లేదంటే పట్టుకుపోండి!" క్యాటరింగ్‌వాళ్ళకు చెప్పింది వైదేహి, ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతూ.

వైదేహి మాటలకు క్యాటరింగ్‌వాళ్ళు, "ఎవ్వరికైనా పంచడానికి అంత టైమ్ లేదమ్మా. ఇంకో గంటలో లంచ్ ఏర్పాట్లు చూడాలి కదమ్మా." అన్నారు వినమ్రంగా ఉన్న విషయాన్ని విడమర్చి చెప్తూ.

"ఏదో ఒకటి చేయండి!" అంటూ వైదేహి అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఇదంతా గమనిస్తోన్న విశ్వానికి ఆ ఊరు కాని ఊరులో ఆ పరిస్థితికి ఎలా స్పందించాలో పాలుపోక, కాసేపు నిశ్శబ్దంగా ఆలోచిస్తూండిపోయాడు.

వైదేహి చెప్పినదానికి క్యాటరింగ్‌వాళ్ళు, "సరేనమ్మా..." అంటూ మిగిలిపోయిన ఆహారాన్ని తాము తెచ్చిన ఆటోలోకి హడావిడిగా ఎక్కించి, వడివడిగా వెళ్లిపోయారు. వారి మొహాలను గమనించిన విశ్వానికి ఒక్క విషయం స్పష్టంగా అర్థమైంది, వాళ్ళు ఆ ఆహారాన్ని ఖచ్చితంగా ఎక్కడో పారేస్తారని. వైదేహి మధ్యాహ్నపు భోజనాల ఆర్డర్ కూడా వారికే ఇవ్వడంతో ఓ గంటన్నర తరువాత ఓ మినీవ్యానులో భోజనాలను తీసుకువచ్చారు. క్యాటరింగ్‌వాళ్ళు హడావిడిగా లంచ్‌కి ఏర్పాట్లు చేస్తుండగా, విశ్వం అడగకూడదు అనుకుంటూనే, మనసుని తొలిచేస్తోన్న ప్రశ్నని అడిగాడు, "ఉదయం మిగిలినపోయిన ఆ ఆహారాన్ని ఏంచేసారు?" అని.

"ఎవ్వరికైనా ఇచ్చేందుకు మాకు సమయం లేద్సార్. అంతా ఊరవతల పారబోసాము. మాకిది అలవాటే!" చెప్పాడు క్యాటరింగ్ కుర్రాడు, చాలా క్యాజువల్ విషయమన్నట్టుగా.

అతను చెప్పిన మాటలు చాలావరకూ ఊహించినవే అయినా, విశ్వం మనసుని ఎంతగానో కలతపెట్టాయి. ఓ పదినిమిషాల తర్వాత లంచ్ మహా ఆర్భాటంగా మొదలైంది. ప్లేటు భోజనం వెయ్యి రూపాయలు పడిందని తన తెలిసినవాళ్లకు వైదేహి గొప్పగా చెప్పుకుంటోంది. పదిరకాల స్వీట్లు, పదిరకాల కూరలు, నాలుగు రకాల పచ్చళ్ళతో, నాలుగురకాల రైసులతోనూ

భోజనం... వెయ్యి రూపాయలకు తగ్గట్టుగానే మహా ఆర్భాటంగా 'ఆహా' అనేట్టుగా వుంది.

'ప్లేటు భోజనం ఖరీదు వేయి రూపాయలు' అంటే, విశ్వం ఎంతగానో ఆశ్చర్యపోయాడు. చెల్లెలు చేస్తోన్న వృధాఖర్చులను చూసి తనలోతాను చాలా బాధపడిపోయాడు. ఐదొందల పేట్లు ఆర్డర్ చేస్తే, ఓ వంద పేట్ల వరకూ ఆహారం వృధాగా మిగిలిపోయింది. దాంతో వైదేహి చుట్టుప్రక్కల ఇళ్ళవారికి కబుర్లు పెట్టి పంచగా, తర్వాత కూడా చాలా ఆహారం మిగిలిపోయింది. దాంతో వైదేహి కేటరింగ్‌వాళ్లనే, "పట్టుకుపోండి లేదంటే ఎక్కడో ఊరికి దూరంగా పారేయండి" అంది చాలా ఉదాసీనంగా.

మిగిలిన ఆహారాన్ని అలా పారబోయడం విశ్వానికి ఏమాత్రం నచ్చలేదు. విశ్వం కలగజేసుకుని, "ఇక్కడ దగ్గరలో ఏదైనా హాస్టల్ గానీ, ఆశ్రమం వంటివి గానీ ఉన్నాయా?" అడిగాడు అదుర్దాగా.

విశ్వం అడిగిన కేటరింగ్‌వాళ్ళు, సాయంత్రం వేరేచోటకు కేటరింగ్‌కు వెళ్ళాలని, ఆశ్రమం వాళ్లకు తీసుకెళ్లి ఇచ్చే సమయం లేనందున మళ్ళీ పారబోయ్యడమే తమకున్న ఏకైకమార్గమని అన్నారు. విశ్వం వెంటనే దగ్గరలో గల ఆశ్రమాల కోసం గూగుల్ చేసాడు. అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో వున్న నెంబరుకి కాల్ చేసాడు. వాళ్ళు వచ్చి తీసుకెళ్లేందుకు మనుషులెవరూ అందుబాటులో లేరని, వీలయితే తెచ్చి ఇచ్చేయ్యమని కోరారు. విశ్వానికి ఏమిచేయాలో పాలుపోలేదు. కేటరింగ్‌వాళ్ళని ఆ ఆహారాన్ని ఎలాగైనా అక్కడకు చేర్చమని, అందుకుగానూ కొంతడబ్బును ముట్టజెప్తానన్నాడు. కేటరింగ్‌వాళ్ళు తాము వెళ్ళాల్సింది అటువైపు కాదని, ససేమిరా వీలుకాదని ఖరాఖండీగా చెప్పేసారు. విశ్వం వేరే ఆటో మాట్లాడి, అందులో తీసికెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

కానీ అతని చెల్లెలు వైదేహి, "అంత ఆహారాన్ని తీసుకెళ్లేందుకు సరిపడా పాత్రలు మన దగ్గర లేవన్నయ్యా" అంది నిస్సహాయతని తెలియజేస్తూ. "అన్నయ్యా, పోతేపోనీ! ఆ ఫుడ్ గురించి ఎందుకంత టెన్షన్? వాళ్లే ఎక్కడో పారేస్తారులే..." అంది వైదేహి చాలా క్యాజువల్‌గా.

విశ్వానికి 'పారబోయడం' అనే మాట చాలా బాధను కలిగించింది. ఆ మిగిలిపోయిన ఆహారాన్ని అన్నార్తులకు చేరవేసేందుకు ఎటువంటి అవకాశంలేక ఊరకుండిపోయాడు. క్యాటరింగ్‌వాళ్ళు తమకు రావలిసిన డబ్బులు తీసుకొని, అలవాటుగా ప్రకారం మిగిలిపోయిన ఆహారపు పాత్రలను మినీవ్యానులోకి ఎక్కించుకుని అక్కడనుండి వెళ్లిపోయారు.

ఆ సాయంత్రమే బయల్దేరి భార్యాసమేతంగా తన ఊరు వచ్చేసాడు విశ్వం.

★★★

ఓ నెలరోజుల తర్వాత... విశ్వానికి తన చెల్లెలు వైదేహినుండి ఫోన్ వచ్చింది. "అన్నయ్యా, ఈనెల డబ్బులు పంపించలేదు. అలాగే మా కొత్తింటికి సైడ్ బై సైడ్ పెద్ద ఫ్రిడ్జ్ తీసుకుంటానన్నావు?" అంటూ విశ్వానికి గుర్తుచేసింది.

"అమ్మా వైదేహీ, ఈ నెలనుంచి అదనంగా ఓ ఇఎమ్ఐ చేరిందమ్మా. అందుకని ఇకమీదట నీకు డబ్బులు పంపించడం వీలుకాదు. అలాగే అంత ఖరీదైన ఫ్రిడ్జ్ ఇవ్వగలిగే స్తోమత నాకు లేదమ్మా. ఏమనుకోకమ్మా! మరి ఉంటాను..." అని ఫోన్ కట్ చేసేసాడు.

భర్త మాటలు దూరంగా నిల్చుని విన్న వసుంధర ఎంతగానో ఆశ్చర్యపోయింది. అంతలోనే భర్తలో వచ్చిన మార్పుకి చాలా

ఆనందపడింది. ‘ఇంటికోసం ఇఎమ్ఐలో ఏదో చేరిందన్నారు… అది ఏంటయి ఉంటుందాని’ ఆలోచనలో పడిపోయింది వసుంధర.

దూరంగా నిల్చున్న భార్యని గమనించని విశ్వం తన మొబైల్ తీసి, ఏదో నెంబరుకి కాల్ చేసాడు. అవతలి వాళ్ళు అతని కాల్ లిఫ్ట్ చేయగానే, “ఏమండీ, ఈ నెలనుంచి మీ ఆశ్రమానికి ఓ మూడువేలు పంపిస్తున్నాను. ఆ అకౌంట్ డీటెయిల్స్ వెంటనే పంపించండి” అన్నాడు ఎప్పటిలాగే సాటిమనిషి పట్ల తనకున్న నిఖార్సైన సహజనైజాన్ని ప్రకటిస్తూ.

విశ్వం మాటలను విన్న వసుంధర, ఒక్కసారిగా నీరుగారిపోతూ అలాగే నిశ్చలంగా నిలబడిపోయింది.

సరిగ్గా అప్పుడే దూరంగా నిల్చుని తననే గమనిస్తోన్న తన జీవనసహచరియైన వసుంధరను చూసాడు విశ్వం. నెమ్మదిగా లేచి, భార్య దగ్గరగా నడిచి, “వసూ, ఇంటి ఖర్చులకు ఈ నెల నుంచి ఓ వెయ్యి రూపాయలు అదనంగా మిగులుతాయి. సంతోషమేనా?” అంటున్న భర్త మాటలకు ఏంమాట్లాడాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయిందామె.

విశ్వం, భార్య మౌనాన్ని అర్థం చేసుకున్నట్టుగా “వసూ, నువ్వు ఏమాలోచిస్తున్నావో అర్థం చేసుకోగలను!” అన్నాడు కాస్త అపరాధభావం నిండిన స్వరంతో.

“వసూ, నన్ను అర్థం చేసుకుని, క్షమిస్తావు కదూ! మనిషి కోరికలు అనంతాలు! వాటికి ఏనాటికీ హద్దులు, కొలమానాలూ వుండవు. సాటిమనుషులు కష్టంతో ఉంటే, చూస్తూ మనమెలా ఆనందంగా, ఉదాసీనంగా బ్రతికెయ్యగలం నువ్వే చెప్పు! మనకు కలిగినదాంట్లో కాస్తోకూస్తో సాయం అందించడంలోనే కదా మన బ్రతుకులకు నిజమైన అర్థం, పరమార్థం! నా ఈ ఆశయానికి ఎప్పుడూ తోడుంటావు కదూ!” అంటూ విశ్వం గొంతు పెగుల్చుకోలేక, తడిచేరిన కళ్ళతో భార్య కళ్ళల్లోకి ఆర్ద్రంగా చూసాడు.

అప్పటికే కన్నీళ్ళ పర్యంతమవుతోన్న వసుంధర, “నేను మిమ్మల్ని క్షమించటమేమిటండీ! మీరే నన్ను మన్నించాలి. మీరు మనుష్యుల్లో దేవుడండి! నేను మీ అర్ధాంగినండి! ఎప్పటికీ మీమాటే నాబాట!” అంటూ ఆనందబాష్పాలు రాల్చుతూ భావోద్వేగంతో విశ్వాన్ని అల్లుకుపోయింది.

# కలి(సి)విడిగా...

కోనే నాగ వెంకట ఆంజనేయులు
✆ 9290660220

*“ఆశ్రమం నిర్వహణ బాధ్యత వేరేవాళ్ళెవరికీ అప్పగించకుండా... మీ అత్తయ్యా, నేనూ మాత్రమే చూసుకుంటున్నాం. ఎవరినీ నమ్మలేం కదా ఈ రోజుల్లో. మేము ఉన్నంతవరకూ పరవాలేదు. కానీ మా తరువాత ఈ ఆశ్రమం పరిస్థితి ఏమిటా అని ఆలోచిస్తే జవాబు లేదు. ఒకవేళ ఏ కారణంగానైనా నేనూ, మీ అత్తయ్యా ఒకేసారి చనిపోతే పిల్లలంతా మళ్ళీ అనాథలైపోతారు కదా. అందుకే మా ఇరువురికీ మరణం ఒకేసారి రాకుండా జాగ్రత్త పడుతున్నాం.*

ఆదివారం ఉదయం తొమ్మిదయింది. కాఫీ, టిఫిన్ కానిచ్చేసి ఏదో రాస్తూ కూర్చున్నాను.

ఫోన్ రింగవుతుంటే రాతకు విరామమిచ్చి ఫోన్ లోకి తొంగి చూశాను, అనవసరమైన కాల్ అయితే కట్ చేసేసే ఉద్దేశ్యంతో. తీరా చూస్తే అది సీతారాం మావయ్య దగ్గర నుండి అని ఆయన పేరు కనబడుతోంది ఫోన్ ముఖం మీద! వెంటనే కాల్ రిసీవ్ బటన్ నొక్కి ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని “హలో మావయ్యా” అన్నాను.

“ఏరా బిజీగా ఉన్నావా?” అడిగాడు మావయ్య అటునుండి.

“లేదు మావయ్యా చెప్పండి” అన్నాను, కథ రాస్తున్న డైరీ పక్కన పెట్టేసి.

“ఏం లేదురా! ఆశ్రమంపని మీద నేనూ, మీ అత్తయ్యా ఈరోజు వైజాగ్ వస్తున్నాం విమానంలో!” చెప్పేడు సీతారాం మావయ్య.

“ఇద్దరూ ఒకే విమానంలో వస్తున్నారు కదా?” అడిగేను కుతూహలంగా.

“లేదురా. నా విమానం మధ్యాహ్నం ఒకటిన్నరకి. మీ అత్తయ్యది దానికంటే రెండు గంటల ముందే.. పదకొండున్నరకి వైజాగ్ చేరుకుంటుంది” చెప్పేడు మావయ్య.

“ఏంటిది మావయ్యా. ఇద్దరూ కలిసి చిలకాగోరింకల్లా ఒకే విమానంలో రావచ్చు కదా” నా సహజధోరణిలో హాస్యమాడేను.

“అదిసరే గానీ, అత్తయ్యకి హోటల్ మేఘాలయాలో గది బుక్ చేశాను. విమానాశ్రయంలో తనని రిసీవ్ చేసుకుని నీ కార్లో హోటల్ మేఘాలయాలో దింపాలి, వీలవుతుందా నీకు?” అడిగేడు మావయ్య.

“అయ్యో ఎంతమాట! అలాగే మావయ్యా. మరి నువ్వెక్కడ దిగుతున్నావు?” అడిగేను

“నేను జగదాంబ దగ్గరున్న చిత్రాలయ హోటల్లో దిగుతున్నాను” చెప్పేడు మావయ్య.

“అయితే అత్తయ్యని మేఘాలయ హోటల్‌లో దింపేసి నీ కోసం మళ్ళీ విమానాశ్రయానికి కారు తీసుకు వస్తాను” అన్నాను.

“వద్దొద్దు. నా కోసం నువ్వు మళ్ళీ విమానాశ్రయానికి రావద్దు. నేను కారు బుక్ చేసుకుని తిన్నగా చిత్రాలయ హోటల్‌కి వెళ్ళిపోతానులే. ఫరవాలేదు” చెప్పేడు మావయ్య.

ఇది నాకు ఎప్పుడూ మామూలే కావడంతో నేను ఇంకేం రెట్టించలేదు.

“అలాగే మావయ్యా. చాలా రోజులై పోయింది. ఈసారి మీరిద్దరూ ఓ పూట మా ఇంట్లో భోజనానికి రావాలి మరి” అర్థించాను.

“ఆ విషయం మనం కలిసినప్పుడు మాట్లాడుకుందాంలే. ఫోన్ పెట్టేస్తున్నాను” అంటూ ఫోన్ పెట్టేసాడు మావయ్య.




సీతారాం మావయ్య నాకు పిల్లనిచ్చిన మావగారు కాదు, నా మేనమామా కాదు. మా అమ్మకి అన్న వరస అయ్యే దూరపు బంధువు. పదేళ్ళక్రితం ఓ పెళ్ళిలో నాకాయనతో పరిచయం ఏర్పడింది. నేను కథలు రాస్తానని తెలియడంతో ఆయన నాతో అనుబంధాన్ని కొనసాగించాడు. నన్ను ‘ఏరా’ అని పిలిచేంత చనువు సంపాదించాను నేను ఆయన దగ్గరనుండి ఈ పదేళ్లలో! మావయ్యకిప్పుడు యాభై అయిదేళ్ళు. అత్తయ్యకి ఒకటి తక్కువ యాభై. చక్కని అన్యోన్యమైన దాంపత్యం వాళ్ళది. ఆస్తిపాస్తులకు లోటులేని జీవితం. అయినా అదేమిటో గానీ వాళ్ళకి పిల్లల్ని ప్రసాదించలేదు ఆ భగవంతుడు. ఎన్ని పరీక్షలు చేయించుకున్నా గానీ ఫలితం దక్కలేదు. చివరికి ఎవరినైనా పెంచుకుందామన్న ఆలోచన కూడా చేశారు గానీ... ‘మా అబ్బాయిని పెంచుకోండి’, ‘మా పిల్లని దత్తత తీసుకోండి’ ఇరువైపుల బంధువుల మధ్య పోటీలు, కీచులాటలు పెరగడంతో

ఆ ఆలోచనకు స్వస్తి చెప్పేసారు. అందుకే పదిహేనేళ్ళ క్రితం, గుంటూరుకు దగ్గర్లో అనాథ బాలల కోసం ఓ ఆశ్రమం స్థాపించారు భార్యాభర్తలిద్దరూ ఆలోచించుకుని! ఏ ఆశ్రయం లేని అనాథ బాలబాలికలకు ఆ ఆశ్రమంలో ఉచితప్రవేశం కల్పించారు. వాళ్ల బాగోగులు, చదువుసంధ్యలు, ఆహారవిహారాలు చూసుకుంటూ జీవితం సార్థకం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ ఆశ్రమంలో రెండువందల పై చిలుకు అనాథ పిల్లలున్నారు. అందరినీ తమ పిల్లల్లాగే చూసుకుంటూ వాళ్లకు వసతిగృహాలు, పాఠశాలలు, కాలేజీలు కట్టించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఎల్లవేళలా ముగ్గురు డాక్టర్లు ఆశ్రమంలో అందుబాటులో ఉండి పిల్లల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెడుతుంటారు. ఆశ్రమనిర్వహణ వ్యవహారాలన్నీ వేరే ఎవరికీ అప్పగించకుండా మావయ్యా, అత్తయ్యా ఇద్దరే చూసుకుంటారు మేనేజర్ల సహాయంతో. రెండు మూడునెలలకు ఒకసారి విశాఖపట్టణం వచ్చి, ఆశ్రమం తాలూకు వ్యవహారాలేవో చూసుకుని వెళ్లిపోతుంటారు భార్యాభర్తలిద్దరూ!

విశాఖపట్టణం అనే కాదు... ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ ఒకేరోజు బయలుదేరి వెళతారు గానీ అవకాశం ఉండి కూడా కలిసి ఒకే వాహనంలో గానీ, ఒకే రైల్లో గానీ, ఒకే విమానంలో గానీ ప్రయాణించరు. ఒకే హోటల్లో బస చెయ్యరు. ఒకేసారి ఒక దగ్గరే కలిసి భోజనాలు చెయ్యరు. మా ఇంటికి భోజనానికి పిలిచినా, ఇద్దరిలో ఒకరే వచ్చి భోజనం చేస్తారు మా ఇంట్లో. మరీ బలవంతం చేస్తే మరొకరు ఆ రాత్రి డిన్నర్‌కి వస్తారు. అదే సమయంలో రెండోవారు వారి బంధువుల ఇంట్లోనో, మిత్రుల ఇంట్లోనో భోజనం చేస్తారు. ఏ పొరపొచ్చాలు లేని ఆ దంపతులు... ఈ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అర్థం కాదు నాకెప్పుడూ. ఈసారి ఎలాగైనా ఈ మిస్టరీని ఛేదించాలనే ఆలోచనలో, గట్టి పట్టుదలతో ఉన్నాను నేను.

అత్తయ్యను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకుని నా కారులో హోటల్ మేఘాలయాలో దింపేను. విశాఖపట్టణంలో పనులన్నీ పూర్తి చేసుకున్న మరునాడు మధ్యాహ్నం మా ఇంటికి భోజనానికి రమ్మని పిలిచేను. ఎప్పటిలాగే మావయ్య మా ఇంటికి వస్తే అత్తయ్య గోపాలపట్నంలో ఉన్న వాళ్ల అక్కయ్య కూతురు యింటికి వెళ్ళింది. భోజనం చేసిన తరువాత విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో నా సందేహాన్ని మావయ్య ముందు ఉంచేను.

“ఇదేమిటి మావయ్యా! ఇద్దరూ వేరువేరుగా రావడం, వేరువేరు హోటళ్లలో ఉండడం, వేరువేరు చోట్ల ఆహారం తీసుకోవడం... నాకేం అర్థం కావడం లేదు మీ పద్ధతి!” అడిగేను నిష్ఠూరంగా.

“చెప్పక తప్పదా?” నవ్వుతూ అడిగేడు మావయ్య కాసేపు నిశ్శబ్దం తరువాత.

“చెప్పితీరాలి మావయ్యా. తప్పదు. మా ఇంట్లోవాళ్ళకి కూడా మీ వింత, విచిత్ర ప్రవర్తన అర్థం కాక బుర్ర బద్దలు కొట్టుకుంటుంటారు. మీది అన్యోన్య దాంపత్యం అన్న విషయం మా అందరికీ తెలిసిందే. అయినా మీరిలా ఎందుకు చేస్తున్నారో అన్నది మా అందరికీ ప్రశ్నార్థకమే!” అన్నాను.

“అల్లుడూ! ఇప్పటివరకూ ఈ విషయం ఇంత పట్టుదలగా అడిగినవారు ఎవరూ లేరు. ‘వాళ్ళ సెంటిమెంట్ వాళ్ళది మనకెందుకులే’ అనుకునేవారే అందరూ. నువ్వు పట్టుబట్టేవు కాబట్టి, అదీకాక ఈ విషయం ఒక్కరికైనా తెలియాలి కాబట్టి నీకు చెబుతున్నాను!” అన్నాడు మావయ్య ఉపోద్ఘాతంగా.

నేను కుతూహలంగా చెవులు రిక్కించేను.

“మాకు ఉన్న ఆస్తుల విలువ ఎంతో మాకు కూడా తెలియదు. మా పెద్దలు ఇచ్చిపోయిన ఆస్తిని, నేను ఎన్నోరెట్లు పెంచాను.

మాకు పిల్లలు లేకపోవడం వల్ల మా తరువాత మాకు వారసులంటూ ఎవరూ లేరు కదా. అందుకే మీ అత్తయ్యతో సంప్రదించి అనాథ బాలబాలికల ఆశ్రమం నెలకొల్పేము. ఇది స్థాపించి పదిహేను సంవత్సరాలు అయింది. తల్లీ, తండ్రీ, సంరక్షకులు ఎవరూ లేని పిల్లలకు మాత్రమే ఈ ఆశ్రమంలో ప్రవేశం. ఇప్పటికి ఆశ్రమంలో ఉన్న పిల్లల సంఖ్య 236. అందరూ రెండు, మూడేళ్ళ వయసులో చేరేరు. ప్రస్తుతం ఉన్నవాళ్ళు అందరూ ఇరవై ఏళ్ల వయసు లోపు వాళ్ళే!" ఆగేడు మావయ్య.

"అవును మావయ్యా. ఆ సంగతి నేను క్రితంసారి ఆశ్రమానికి వచ్చినప్పుడు గ్రహించాను" చెప్పేను.

తల ఊపి తిరిగి కొనసాగించాడు మావయ్య. "ఆశ్రమం నిర్వహణ బాధ్యత వేరే వాళ్ళెవరికీ అప్పగించకుండా... మీ అత్తయ్యా, నేనూ మాత్రమే చూసుకుంటున్నాం. ఎవరినీ నమ్మలేం కదా ఈ రోజుల్లో. మేము ఉన్నంతవరకూ పరవాలేదు. కానీ మా తరువాత ఈ ఆశ్రమం పరిస్థితి ఏమిటా అని ఆలోచిస్తే జవాబు లేదు. ఒకవేళ ఏ కారణంగానైనా నేనూ, మీ అత్తయ్యా ఒకేసారి చనిపోతే పిల్లలంతా మళ్ళీ అనాథలైపోతారు కదా. అందుకే మా ఇరువురికీ మరణం ఒకేసారి రాకుండా జాగ్రత్త పడుతున్నాం. ఇద్దరం ఒకేసారి ఒకే విమానంలో గానీ, మరేదైనా వాహనంలో గానీ ప్రయాణిస్తున్నప్పుడు ఆ వాహనానికి ఏ ప్రమాదమో జరిగి, మేమిద్దరమూ ఒకేసారి మరణించవచ్చు. అందుకే మా ప్రయాణాలు వేరువేరు వాహనాల్లో ఉంటాయి. ఒకరికి ప్రమాదం జరిగి చనిపోయినా, మరొకరం బ్రతికి ఉంటాం కదా! ఇద్దరం ఒకే హోటల్లో బస చేస్తే ఆ హోటల్‌కి ఏ అగ్ని ప్రమాదమో జరిగి, ఇద్దరమూ ఒకేసారి చనిపోతామేమో అన్న భయం కూడా ఉంది. అందుకే వేరువేరు చోట్ల బస చేస్తాం. ఇద్దరం ఒకే దగ్గర భోజనం చేస్తే, ఆ భోజనం విషతుల్యం అయితే ఇద్దరం ఒకేసారి మరణించే అవకాశం ఉంది. అందుకే మా భోజనాలు కూడా వేరువేరు చోట్ల ఉంటాయి. అందుకే ఇద్దరిలో ఏ ఒక్కరమైనా బ్రతికి ఉంటే, పిల్లలు మళ్ళీ అనాథలు కాకుండా ఉంటారని మాకు మేమే విధించుకున్న నియమనిబంధనలివి!" వివరంగా చెప్పి ముగించేడు మావయ్య. అంతా విని నేను స్థాణువునై పోయాను. 'అంతదూరం ఆలోచించావా మావయ్యా' అని మనసులో అనుకున్నాను.

'దేవుడా వీళ్ళిద్దరికీ నిండునూరేళ్ళ పరిపూర్ణమైన జీవితం ప్రసాదించు దేవా!' అని నిండుమనసుతో భగవంతుణ్ణి ప్రార్థిస్తూ మావయ్య కాళ్ళకి మొక్కేను.

కథామంజరి
బాలకథ

# స్నేహితులు

మాచిరాజు కామేశ్వరరావు
✆ 9000080396

*రంగడి మాటలు పూర్తి కాక ముందే గుంపుగా కొన్ని వందల మిణుగురు పురుగులు వాళ్ళ ముందుకు వచ్చాయి. వాటి వెలుగులో చిన్నగా అడుగులు వేస్తున్నారు తండ్రీకొడుకులు. కొద్దిదూరం వెళ్ళగానే ఒక అద్భుతదృశ్యం వాళ్ళ కంట పడింది. కొన్నివేల మిణుగురు పురుగులు ఒకచెట్టు క్రింద గుంపుగా ఎగురుతున్నాయి. వాటి మధ్యలో రాణి! రాణి పక్కన తెల్లని బుజ్జి దూడ.*

తిమ్మాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రంగడు, రాజు మంచి స్నేహితులు! రంగడి తండ్రి రాజయ్య వ్యవసాయం చేస్తాడు. రాజు తండ్రి ప్రభుత్వాధికారి. రంగడు, రాజు పాఠశాలలో ఒకే బెంచీమీద కూర్చొనేవారు. కలిసి భోజనం చేసేవారు. సాయంత్రం కలిసి ఆడుకునేవారు. ఒకరిని ఒకరు చూసుకోకుండా ఒక్కరోజు కూడా వుండేవారు కాదు!

ఆ రోజు సాయంత్రం రంగడు బడినుంచి ఏడుస్తూ ఇంటికి వచ్చాడు,

వాళ్ళ అమ్మ కంగారు పడుతూ, "ఏమైంది రంగా, ఎందుకు ఏడుస్తున్నావు?" అని ఆత్రుతగా అడిగింది.

రంగడు "రాజు బడివిడిచి వెళ్లిపోయాడు. వాళ్ళ నాన్నగారికి వరంగల్ బదిలీ అయిందట!" అన్నాడు, ఇంకా ఏడుస్తూనే!

"దానికి మనమేం చేయగలం?" అంది అమ్మ.

"మరి రాజు లేకుండా నేనెలా ఉండగలను? నాకు రాజు కావాలి, అంతే!" అన్నాడు రంగడు మొండిగా.

మర్నాడు బడిలో ఏడుపు మొహంతో వున్న రంగడిని చూసి, "ఏరా రంగా, అలా ఉన్నావేమిటిరా?" అని అడిగాడు మాస్టారు.

రంగడి పక్కబెంచీలో వుండే రాముడు లేచి, "రంగడి స్నేహితుడు రాజు బడి వదిలి వెళ్లిపోయాడు కదా! అందుకే రంగడు ఏడుస్తున్నాడు!" అన్నాడు.

మాస్టారు రంగడికి నచ్చచెబుతూ, "అలా బాధపడితే ఎలా రంగా? మనం మంచిగా వుంటే, ఈ లోకంలో స్నేహితులకు కొదవ ఏముంది? నీ పక్కబెంచీ రాముడితో స్నేహం చేయి. నీ బాధ తీరిపోతుంది!" అన్నాడు.

ఆ తరువాత కొద్దికాలంలోనే రంగడు, రాముడు ఆప్తమిత్రులు అయిపోయారు. ఇద్దరూ కలిసే తిరిగేవారు... కలిసే ఆడుకునేవారు. మళ్లీ పాఠశాలలు తెరవగానే రాముడి మేనమామ, రాముడిని మంచి బడిలో చదివిస్తానని హైదరాబాదు తీసుకు వెళ్ళిపోయాడు.

# స్నేహితులు

‘రాముడులేని బడికి వెళ్లేదే లేదు’ అంటూ నాలుగురోజుల పాటు రంగడు బడికి వెళ్ళకుండా ఇంట్లోనే ఏడుస్తూ వుండిపోయాడు.

తల్లిదండ్రులు ఎంత నచ్చచెప్పినా ససేమిరా అంటూ, “నాకు నా స్నేహితుడు కావాలి! అప్పుడే నేను బడికి వెళ్ళేది!” అంటూ పంతం పట్టుకు కూర్చున్నాడు రంగడు.

ఆ రోజు సాయంత్రం రంగడి తండ్రి ఇంటికి వస్తూనే, “రంగా, ఒకసారి బయటకు రా! నీ స్నేహితుడు వచ్చాడు చూడు!” అన్నాడు,

ఆ మాటలకు బయటకు పరిగెత్తుకు వచ్చాడు రంగడు. బయట ముద్దుగొలిపే తెల్లని ఆవు వుంది. సంతలో ఆ ఆవును కొనుక్కుని వచ్చాడు రంగడి తండ్రి,



“ఇదే నీ కొత్తనేస్తం! ఇది నిన్నువదిలి ఎక్కడికీ వెళ్లదు! ఇక దీని ఆలనాపాలనా నువ్వే చూసుకోవాలి!” అన్నాడు తండ్రి.

ఆవును చూసి ముచ్చట పడిపోతూ, “అలాగే! దీనికి రాజు అని పేరు పెడతాను!” అన్నాడు రంగడు తన స్నేహితుడు రాజును గుర్తు చేసుకుంటూ.

“ఇది ఆవు రా! ఎద్దు కాదు! దీనిని రాజు అని కాదు, రాణి అని పిలుచుకో!” అంది అమ్మ నవ్వుతూ.

అది మొదలు, రాణితోనే రంగడి లోకం అయిపోయింది. ఇంట్లో ఉన్నంతసేపూ దానిదగ్గరే వుంటాడు. పచ్చగడ్డి వేస్తాడు. స్నానం చేయిస్తాడు. అది ఎక్కడ ఉన్నా, రంగడు ‘రాణీ’ అని ఒక్కసారి పిలిస్తే చాలు, పరిగెత్తుకు వచ్చేసేది ఆవు.

కొండడు అనేవాడు రాణీతో పాటు ఊళ్ళో ఉన్న ఆవులనన్నింటినీ ఊరి చివరనున్న మైదానంలోనూ, చిట్టడివిలోనూ మేపుకొని వచ్చేవాడు. ఆరోజు వాడు సాయంత్రమైనా ఇంకా రాణిని తోలుకురాలేదు. రంగడు బడినుంచి వచ్చి రాణికోసమే చూస్తున్నాడు.

బాగా చీకటి పడి, కొండడు ఊళ్ళోవాళ్ళ ఆవులను తోలుకు వచ్చాడు కానీ రాణిని తీసుకురాలేదు.

"మా రాణీ ఏది? కనిపించడం లేదు!" అని ఆత్రుతగా అడిగాడు రంగడు.

ఆ మాటలకు కొండడు భయపడుతూ, "మీ రాణి అడవిలో ఎక్కడో తప్పిపోయింది. ఎంత వెతికినా కనబడలేదు. చీకటిపడుతోందని వచ్చేసాను! రేపు పొద్దున్న వెళ్ళి వెతుకుతాను" అని చెప్పి, మిగతా ఆవుల్ని తోలుకుని వెళ్ళిపోయాడు.

రంగడు తండ్రి రాగానే ఈ సంగతి చెప్పి, "పద నాన్నా, ఇప్పుడే అడవిలోకి వెళ్లి రాణి కోసం వెతుకుదాం!" అన్నాడు ఏడుస్తూ.

తండ్రి వద్దని చెప్పినా వినకుండా, ఆ చీకట్లో టార్చ్‌లైట్ తీసుకుని తండ్రితో బయలుదేరాడు రంగడు. ఇద్దరూ ఒక గంటలో అడవి చేరుకున్నారు. అడవి అంతా అదోరకమైన పూలవాసన! దగ్గరలోనే రకరకాల జంతువుల, పక్షుల కూతలు వినిపిస్తున్నాయి.

"నాన్నా, మన రాణిని ఏ పులీ తినలేదు కదా!" అని భయంగా అడిగాడు రంగడు.

"భయం లేదు. ఈ చిట్టడవిలో పులులు, సింహాలు వుండవు!" అన్నాడు రాజన్న, రంగడి చేతిలో టార్చ్ తను తీసుకుంటూ!

ఆ టార్చ్ వెలుగులో దారి చూసుకుంటూ చిన్నగా నడుస్తున్నారు తండ్రీకొడుకులు.

దారంతా రంగడు, 'రాణీ, రాణీ' అని పిలుస్తూనే ఉన్నాడు. ఎక్కడా రాణి జాడలేదు. ఇంతలో బ్యాటరీ అయిపోవడంతో టార్చ్‌లైట్ ఆరిపోయింది.

చుట్టూ చిమ్మచీకటి! అమావాస్య కావడంతో వెన్నెల వెలుగు కూడా లేదు.

భయంతో తండ్రిచేయి గట్టిగా పట్టుకున్నాడు రంగడు. "దారి ఏదీ కనబడటం లేదు, ఈ చీకట్లో ఎలా నడవాలి?"

రంగడి మాటలు పూర్తి కాకముందే గుంపుగా కొన్నివందల మిణుగురు పురుగులు వాళ్ళ ముందుకు వచ్చాయి. వాటి వెలుగులో చిన్నగా అడుగులు వేస్తున్నారు తండ్రీకొడుకులు. కొద్ది దూరం వెళ్ళగానే ఒక అద్భుతదృశ్యం వాళ్ళ కంట పడింది. కొన్నివేల మిణుగురు పురుగులు ఒక చెట్టు క్రింద గుంపుగా ఎగురుతున్నాయి. వాటి మధ్యలో రాణి! రాణి పక్కన తెల్లని బుజ్జి దూడ.

"మనరాణి క్షేమంగా ఉందిరా రంగడూ! దానికి బుజ్జిదూడ కూడా పుట్టింది. అడవి జంతువులకు నిప్పులంటే భయం కదా! బహుశా అందుకే తోడేళ్ళు, నక్కలు లాంటివి రాణి జోలికి వచ్చి వుండవు!" అంటూ, ఆనందంగా పరిగెత్తుకు వెళ్లి , బుజ్జిదూడను ఎత్తుకున్నాడు రాజన్న.

మిణుగురు పురుగులు... వాళ్ళు అడవి దాటేదాకా ముందు ఎగురుతూ, వాళ్లకు దారి చూపించాయి. వచ్చే ముందు తమ ఆవుదూడలను కాపాడిన మిణుగురులకు, "మీ సహాయం మరచిపోలేము!" అంటూ చేయి ఊపాడు రంగడు.

వాళ్ళు ఇల్లు చేరే సరికి, వీధిలోనే వాళ్ళ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తోంది అమ్మ.

"చూడు అమ్మా, నాకు మరో స్నేహితుడు దొరికాడు. వీడికి రాముడు అని పేరు పెడతాను!" అన్నాడు రంగడు ఉత్సాహంగా.

"ఆ పేరు కాదురా! సీత అని పెట్టు. ఇది ఆడదూడరా!" అంది అమ్మ, దూడను తన చేతుల్లోకి తీసుకుంటూ!

"అలాగే! ఇక రాణి, సీత ఇద్దరూ నా స్నేహితులు!" అన్నాడు రంగడు ఎంతో సంతోషంగా.

కథామంజరి బాలకథ

# కప్పల తక్కెడ

సాయి కమల్
✆ 93914 47562

**"మామా! మనకు కప్పల తక్కెడ వంటి మనసు ఉంటే చాలా కష్టం. ఒకేపని మీద దృష్టి పెట్టకుండా రెండు మూడు పనులు ఒకేసారి మొదలు పెట్టకూడదు. ఒకపని పూర్తి కాకముందే, మరో పనిలోకి కప్పలా దూక వద్దు. ఇలా ఎందులో నిలకడ లేకుండా చేసే పనివలన ఫలితం దక్కదు!"**

అనగనగా ఒక అడవిలో ఒక ఏనుగు, నక్క స్నేహంగా ఉండేవి. నక్క ద్రాక్షపళ్ల వ్యాపారం చేస్తూ బోలెడు కాసులు సంపాదించింది. నక్కలా ఏదైనా వ్యాపారం చేసే తనూ కాసులు సంపాదించాలనుకుంది ఏనుగు!

ఒకరోజు కొబ్బరికాయల వ్యాపారం చేయాలని నిర్ణయించుకుంది. కొబ్బరితోటకు పోయి కొబ్బరికాయల గెల కొని ఇంటికి వస్తుండగా, దారిలో దానికి నక్క కనిపించింది.

"ఏనుగు మామా... ఏనుగు మామా! కొబ్బరికాయల గెల ఎక్కడికి తీసుకుపోతున్నావు?" అడిగింది నక్క.

"అల్లుడూ! నేను ఈరోజు నుంచి కొబ్బరికాయల వ్యాపారం చేయాలనుకుంటున్నాను!" అంది ఏనుగు.

"అలాగా! నీకు కొబ్బరికాయల వ్యాపారంలో అనుభవం లేదు కదా! ఎలా చేస్తావు ?" అడిగింది నక్క.

"కొబ్బరికాయల వ్యాపారం చేయడానికి అనుభవం కావాలా, ఏంటి! తోటకు వెళ్లి గెల కొనక్కొచ్చి, వాటిని కొంచెం ఎక్కువ కాసులకు అమ్మితే, లాభం అదే వస్తుంది!" అంది ఏనుగు.

నక్క మూతిమూసుకుని, అక్కడనుంచి కదిలింది.

ఒకరోజు ఉదయం నక్క నీళ్లు తాగడానికి చెరువుకు పోతుండగా, దారిలో ఏనుగు అగుపించింది.

అది ఈసారి అరటి గెల తీసుకొని రావటం చూసి, "ఏనుగు మామా... ఏనుగు మామా! అరటిగెల ఎక్కడికి పట్టుకుపోతున్నావూ?" అడిగింది నక్క.

"అల్లుడూ... నీకు తెలీదు కదా! నేను అరటిపండ్ల వ్యాపారం మొదలుపెట్టాను" అంది ఏనుగు.

"అవునా! మరి నీకు అరటిపండ్ల వ్యాపారంలో నైపుణ్యం లేదు కదా... ఎలా చేస్తావు!" అడిగింది నక్క.

"తోటకు వెళ్లి గెల తీసుకొచ్చి, మారుబేరానికి అమ్మితే కాసులు అవే రాలుతాయి. దీనికి నైపుణ్యం అవసరమా... ఏంటి!" అంటూ నవ్వింది.




నక్క నోరుమూసుకుని, అక్కడనుంచి బయలుదేరింది.

పదిరోజుల తర్వాత నక్క పక్క అడవినుంచి వస్తుండగా, దారిలో మళ్ళీ ఏనుగు కలిసింది.

అది ఈసారి చెరకు గెడలు తీసుకొని రావటం చూసి, "ఏనుగు మామా... ఏనుగు మామా! చెరకు గెడలు ఎక్కడికి ఎత్తుకుపోతున్నావా?" అడిగింది నక్క.

"ఓ, నువ్వు పదిరోజులుగా అడవిలో లేవు కదా! నేను ఈ మధ్య చెరుకు గెడల వ్యాపారం మొదలెట్టాను!" అంది ఏనుగు.

"మరి నీకు చెరుకు గెడల వ్యాపారంలో ప్రావీణ్యం లేదు కదా, ఎలా చేస్తావు?" అడిగింది నక్క.

"ఈ మాత్రం దానికి ప్రావీణ్యం ఎందుకు... చెరుకుతోటకు వెళ్లి, గడలు తెచ్చి, ఎక్కువ కాసులకి అమ్మితే సరిపోతుంది!" అంది ఏనుగు.

ఇలా ఏనుగు పదిరోజులకి ఒక వ్యాపారం మారుస్తూ వచ్చింది. ఏ వ్యాపారము సక్రమంగా చేయలేదు. అది కప్పలతక్కెడలా ఒక వ్యాపారం నుంచి మరో వ్యాపారంలోకి మారింది.

ఒకరోజు రాత్రి నక్క వ్యాపారం ముగించుకుని ఇంటికి పోతుండగా, దారిలో ఏనుగు ఎదురైంది. ఈసారి అది నీరసంగా వట్టి తొండం ఊపుకుంటూ రావటం చూసి ఆశ్చర్యపోయింది నక్క.

"ఏనుగు మామా! ఏనుగు మామా! రాత్రి పూట ఏమైంది... నీరసంగా ఉన్నావూ? నీ వ్యాపారం ఎలా ఉంది?" అడిగింది నక్క.

"అల్లుడూ! నిద్రపట్టక చెరువు దాకా వెళ్లి వస్తున్నాను. నాకు కొబ్బరికాయల వ్యాపారం, అరటిపళ్ల వ్యాపారం, చెరుకుగడల వ్యాపారం కలిసి రాలేదు. అన్నీ నష్టాలే వచ్చాయి!" అంది దీనంగా ఏనుగు.

"మామా! మనకు కప్పలతక్కెడ వంటి మనసు ఉంటే చాలా కష్టం. ఒకే పనిమీద దృష్టి పెట్టకుండా రెండు మూడు పనులు ఒకేసారి మొదలు పెట్టకూడదు. ఒకపని పూర్తి కాకముందే, మరోపనిలోకి కప్పలా దూక వద్దు. ఇలా ఎందులో నిలకడ లేకుండా చేసే పని వలన ఫలితం దక్కదు!" అంది నక్క.

"అల్లుడూ! నన్ను క్షమించు. వ్యాపారమే కాదు... ఏ పని చేయాలన్నా, మనకు ఆ పని గురించి కొంతైనా తెలిసి ఉండాలి. అప్పుడే మనం మన తెలివితేటలతో ఆ పనిని మరింత ఉన్నతంగా చేయగలుగుతాం! అసలు ఏమీ తెలియకుండా, మొదలు పెట్టడం వలన ఇటువంటి పరిస్థితులే వస్తాయని తెలిసింది!" అంది ఏనుగు.

నక్క దగ్గర ఏనుగు కొంతకాలం నిలకడగా పనిచేసి, వ్యాపారమెలకువలు నేర్చుకుని, అడవికి మరో దిక్కున, ద్రాక్షపళ్ల వ్యాపారం చేసి, కాసులతో పాటు పేరూ సంపాదించుకుంది!

# అమ్మ సహించనిది!

అలపర్తి రామకృష్ణ
✆ 9908587876

**విశిష్ట అతిథి**

*"నా కొడుకు బ్రతికే ఉన్నాడా? ఏదైనా ప్రమాదంలో చనిపోతే, ఆ విషయం చెప్పడానికి తటపటాయిస్తున్నావా? నిజం చెప్పు బాబూ! నువ్వు ఏ విషయం చెప్పినా తట్టుకుంటుంది ముసలి గుండె!"*

*"మీ అబ్బాయి ప్రస్తుతానికి బతికే ఉన్నాడు. పట్నం వెళ్లాక అన్ని విషయాలు మీకే తెలుస్తాయి!"*

*"రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలి, ఆసుపత్రిలో చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడా?"*

*ఆమె ఆదుర్దా పడటం గమనించాడు*

*"అదేం లేదు! సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు కాబట్టి, ఉరి తీయడానికి సిద్ధంగా ఉన్నారు జైలు అధికారులు"*

సాయంత్రం నాలుగైనా ఎండవేడి తగ్గుముఖం పట్టలేదు.

'రోహిణి కార్తె ఎండకు రోళ్ళు బద్దలవుతాయని' అనుకుంది నీలమ్మ.

పశువులు సావిడి శుభ్రం చేసి, గేదెలకు పచ్చగడ్డి వేసి, వేపచెట్టు నీడలో కూర్చుంది.

ఆడకుక్క చుట్టూ పది మొగకుక్కలు చేరి, మీద పడి ఇబ్బంది పెడుతున్నాయి. ఆడకుక్క మొరుగుతూ పక్కకు తప్పుకున్నా, మగకుక్కలు వదలటం లేదు!

నీలమ్మకి కోపం వచ్చి కర్ర తీసుకుని అదిలించింది. ఆడకుక్క స్థిమితంగా చెట్టునీడలో చేరింది.

రోడ్డు మీద నిలబడి, అటు ఇటు దిక్కులు చూస్తున్న ముప్పయ్ ఏళ్ల యువకుడిపై ఆమె దృష్టి పడింది. అతను భుజానికి బ్యాగ్ తగిలించుకొని మొహానికి పట్టిన చెమట ఖర్చీఫ్‌తో తుడుచుకుంటున్నాడు

"ఎవరు బాబు? ఎవరి ఇంటికి వెళ్లాలి?" అడిగింది నీలమ్మ

"పట్నంనుంచి వచ్చాను. నీలమ్మగారి ఇల్లు ఎక్కడ?" తన కోసం ఓ వ్యక్తి వెతుక్కుంటూ వచ్చినందుకు ఆమె సంతోషపడింది.

"చిన్న పూరిల్లు, రెండు పాడిగేదెలు తప్పితే, ఆస్తిపాస్తులు లేనిదాన్ని! పేద పిసుకునేదాన్ని! నన్ను నీలమ్మగారని పిలవనవసరం లేదు!"

"నా పేరు రాంబాబు! మిమ్మల్ని కలవమని నారాయణ పంపించాడు!"

నీలమ్మ కొడుకే నారాయణ!

"నా కొడుకుది నీ వయసే! పట్నం వెళ్లి ఆరేళ్లు అవుతుంది. వాడి జాడే తెలియడం లేదు. నిన్ను చూస్తుంటే నా కొడుకుని చూస్తున్నంత సంబరంగా ఉంది!" అందామె కొడుకుని తలుచుకొని!

★★★

ఇంటర్ తప్పి, తల్లి దగ్గరకు వచ్చి, "పై చదువులు చదవాలి! డబ్బులు కావాలి!" అడిగాడు నారాయణ.

వాడేం చదువుతున్నాడో ఆమెకు తెలియదు... 'బాగా చదువుకుని పెద్ద ఉద్యోగంలో చేరాలి! ఊళ్ళో పిల్లలకు మంచి దారి చూపించాలి! బాగా ఆస్తి సంపాదించి, ఊరిని బాగుచేయాలి! నీలమ్మ కొడుకుని మించినవాడు ఊళ్లో మరొకడు లేడని అందరూ అనుకుంటూ ఉంటే, తనకు సంబరం!' అదీ ఆమె ఆలోచన... అందుకే నారాయణ అడిగినంత డబ్బు ఇచ్చేది.

"ఢిల్లీ వెళ్లి చదువుకోవాలి!" మూడేళ్ళ తర్వాత అన్నాడు నారాయణ

"మన ఊరికి దగ్గరేనా? రోజూ బస్సులో వెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చేయొచ్చా?" ఢిల్లీ ఎంత దూరంలో ఉందో తెలియక అడిగింది నీలమ్మ

"రోజంతా ప్రయాణం. వేగంగా వెళ్లే రైల్లో రోజంతా ప్రయాణం చేస్తే గాని అక్కడ చేరుకోలేం! పెద్దపెద్ద వాళ్లంతా అక్కడే చదువుకుంటారు. చదువయ్యాక, అక్కడే పెద్ద ఉద్యోగంలో స్థిర పడ్డాక, నేను వచ్చి నిన్ను తీసుకువెళ్తాను!"

కొడుకు మాటలు నమ్మింది. ఉన్న ఎకరం పొలం అమ్మి కొడుకు చేతిలో నోట్లకట్టలు ఉంచింది.



రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. నారాయణ ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో ఆమెకు తెలియదు. ఊళ్లో అందరి ఇళ్లల్లో మరుగుదొడ్లు లేవు గాని, సెల్‌ఫోన్‌లో ఉన్నాయి. ఇంట్లో నుంచి వెళ్లిన కొత్తలో, ఊరి సర్పంచికి రెండు మూడుసార్లు ఫోన్ చేశాడు నారాయణ. ఆయన ఓపిగ్గా ఫోన్ తెచ్చి నీలమ్మకి ఇచ్చాడు. సెల్‌ఫోన్‌లో కొడుకు మాట్లాడుతుంటే పొంగిపోయింది.

“మీ వాడు ఏమి ఉద్యోగం చేస్తున్నాడో చెప్పడు. ఎక్కడ ఉంటున్నదీ చెప్పడు. మీ వాడి వాలకం చూస్తుంటే.. ఏదో అనుమానంగా ఉంది నీలమ్మా! మళ్లీ మన ఊరు వాడు తిరిగిరాడు. వాడిని మర్చిపో!” అన్నాడు సర్పంచ్.

నారాయణ నుంచి ఫోన్ కాల్స్ కూడా ఆగిపోయాయి

నీలమ్మకు రెండు పాడిగేదెలు ఉన్నాయి. పాలమ్ముకొని బ్రతుకు వెళ్లబుచ్చుతుంది. ఇంటివెనక వున్న మట్టిదిబ్బ మీద కూరగాయలు పండుతాయి.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి. కొడుకు ఇంటికి తిరిగి రాలేదు.

రోజూ రోడ్డుమీద బస్సు ఆగే చోటు దాకా గేదెలను తోలుకుపోయి, అడ్డరోడ్డు దగ్గర ఆగిన బస్సులు కేసి చూస్తూ ఉంటుంది... ఏదోక రోజు తన కొడుకు సూటు, బూటుతో బస్సు దిగుతాడని!

ఇంటిముందు మంచం వాల్చి రాంబాబును కూర్చోమని చెప్పి, ప్లేటులో వేరుశనకాయలు, బెల్లం ముక్క, మంచినీళ్ల గ్లాసు అతనికి తెచ్చి ఇచ్చింది

“నన్ను చూడాలని మా వాడికి అనిపించలేదు. నువ్వు వెతుక్కుంటూ నన్ను చూడటానికి వచ్చావు. ఎంతో సంతోషంగా ఉంది. మా అబ్బాయి నీకు ఎలా తెలుసు ?” అడిగిందామె.

“మా దగ్గరే ఉంటున్నాడు!” సమాధానం ఇచ్చాడు ఎటో చూస్తూ.

“ఏదైనా ఉద్యోగం చేస్తున్నాడా? వాడిని చూసి ఏడేళ్లవుతుంది!”

“ఏ పనీ చేయాల్సిన అవసరం లేదు. తిండికి లోటు లేదు. నీడపట్టునే ఉంటున్నాడు!”

“కుదురుగా ఉంటున్నాడా?”

“మా దగ్గర అల్లరిపనులు చేసే అవకాశం ఉండదు పెద్దమ్మా!”

“కాసేపు విశ్రాంతి తీసుకో నాయనా! నేను పాలు పితికి, కాఫీ కలుపుకొస్తాను!”

కాఫీ గ్లాస్ ఇచ్చి, అతనికి ఎదురుగా చెక్కపీట వేసుకుని కూర్చుంది

“మా ఊరు ఏం పని మీద వచ్చావ్?”

“మీ అబ్బాయి, మిమ్మల్ని తీసుకు రమ్మని నన్ను పంపించాడు. మిమ్మల్ని చూడాలని ఉందట!”

“వాడే రావచ్చు కదా!”

“అతను రావటానికి వీలుపడదు. రేపు ఉదయం బయలుదేరుదాం పెద్దమ్మా! మీవాడిని చూసాక, మళ్లీ మీరు మీ ఊరు తిరిగే వచ్చేయవచ్చు!”

"మా అబ్బాయితో ఉండటానికి వీలుపడదా?"

"మీరు అక్కడ ఉండలేరు!" అన్నాడు అతను.

'నారాయణ తనను తీసుకురమ్మని మనిషిని పంపించాడంట, మంచి స్థితిలోనే ఉండొచ్చు!' పొంగిపోయింది నీలమ్మ.

వంట ప్రయత్నంలో పడింది.

చీకటి ముసురుకుంది.

మంచం మీద పడుకుని, ఆకాశంలో కనిపిస్తున్న నక్షత్రాలు చూస్తూ ఉండిపోయాడు రాంబాబు. అంత విశాలమైన ఆకాశంలో అన్ని నక్షత్రాలు చూడటం అదే మొదటిసారి. పట్నంలో ఆకాశంలో వేలాది నక్షత్రాలు చూసే అవకాశం ఉండదు. విద్యుత్ దీపాల వెలుగులో నక్షత్రాల సొగసులు కనిపించవు.

అతన్ని నిద్ర లేపింది రాత్రి ఎనిమిది గంటలప్పుడు, "అన్నం తిని నిద్రపో బాబూ!"

వేడివేడి అన్నంలో ఆవకాయ వేసింది. వెన్నపూసముద్ద పళ్లెంలో ఉంచింది. పచ్చడి అన్నం తిన్నాక, బీరకాయ పాలకూర వడ్డించింది. ఆ తర్వాత గడ్డ పెరుగు.

"కమ్మటి భోజనం పెట్టావు పెద్దమ్మా!" అన్నాడు రాంబాబు

కొడుకు గుర్తుకు వచ్చాడు. హాయిగా అమ్మ చేతివంట తింటూ, పచ్చని పొలాల్లో తిరుగుతూ, పెళ్లి చేసుకుని పల్లెటూర్లో ప్రశాంతంగా ఉండొచ్చు కదా!

ఆరుబయట పడుకున్నాడు రాంబాబు... ఆదమర్చి నిద్రపోయాడు ఆ ప్రశాంత వాతావరణంలో!

ఉదయం పూట ఎండ, చెట్ల ఆకుల సందులోనుంచి మీద పడటంతో మెలకువ వచ్చింది. వేపపుల్ల నోట్లో పెట్టుకుని రోడ్డుమీదకు వచ్చాడు.

"నీలమ్మ ఇంటికి పట్నం నుంచి వచ్చింది నువ్వేనా?" యాభై ఏళ్ల వ్యక్తి పలకరించాడు

"అవునండి!" అన్నాడు రాంబాబు.

"నీలమ్మంటే ఊర్లో అందరికీ గౌరవం, అభిమానం! ఎవరికి ఏ కష్టం వచ్చినా అక్కడ ప్రత్యక్షమవుతుంది. ఎవరి గురించి చెడుగా మాట్లాడదు. ఆమె కొడుకు పట్టణంలో బాగా స్థిరపడ్డాడని, ఊర్లో అందరికీ చెప్పుకొని సంబరపడిపోతుందని నాకైతే అనుమానంగానే ఉంది! మాయమాటలు చెప్పి, పట్నం తీసుకువెళ్లి, ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించి కిడ్నీలు అమ్ముకోడు కదా?"

అదిరిపోయాడు రాంబాబు.. ఊళ్లో నారాయణకు అంత పలుకుబడి ఉన్నదన్నమాట!

తను నిద్ర లేవక ముందే, నీలమ్మ ఊళ్ళో అందరికీ తన కొడుకు పట్నం తీసుకువెళ్లటానికి, మనిషిని పంపించాడని చెప్పేసింది అన్నమాట!

అసలు విషయం తెలిస్తే ఆమె మనసు ఎంత బాధపడుతుందో?

పెరట్లో బావిదగ్గర స్నానం చేశాడు. ఉదయం పూట ఎండ మీద పడుతుంటే చన్నీళ్ల స్నానం చేయటం... ఎంతో హాయిగా అనిపించింది.

వేడివేడిగా మినపట్లు వేసి పెట్టింది నీలమ్మ

"బాబూ! మరో రెండు రోజులాగి వెళ్దాం పట్నం!"

"ఎందుకు?"

"ఉన్నపళాన బయలుదేరితే, పాడిగేదెలతో ఇబ్బంది! కొడుకు దగ్గరికి వెళ్ళాక, వెంటనే తిరిగి రావడానికి వీలు పడదేమో! అక్కడే ఉండి పొమ్మంటాడేమో! పాడిగేదేల్ని అమ్మేసి వస్తాను!"

రాంబాబుకు పొలమారింది. దగ్గుతెర పోవడానికి మంచినీళ్ళు తాగమని చెప్పింది ఆమె.

"ఒకరోజు కంటే, మీవాడి దగ్గర ఉండటానికి వీలుపడదు. మీరు తిరిగి వచ్చేయాలి! ఒక్కజత బట్టలు పెట్టుకొని బయలుదేరండి!"

"నెలరోజులు వాడి దగ్గర ఉంటానంటే ఉండనివ్వడా?"

చుట్టుపక్కల వాళ్ళకి తను పట్నం వెళ్తున్నట్టు చెప్పింది. పాడిగేదెల బాధ్యత పక్కింటివాళ్లకు అప్పగించింది.

రాంబాబుతో కలిసి రోడ్డుమీదకు వచ్చింది. సంచి భుజాన తగిలించుకుని. బస్సు కోసం ఎదురు చూస్తూ చింతచెట్టు నీడలో కూర్చొన్నారు.

నీలమ్మలో ఏదో తెలియని అలజడి మొదలైంది

రాంబాబు వైపు పరీక్షగా చూసింది. అతను ఏదో దాస్తున్నాడు. తనకొడుకు గురించి పూర్తి వివరాలు చెప్పడం లేదు.

"నా కొడుకు బ్రతికే ఉన్నాడా? ఏదైనా ప్రమాదంలో చనిపోతే, ఆ విషయం చెప్పడానికి తటపటా యిస్తున్నావా? నిజం చెప్పు బాబూ! నువ్వు ఏ విషయం చెప్పినా తట్టుకుంటుంది ముసలి గుండె!"

"మీ అబ్బాయి ప్రస్తుతానికి బతికే ఉన్నాడు. పట్నం వెళ్లాక అన్ని విషయాలు మీకే తెలుస్తాయి!"

"రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలి, ఆసుపత్రిలో చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడా?"

ఆమె ఆదుర్దా పడటం గమనించాడు

"అదేం లేదు! సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు కాబట్టి, ఉరి తీయడానికి సిద్ధంగా ఉన్నారు జైలు అధికారులు" అన్నాడు... అతను అసలువిషయం ఆమెకు చెప్పాలని నిర్ణయానికి వచ్చి!

గుండె దిటవు చేసుకుని "నా కొడుకు ఏం తప్పు చేశాడు? ఏదో చేయరాని నేరమే చేసి ఉంటాడు. నిన్ను చూస్తుంటే పోలీస్ కానిస్టేబుల్లా ఉన్నావ్! నిజాన్ని దాచకూడదు. అసలు జరిగిందేమిటో చెప్పు నాయనా!"

"నేను పోలీసునని మీరు ఎలా తెలుసుకున్నారు?"

"నేను మా అబ్బాయి దగ్గర ఉంటానంటే నువ్వు కంగారుపడ్డావు. అక్కడ ఉంటానికి వీల్లేదు అన్నావ్! నీ శరీర దారుఢ్యం చూసి, నువ్వు పోలీస్ కానిస్టేబుల్ అని ఊహించాను. ఎంత చెడ్డకబురు చెప్పినా, తట్టుకునే శక్తి నాకుంది!"

"పన్నెండేళ్ళ అమ్మాయి స్కూల్ నుంచి ఇంటికి తిరిగివస్తుంటే, మీవాడు ఆ అమాయకురాలికి మాయమాటలు చెప్పి తనగదికి తీసుకువెళ్లాడు. వారంరోజులపాటు ఆ పిల్లపై అత్యాచారం చేశాడు. ఆ అమ్మాయి తప్పించుకునే ప్రయత్నం చేసిందని గొంతుపిసికి చంపేసాడు. శవాన్ని డ్రైనేజీలో తోసేసాడు. నెల రోజుల తర్వాత బాగా తాగేసి, తననెవరూ పట్టుకోలేకపోయారని విర్రవీగుతుంటే, ఆ మాటలు విన్న అతని స్నేహితుడే పోలీసులకు అసలువిషయం చెప్పేసాడు. పోలీసులు అతని పట్టుకుని చితకబాతితే డ్రైనేజీలో పడేసిన శవాన్ని చూపించాడు. మురుగునీళ్లలో చివికిపోయిన ఆ పిల్ల శవాన్ని బయటకు తీసారు. కోర్టు ఉరిశిక్ష విధించింది నేరం నిర్ధారణ అయ్యాక! చివరి కోరికగా మిమ్మల్ని చూడాలని మీ అబ్బాయి కోరితే, మా పై అధికారి నన్ను పంపించాడు!" జరిగిందంతా వివరంగా చెప్పాడు రాంబాబు.

అన్నెం, పున్నెం ఎరుగని పన్నెండేళ్ళ అమ్మాయి ఏడుస్తూ తన కళ్ళముందు నిలబడి, దిగులుగా తన వైపే చూస్తున్నట్లు అనిపించింది నీలమ్మకు.

ఎవరో భూమిలోకి నొక్కేసినట్లు అనిపించింది.

"నా కొడుకుని చూడాలని అనిపించడం లేదు! నేను రాను. నువ్వు తిరిగివెళ్ళు! నా కొడుకుని ఎంత తొందరగా ఉరితీసారన్న వార్త, నా చెవిలో వేస్తే సంతోషిస్తాను. అటువంటి వాడిమీద ఏ కన్నతల్లీ కనికరం చూపించదు. నువ్వు వెళ్ళిపో!" అంది నీలమ్మ

ఆమె కళ్ళల్లో కన్నీళ్లు ఉబికాయి. ఏ కష్టాన్ని అయినా భరాయిస్తుంది గానీ, ఆడపిల్లకు అన్యాయం జరిగితే తట్టుకోలేదు నీలమ్మ (నేలమ్మ).

కళ్ళల్లో నిలిచిన నీటి బిందువులు నిప్పు కణికలయ్యాయి. ఊరివైపు మెల్లగా నడిచి వెళ్తూ ఉంది.

బస్సు వచ్చింది. ఆ తల్లి పడుతున్న ఆవేదనను అర్థం చేసుకొని బరువెక్కిన హృదయంతో బస్సు ఎక్కాడు పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు!

*('విపుల' మాసపత్రిక డిసెంబర్ 2015 నుంచి పునర్ముద్రణ)*

# మంచి – చెడ్డా

కీ.శే. వీరాజీ

**కథా మార్గదర్శి కథ**

*రమ ఒకసారి పలకరించింది సానుభూతిగా మాట్లాడింది. అంతే! ఒకటి రెండుసార్లు అతని మొహంలోని గుంటలనూ, లోతయిన కళ్లనూ చూసి ఆపుల్ డార్లింగ్ అన్నది రమ! రఘుపతికి పూర్తిగా కనువిప్పు అయింది. నలుపులోని తెలుపు, తెలుపులోని నలుపు పూర్తిగా అవగాహన అయ్యాయి.*

డిసెంబర్ నెల, సాయంత్రం అయిదు గంటలు అవనయినా లేదు. చలి ముమ్మరంగా వుంది. ఎలాగయినా ఆఫీసరు కంటబడకుండా, ఒక్క దమ్ము లాగి, మరొక్క అరగంటలో బయటపడదామనుకున్నాడు రఘుపతి. అరగంట కొట్టింది గోడ గడియారం. ఆ గంట వెచ్చదనంలో, అతనికి టకటక టైపు మిషను శబ్దం చటుక్కున వినిపించి, ఆ కొననున్న రమ కేసి చూసేడు. ఆమె మెడ మీదికి స్వెట్టరు కాలరు లాక్కుని, మడిచిన పొట్లంలాగ కూర్చుని, టైపు మిషన్ను టకటక లాడిస్తున్నది. రఘుపతి అటుకేసి చూడ్డం, ఒక్కసారి కనులెగరేసి గమనించి, వెచ్చగా కిసుక్కుమన్నది! చల్లని గాలికి విండో టకటకమని కొట్టుకుంది.

మళ్ళీ రఘుపతి ఫైళ్ళ గుట్టలో బుర్ర దూర్చేసుకున్నాడు. కానీ, అతగాడి తలకి, రమ కైపునెక్కించి వదిలేసింది. ఎంతట అరగంట అవుతుందా అని అలుక్కుపోయిన అక్షరాల్లో, రమ మొహం చూస్తూ, వుండీ వుడిగీ ఆఫీసరు రూముకేసి బుర్ర తిప్పి, మళ్ళీ రమ కేసి చూస్తున్నాడు.

రమ ఆ ఆఫీసులో టైపిస్టు, నవనాగరికంగా నాజూగ్గా తొలి మలుపులో వున్న యువతి! మగవాళ్ళకి కయిపునెక్కించే గ్లామర్ రమ దగ్గర పుష్కలంగా వుంది.


రఘుపతి అమ్మనీ, నాన్ననీ నూరుమైళ్ళ దూరంలో వదిలి, కడుపు చేత పట్టుకుని, యిక్కడ క్లార్కుగా చేరి, గ్రాడ్యుయేట్ అలవెన్సు తీసుకుంటున్న యువకుడు! నవనాగరికమైన నగరంలో అతడు నేర్చుకున్నది దూబరా. రెండోది రమ స్నేహం!

రమ.. అతగాడికి డాబుగా వుండడం, ఉక్కబోసే నాగరికతలో చల్లదనం, గడ్డ కట్టించే కొత్తదనంలో వెచ్చదనం ప్రసాదించింది.

★★★

రమా, రఘుపతులు థియేటర్లోకి దూసుకుపోడం.. దూసుకుపోయే ఆటోరిక్షాలోంచి ఆఫీసరు చూసి, కనులు కుట్టుకున్నాడు.

ఆఫీసరుగారి ద్వితీయ కళత్రం అందగత్తెకాదని ఎవరూ అనరు. ముఖ్యంగా అతగాడి వేలు విడిచిన పినతండ్రి కొడుకు రాఘవుడు అనడు. కానీ, ఆఫీసరుగారికి రమ అంటే కొంత మోజు వున్నది. అది సాధారణంగా అందమయిన ఆడవాళ్ళందరి మీదా.. అతనికి వున్న సదుద్దేశం, మోజు మాత్రమే!




వృద్ధాప్యంలోనూ, ఎడతెరపి నివ్వని దగ్గుతో మంచం మీద వున్న తన తండ్రి కోసం, మందు తీసుకుని యింటికేసి పోతున్న ఉష.. థియేటర్లోకి దూసుకున్న రమా రఘుపతులను చూసింది. 'అదృష్టవంతురాలు' అనుకుంది రమనుద్దేశించి ఉష! ఉష అదే ఆఫీసులో యింకొక టైపిస్టు. రంగు నలుపు. మోడస్టీ పాళ్లు ఎక్కువ. ఒక విధంగా ఆమె రంగే ఆమెని ఆఫీసరులాంటి 'ఆపద్బాంధవుల' బారి నుంచి తప్పించింది.

కానీ, ఉషకి తన రంగు వల్లనే రఘుపతితో తనకు పరిచయం కలగలేదే అన్న బాధ ఉండిపోయింది. ఉద్యోగం తప్పనిసరి అయి, బ్రతుకు భారమైన కారణంగా కలువరేకుల్లాంటి కళ్లూ, తీర్చి దిద్దిన కనుబొమలూ వున్నా, నీరసించిపోయిన ఉష, రఘుపతి లాంటి కుర్రవాణ్ని ఆకర్షించ లేకపోతే.. అది ఆమె తప్పు కాదు.

ఉష, రమా రఘుపతులు కథలోకి వస్తుందని ఎవరూ అనుకోక పోయినప్పటికీ, నిత్యం ఆఫీసులో మిగిలిన గుమాస్తాల చర్చ మధ్యకి ఉష పేరు కూడా వస్తూ, నలిగిపోతూ వుండేది.

"మిస్టర్ రఘూ! రేపు భీమునిపట్నం పిక్నిక్ పోదామా?" అంటూ కిలకిలమని, బుగ్గమీద వెచ్చగా ఒక్క చిటికె వేస్తూ రమ రఘుపతిని డిమాండ్ చేసింది.

పులకించిపోయి రఘుపతి "సరే" నన్నాడు.

చీకట్లో చెరొక దారి పట్టి పోయారు రమా రఘుపతులు.

చీకట్లోనే జేబు తడుముకున్నాడు రఘు. త్రుళ్ళిపడ్డాడు. ఒక నోటూ కొంత చిల్లరా వుంది. రెండురూపాయల కాయితమో ఒక రూపాయి కాయితమో చూసే ధైర్యం కూడా లేదు అతనికి! తన తండ్రికి ప్రతి నెల కంటే ఆ నెల పది రూపాయలు తక్కువ పంపినట్లు కూడా గుర్తొచ్చింది అతనికి అప్పుడే! కాని, రమ వేసిన చిటికె అతగాడి కింకా ఆ హేమంత రాత్రిలో కురిసే మంచులో వెచ్చగా అనుభూతి యిస్తున్నది.

రమాదాసుడు ఆ అర్ధరాత్రి అరడజను అబద్ధాలాడి, తాను వుండే యింటిగల పూర్వసువాసినిగారి దగ్గర పదిహేను రూపాయలు చేబదులు పుచ్చుకున్నాడు.

హేమంత ఋతువులో పిక్నిక్ వేసుకున్న యీ నాగరిక జంటని ఎవరూ వెక్కిరించలేదు కానీ, రమ మాత్రం చాలా హుషారుగా వుంది. భీమునిపట్టణంలో గల నరసింహస్వామి దేవాలయం దగ్గర, అతగాణ్ణి వెనక్కి వదిలి, కొండ దిగి చరచరమని కదిలింది. తన పాత బంధువులు ఎవరో ఆ వూళ్లో వున్నారనీ, తాను యిలాగ రఘుపతితో వారి కంటబడటం ఉభయత్రా శ్రేయస్కరం కాదనీ చెప్పి, ఒక్క గంటలో తిరిగి వస్తానన్నది రమ.

ఈ లోపుగా రఘుపతి భీమునిపట్నంలోకి తొంగి చూసేడు. అక్కడక్కడ కోట గోడలు, పురాతన చిహ్నాలు, చుట్టూరా కొబ్బరి తోటలు, చిన్న లైట్ హౌసు, పెద్ద మిషనరీ చర్చి, దూరంగా సముద్రంలో కలిసే గోస్తనీ నదీ.. ఇవన్నీ చేతులు కట్టుకుని కొంతసేపూ, జేబులో చేతులు దోపుకుని కొంతసేపూ చూసేడు. అక్కడి పూజారి.. రఘుపతి వింటున్నాడా, లేదా అని గమనించకుండా, పూర్వం ఇక్కడనే భీముడు బకాసురుణ్ణి వధించినాడనీ, ఇప్పటికీ ఆ చిహ్నాలు కొల్లలుగా వున్నాయనీ, నగర ప్రశస్తి చెప్పుకుపోయేడు. భీముడు ప్రతిష్ఠించిన ఆ నరసింహస్వామికి రఘుపతి "నన్ను రమా వల్లభుడను చెయ్యి దేవా!" అని చేతులెత్తి వేడుకొని సగం మెట్ల దాకా దిగి, అక్కడ చతికిలబడి సిగరెట్ కేసు తెరిచాడు.

గబగబా వచ్చి రమ అటూ ఇటూ ఎవరూ లేరు కదా అని చూసి, లేరు లెమ్మని స్థిమితపడి "సారీ!... డార్లింగ్!" అన్నది.

తిరిగి వస్తున్నప్పుడు టాక్సీలోంచి రమ ఎవరికో చేతి రుమాలు వూపడం గమనించీ, గమనించనట్లుగా వూరుకున్నాడు రఘుపతి.

★★★

సోమవారం తెల్లవారింది. రఘుపతి గుండె బెంగ పడింది. తాను.. పోయిన వారం చేద్దామనుకున్న పని చేయలేదు సరి కదా, ఆఫీసరు చేసి ఇమ్మన్న అర్జెంటు పని కూడా అలాగే వదిలేసేడు.

ఫస్టు తారీకు మరి వారం రోజులే వుంది. అప్పులు పోను మిగిలింది, ఇంటికి పంపడానికీ, తనకీ ఎలాగ సరిపోతుందో అర్థం అవలేదు.

రఘూ ఉత్సాహం ఏమాత్రం లేకుండా తన బల్ల దగ్గరికి వెళ్లిపోతూ, టకటకమనే రమ మెషీను కేసి చూసేడు. రమ అక్కడ లేదు. ఆఫీసరు గదిలో నుంచి వస్తున్నది. తెల్లని పద్మంలాంటి కనురెప్పలెత్తి, వాల్చి తన సీటు దగ్గరికి వెళ్లిపోయింది.

రఘుపతి పూర్తిగా చిత్తయి, ఆఫీసరు రూంలోంచి ఇవతల పడ్డాడు. అతను సూచించిన కారణాలన్నీ ఆఫీసరు మొదలంటా త్రుంచి చివాట్లు పెట్టేడు. దైన్యంగా మొహం వ్రేలాడేసుకొని రమకేసి చూసేడు. లాలన, ఓదార్పు వెతుక్కోవాలని ఎంత ప్రయత్నించినా ఏమీ కనిపించలేదు అతనికి ఆమె ముఖంలో!

యథాలాపంగా ఉష టేబిల్కేసి చూసేడు. దూరంగా వుండే ఆమె చెయిర్ కోసం కళ్ళు పూర్తిగా విప్పి చూసేడు. ఉష లేదు.. మెషీను ముసుగు మూసి వుంది. 'ఉష.. నల్ల పిల్ల! ఎంచేత రాలేదు?' అని అనుకుని, మిగిలిన గుమస్తా లిద్దరూ తనకీ జరిగిన పరాభవం గుర్తించలేదు? లెమ్మని, అనుకుని మామూలుగా పనిలో పడిపోయేడు రఘుపతి.

ఉష ఆ రాకపోడం మరి వారం రోజులు రాలేదు. మలి సోమవారం నాడు ఆ పిల్ల ఆఫీసుకు వచ్చింది. ఆమె చేత టైపు మిషను దీనంగా టకటకమని కదులుతున్నట్లు వుంది.

ఉష తండ్రి ఉష జీవితాన్ని ఉష నిర్ణయానికే ఒదిలేసి, బ్రతుకు చాలించుకున్నాడు! తను పోషించి పాలించవల్సిన రెండు పొట్టలకి ఒకటి తగ్గింది.. కానీ, తనని చేతులు చాచి, గుండెల కదుముకుని ఒక్క క్షణమయినా లాలించే అమృత హస్తాలు హరించుకుపోయేయి ఉషకి!

అందరి లాగనే తాను కూడా సానుభూతి చెప్పేడు ఉషకి, రఘుపతి! కానీ, అప్పుడు.. ఆమె అతనికేసి చూసిన చూపుల్లో, లోతులేమీ అర్థం అవలేదు అతనికి. రఘుపతి కసలు లోతుగా, నిశితంగా చూడగల శక్తి మృగ్యం!

రమ కిలకిలమని కెరటాల్లా నవ్వుతూ వుంటే, అతడు ఒడ్డునే ఆడుకుంటాడు.

రఘుపతికి రమతో వున్న నాలుగు ఘడియలూ తప్ప మనశ్శాంతి మృగ్యమయ్యింది. అప్పులు చేయడం అలవాటు అయింది. షైరు, థియేటరు కెళ్లడం లాంటివి నిత్య కృత్యాలయినాయి.

ఒకసారి, ఉదయం ఇంకా చలి విరగకుండానే రోడ్డుమీద తారసిల్లిన ఉష, అతన్ని నిలవేసింది.. "మీరు కొంచెం ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. చనువుగా చెప్పేనని మరేమీ అనుకోవద్దు!" అనేసి, చరచరా కదిలిపోయింది. "థాంక్యు" అని ఆమె వెళ్ళినకేసి ఒకసారి దృష్టి సారించి, "జెలసీ!" అంతే అనుకుని, రఘుపతి హోటల్లోకి చొరబడ్డాడు. వేడి కాఫీ చప్పరిస్తూ, నల్ల పిల్ల ఉషని అప్పుడే మరిచిపోయేడు.

★★★

రెండు టైపుమిషన్లూ టకటకమంటున్నాయి. సూర్యుడు బారెడు మీది కెగబ్రాకి, తెల్లగా కిటికీల్లోంచి ఎండ పడుతున్నది. తెల్లని మొహం మీద నల్లని ముంగురులు పడుతూ, నీలం చీరెలో మెరుస్తున్న రమ, కాయితం తీసి, కాయితం తొడుగుతున్నది.

నల్లని ఛాయలోని మెరుగును ఇనుమడింపజేసే, తెల్లని చీరె ధరించిన ఉష మెషీను ఆపి, రమ కేసి చూసి, "రఘుపతిగా ఎంచేత రాలేదు?" అని అడిగింది.

రమ రుసరుస చూసింది. ఆఫీసరుగారి గదికేసి ఒక చూపు చూసి, మళ్లీ ఉష కేసి తిరిగి, "ఏదో జ్వరంట! అయినా, నన్నెందు కడగాలీ నువ్వు? నేనే మయినా అతని..." అని కోపంలో మాట మింగేసి, మిషిను హాండిల్ని ఖంగుమని ఎడమ ప్రక్కకి లాగింది.

ఉష ఆశ్చర్యపోయింది క్షణంసేపు!

రఘుపతికి అనారోగ్యం అనేసరికి.. తన వాళ్ళెవరో దూరమయినట్లు ఫీలయ్యింది. పన్నెత్తి పలకరించిన పాపాన కూడా పోని రఘుపతి మీద తన కున్న ఈ మక్కువ, ఆందోళనా ఎందుకని పదేపదే తిట్టుకున్నది! కానీ ఆమె తట్టుకోలేక ఆ సాయంత్రం రఘుపతి రూముకి వెళ్లింది. రెండ్రోజుల్లోనే చిక్కి మంచానికి బల్లి అయిపోయిన రఘుపతిని చూసి, ఆమె కళ్లు చెమ్మగిల్లేయి.

రమని తిట్టుకుంది మనసులో ఉష!

మొహమంతా స్ఫోటకం పోసింది రఘుపతికి. ఆదుకుందికి ఉష సిద్ధమయింది. రఘుపతి పసి పిల్లాడిలా ఏడిచేడు. తను తల్లికీ, తండ్రికీ ద్రోహం చేసేనన్నాడు! ఉషని సేవ చెయ్యనివ్వనన్నాడు, ఇంటికి ఉత్తరం రాయనన్నాడు! రమ తననింత అన్యాయం చేసిన తర్వాత, తనకింక ఉషలాంటి సాధ్వి పూడిగం చేయడం తగదని మొత్తుకున్నాడు! అందం పోయిందన్న బెంగ కంటే, అనుకున్న స్వర్గం చేజారిపోయిందన్న విచారం కంటే, రఘుపతికి ఉష 'ఔదార్యం' ఒక సమస్య అయిపోయింది.

"రఘూ! రమని ఒక్కసారి రమ్మని పిలవనా?" అని ఉష నింపాదిగా అడిగిన మాటలకి, రఘుపతి వెక్కి వెక్కి ఏడ్చేడు!

"ఉషా! నువ్వు నాకు తమస్సు వదిలించిన ఉషస్సువి నువ్వు! నన్ను ఇంకా క్షమించవా?" అంటూ వాపోయేడు. "మీకు నలుపంటే కిట్టదని రమ అంటూ వుండేది. పాపిష్టిదాన్ని.. నేను నల్లగా పుట్టేను" అని ఉష తిట్టుకుంది. కానీ అందులోని ఎత్తిపొడుపు రఘూకి గుచ్చుకుంది! తను నలుపు రంగుని ద్వేషించినందుకే తనకి దేవుడు స్ఫోటకం ఇచ్చేదనిపించింది. నల్లని రంగయినా తెల్లని మనస్సున్న ఉష తన నిప్పుడు చేరదీస్తుందా?.. చేరదియ్యాలి అని అతడు భగవంతుణ్ని ప్రార్థించుకున్నాడు.

రఘుపతి కోలుకొని బయటపడేసరికి పూర్తిగా మారిపోయేడు. కృతజ్ఞతతో ఉషని తలెత్తి చూసే ధైర్యం లేకపోతున్నదతనికి. కానీ, ఉష చేతుల మధ్య, తన భవిష్యత్తంతా చిగురించి, పుష్పించగలదని ఎవరో అతని గుండెల్లో పదేపదే చెబుతున్నారు. రమ ఒకసారి పలకరించింది సానుభూతిగా మాట్లాడింది. అంతే! ఒకటి రెండుసార్లు అతని మొహంలోని గుంటలనూ, లోతయిన కళ్లనూ చూసి ఆఫుల్ డార్లింగ్ అన్నది రమ! రఘుపతికి పూర్తిగా కనువిప్పు అయింది. నలుపులోని తెలుపు, తెలుపులోని నలుపు పూర్తిగా అవగాహన అయ్యాయి.

రఘుపతి ఉష హృదయంలో ఉషస్సు చూసుకున్నాడు. రఘుపతి చూపుల మధ్య ఉష అండ జూసుకొన్నది! రమ ఆఫీసర్ చెలిమి చూసుకున్నది!

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1958 నుంచి పునర్ముద్రణ )*

# కథామంజరి
# పాఠకమహాశయులకు
# మనవి!

ప్రతినెలా కథామంజరి సంచిక నమోదు చేసుకున్న పాఠకుల ఇమెయిల్స్‌కి నేరుగా చేరడమే కాకుండా, ఇతర సాంఘికమాధ్యమాలు, కథామంజరి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎంతో మందికి సంచిక చేరుతోంది.

అలాగే పాఠకులు కూడా వారివారి బంధుమిత్రులకు ఈ మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఈ రోజు కథామంజరి దేశ, విదేశాల్లో ఎక్కువ మందికి ఏదో విధంగా చేరుతోంది. పాఠకుల సంఖ్య పెరగడం సంతోషమే! అయితే, సాంకేతికంగా పత్రిక నిర్వహణకు, కొన్ని వెసులుబాట్లకు .. సంచికను చదివే పాఠకుల సంఖ్య తెలుసుకోవడం అసాధ్యమైన పనే! అంచేత మా మనవి ఏమిటంటే.. కథామంజరి చదివే పాఠకులు ప్రతి ఒక్కరు ఇమెయిల్ నమోదు చేసుకోవలసినదిగా కోరుతున్నాం. మీరు ఇమెయిల్ నమోదు చేసుకోడానికి ఈ లింక్‌ని క్లిక్ చేయండి.

| వార్షిక చందా రూ.200/- | ఉచిత సంచిక కోసం |
|---|---|
| *https://imjo.in/ebrJuh* | *https://zcmp.in/K93t* |

పత్రికకు చందా ఐచ్ఛికమే ఐనా చందా కట్టినా, కట్టలేకపోయినా సరే, పత్రిక అందరికి అందుబాటులోనే ఉంటుంది.

**- కథామంజరి బృందం -**